
# అమరావతి

## నవ్యాంధ్ర ప్రజా రాజధాని అయ్యేదెలా?



వడ్డే శోభనాద్రీశ్వరరావు

# వడ్డే శోభనాద్రీశ్వరరావు

## సంక్షిప్త సమాచారం

| | | |
|---|---|---|
| జనకులు | : | లేటు వడ్డే అంకయ్య -శ్రీమతి అన్నపూర్ణమ్మ గార్లు |
| జననం | : | 21-10-1943 ఉయ్యూరులో |
| విద్యార్హతలు | : | బి.ఎస్.సి., బి.ఇ. (మెకానికల్) |
| రాజకీయ ప్రస్థానం | : | 1972లో ఉయ్యూరు నుండి కాకాని గారిపై శాసనసభకు పోటీ<br>1977లో మచిలీపట్నం పార్లమెంటు సభ్యునిగా పోటీ<br>1978-83 ఉయ్యూరు శాసనసభ్యునిగా ఎన్నిక<br>1984-89 విజయవాడ 8వ లోక్‌సభ సభ్యునిగా ఎన్నిక<br>1991-96 విజయవాడ 10వ లోక్‌సభ సభ్యునిగా ఎన్నిక<br>1997-99 న్యూఢిల్లీలో ఎ.పి. ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధిగా నియామకం<br>1999-2004 మైలవరం శాసనసభ్యునిగా ఎన్నిక మరియు రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రిగా కృషి<br>2004 క్రియాశీలక రాజకీయాల నుండి స్వచ్ఛంద విరమణ |
| సామాజిక సేవలు | : | కలువపాముల గ్రామంలో మాతామహుని స్మారకార్థం పశువైద్యశాల మరియు పాల సేకరణ కేంద్ర భవనముల నిర్మాణం |
| | : | గండిగుంట దత్తాశ్రమంలో "వడ్డే శోభనాద్రి ఎ.సి. కళ్యాణ మండపము" నకు రూ. 10 లక్షల విరాళం. |
| | : | ఉయ్యూరు ఎ.జి. & ఎస్.జి. సిద్ధార్థ కళాశాలలో "వడ్డే శోభనాద్రి - యు.జి.సి. మల్టీ పర్పస్ ఇండోర్ స్టేడియం"నకు రూ. 10 లక్షల విరాళం |
| | : | ఉయ్యూరులో లయన్స్ ఇంటర్ నేషనల్ డయాలసిస్ సెంటర్‌నకు రూ. 60 లక్షల విలువ చేయు స్థలం బహూకరణ |
| సందర్శించిన విదేశములు | : | యు.ఎస్.ఎ., బ్రిటన్, ఫ్రాన్స్, జర్మని, నెదర్లాండ్స్, చైనా, సింగపూర్, హాంకాంగ్, ఫిలిప్పీన్స్, శ్రీలంక, నేపాల్ |
| పుస్తక రచనలు | : | ఆంధ్ర రైతు ఆవేదన, దగాపడిన ఆంధ్రరైతు (శాసనసభ ప్రసంగాలు) |
| | : | ప్రజల ఎదురుతెన్నులు - పాలకుల తీరుతెన్నులు<br>(8వ లోక్‌సభలో ఇంగ్లీషు ప్రసంగాలకు అనువాదం) |
| | : | రైతువాణి (10వ లోక్‌సభలో ఇంగ్లీషు ప్రసంగాలకు అనువాదం) |
| | : | దేశం కోసం రైతు - రైతు కోసం ఎవరు?<br>(దినపత్రికలలో ప్రచురించబడిన వ్యాసాల సంపుటి) |
| | : | సమైక్యతతోనే తెలుగు జాతి ప్రగతి |
| | : | అమరావతి - నవ్యాంధ్ర ప్రజా రాజధాని అయ్యేదెలా? |
| | : | గోరంత పెట్టుబడితో సింగపూర్ సంస్థలకు కొండంత లబ్ధి |
| ప్రచురించిన | : | కిసాన్ ప్రధాని - చౌధురి చరణ్‌సింగ్ |
| పుస్తకములు | : | అపర భగీరథుడు డా॥ కె.ఎల్.రావు (క్యూసెక్స్ క్యాండిడేట్ అనువాదం)<br>గాంధేయపథంలో (ఇన్ ది గాంధేయన్ పాత్‌నకు అనువాదం)<br>ప్రజాసేవలో నా జీవన ప్రస్థానం (ఆత్మకథ) |

# అమరావతి నవ్యాంధ్ర
# ప్రజా రాజధాని అయ్యేదెలా?

వడ్డే శోభనాద్రీశ్వరరావు

₹ 20

# విషయసూచిక


1. అమరావతి నవ్యాంధ్ర ప్రజారాజధాని అయ్యేదెలా? .............................. 07

2. స్వల్ప వ్యయంతో కొత్త రాజధాని .................................................. 14

3. 'నాగార్జున'లో తాత్కాలిక రాజధాని ............................................. 18

4. నవ్యాంధ్రప్రదేశ్ శీఘ్రంగా అభివృద్ధి అయ్యేది ఎలా? ............................ 21

5. ప్రజామోద యోగ్యమైన నవ్యాంధ్ర రాజధాని నిర్మించుకొందాం ......... 26

6. అమరావతి రాజధాని అమరావతి సమీపాన స్థల నిర్ణయం సబబేనా? .. 31

7. నవ్యాంధ్ర ప్రజా రాజధానికై సింగపూర్ ప్రతిపాదన సరైనదేనా? ........ 33

8. భూములిచ్చిన రైతులకు, వ్యవసాయానికి న్యాయం చేయాలి ............ 37

9. గోరంత పెట్టుబడితో సింగపూర్ కన్సార్షియంనకు కొండంత లబ్ధి........... 41

10. నిర్వీర్యమైన ఎ.పి. ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ అథారిటి ................................ 46

11. ఎ.పి.లో గాడి తప్పుతున్న ఆర్థిక క్రమశిక్షణ ................................ 52

12. బుల్లెట్ రైళ్ళకన్నా రైల్వే వ్యవస్థ ఆధునీకరణకు .......................... 58
అధిక ప్రాధాన్యత ఇవ్వాలి

12. ఎ.పి. టౌన్ షిప్ & ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పోరేషన్.............. 61
(A.P.T.I.D.C) ఆధ్వర్యంలో "ప్రధానమంత్రి ఆవాస్ యోజన - ఎన్.టి.ఆర్. నగర్ పథకం" ప్రక్రియను పునఃపరిశీలించి నగర/పట్టణ పేద లబ్దిదారులపై పెనుభారం మోపరాదు

13. ముఖ్యమంత్రి గారికి లేఖలు ........................................................ 63

# ముందుమాట

మనదేశములో మొట్టమొదటి భాషాప్రయుక్త రాష్ట్రముగా ఆంధ్రప్రదేశ్ ఏర్పడింది. అనేక కోణాలలో గణనీయమైన ప్రగతి సాధించబడినా, కొద్దిమంది స్వార్ధపరుల పదవీకాంక్ష కొరకు కృత్రిమ కారణాలతో, అబద్ధపు ఆరోపణలతో తెలుగుజాతి రెండు రాష్ట్రములుగా చీల్చబడింది. ఒక్క సి.పి.యం. (మార్క్సిస్టు) పార్టీ మినహా మిగిలిన రాజకీయ పక్షాలన్నీ విభజనకు అంగీకరించాయి. ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టములో పేర్కొనబడిన హామీలు నేటికి కొన్ని అమలు కాలేదు. ఉమ్మడి ఆస్తులు మరియు ఉమ్మడి సంస్థల విభజన ప్రక్రియ ఇప్పటికి జరుగలేదు. కేంద్రము నుండి నవ్యాంధ్రకు విభజన చట్టములో పేర్కొనబడిన విద్యాసంస్థలు మినహాగా, కడప ఉక్కు కర్మాగారము, కేంద్ర నిధులతో మేజర్ పోర్టు నిర్మాణము మున్నగు హామీలు కార్యరూపము దాల్చనేలేదు. కేంద్రప్రభుత్వ విధివిధానాలను అనుసరించి తప్ప అనేక విధాలుగా నష్టమునకు గురిఅయిన నవ్యాంధ్రప్రదేశ్ రాష్ట్రానికి అదనముగా నిధులు రాలేదు.

ఈ నేపథ్యములో గతములో గాడితప్పిన పాలనా వ్యవస్థను సరిదిద్ది మంచి పాలనను అందిస్తారని తొమ్మిది సంవత్సరాలు ముఖ్యమంత్రిగా పని చేసిన అనుభవము ఉన్న చంద్రబాబు నాయుడు గారికి ప్రజలు పట్టం కట్టారు. సామాన్య ప్రజానీకము సన్నకారు, చిన్న రైతులు, కౌలు రైతులు, గ్రామీణ పట్టణ పేద ప్రజలు వారి దైనందిన జీవితాలలో ఎదుర్కొంటూ ఉన్న సమస్యలను పరిష్కరిస్తూ, వారికి కనీస సౌకర్యములు కల్పిస్తూ, మెరుగైన పాలనను అందించటం పైన దృష్టిపెట్టకుండా, నిధులు లేకపోయినా, రాష్ట్రప్రభుత్వం పైన రుణభారము నానాటికి పెరిగిపోతూ ఉన్నా, 20/25 సం.ల తరువాత కాని అవసరము కానట్టి మెట్రో రైలు ప్రాజక్టు, రాష్ట్ర ప్రభుత్వ స్థాయిలో వందేళ్ళ తరువాత కూడా సాధ్యము కానటువంటి "హైపర్ లూప్ ప్రాజెక్టు" అనంతపురము నుండి అమరావతికి రెండు ప్రత్యామ్నాయ జాతీయ రహదారులను అభివృద్ధి చేసేందుకు కేంద్రము

అంగీకరించినా, 200 మీటర్ల వెడల్పుతో తిన్నగా ఎక్స్‌ప్రెస్ హైవే మున్నగు అసంబద్ధ ప్రతిపాదనలతో, కాలము గడుపుతూండడము సాధారణము అయ్యింది. పాలనా వ్యవస్థలో అవినీతి పెరిగిపోయింది. ప్రభుత్వ నిర్ణయాలలో పారదర్శకత మరియు హేతుబద్ధత లోపించాయి. అవసరానికి మించి 2013 కేంద్ర భూసేకరణ చట్టం నిబంధనలను ప్రక్కనబెట్టి వేలకువేల ఎకరాల భూములను రైతుల నుండి, పేదల నుండి బలవంతంగా గుంజుకుంటూ బడా పారిశ్రామిక వేత్తలకు / వ్యాపారవేత్తలకు కట్టబెట్టడం ఎంతమాత్రమూ తగదు.

ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన వాగ్దానాల అమలుకు చిత్తశుద్ధితో కృషిచేయవలసిన అవసరము ఎంతైనా ఉన్నది. ఎన్.టి. రామారావు గారు శంకుస్థాపన చేసిన పలు ఇరిగేషన్ ప్రాజెక్టులు, వై.ఎస్. ప్రభుత్వము 80 నుండి 85 శాతము పనులను చేయగా మిగిలిన పనులకు ఎస్టిమేట్లను చాలా అధికముగా పెంచివేస్తూ అస్మదీయులకు కట్టబెట్టుచూ ఉండటము ఎంతమాత్రము సరిగాదు. వ్యవసాయము, విద్య, వైద్యము, త్రాగునీరు, పేదలకు గృహనిర్మాణము, శానిటేషన్ మున్నగు అంశాల పట్ల ప్రభుత్వము దృష్టిని సారించి నవ్యాంధ్రప్రదేశ్‌ను స్వర్ణాంధ్రప్రదేశ్‌గా అభివృద్ధి చేయాల్సి ఉంది. అమరావతి రాజధాని బడా పెట్టుబడిదారులకు, కాంట్రాక్టర్లకు కాసులు కురిపించేదిగా కాక, ప్రకృతి ప్రసాదించిన బంగారు జరీబు భూములలో రాజధాని ప్రజలకు కావలసిన స్వచ్ఛమైన మంచినీటిని, పూలు, పండ్లు, కూరగాయలు, ఆహారధాన్యాలను అందిస్తూ, స్వయం పోషకత్వాన్ని సాధించి ప్రజారాజధానిగా వెలుగొందాలన్న లక్ష్యముతో ఇందులోని వ్యాసాలను రచించడం జరిగింది. రాష్ట్రప్రగతి, సుపరిపాలన మరియు ప్రజాహితము కోరికతో తప్ప ప్రభుత్వాన్ని కాని, అందులోని పెద్దలను కాని, విమర్శించడము కొరకు కాదని స్పష్టము చేయుచున్నాను.

– వడ్డే శోభనాద్రీశ్వరరావు

* * *

# అమరావతి నవ్యాంధ్ర ప్రజారాజధాని అయ్యేదెలా?

సీమాంధ్రలోని 5 కోట్ల తెలుగు ప్రజల అభీష్టానికి భిన్నంగా మనదేశంలో మొట్టమొదటి భాషా ప్రయుక్త రాష్ట్రంగా ఏర్పరచబడ్డ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం విభజించబడింది. నవ్యాంధ్రప్రదేశ్‌కు రాజధాని ఎక్కడ అన్న విషయం విభజన చట్టంలో పేర్కొనబడలేదు. కేంద్ర ప్రభుత్వం కె. శివరామకృష్ణన్ ఆధ్వర్యంలో ఒక సాంకేతిక నిపుణుల కమిటీని ఏర్పాటుచేసింది.

ఎ. ఎక్కువ మంది ప్రజలు, నివాసాలను తొలగించబడకుండా.

బి. వరదలు, తుఫానులు, భూకంపముల వంటి ప్రకృతి వైపరీత్యాలు సంభవించగల పరిస్థితులను అంచనా వేసుకొని.

సి. సాధ్యమైనంత తక్కువ భూమిని సేకరించేలా, తక్కువ వ్యయంతో నిర్మాణం జరిగేలా.

డి. యిప్పటికే వున్న వ్యవసాయ పంట పొలాలను సాధ్యమైనంత వరకు తొలగించబడకుండా వుండేలా, పరిగణనలో వుంచుకుని నూతన రాజధానికి అనువైన ప్రదేశమును సూచించవలెనని శివరామకృష్ణన్ కమిటీకి కేంద్రప్రభుత్వం మార్గదర్శకాలను సూచించింది.

రాజధాని నిర్మాణానికి అవసరమైనచో కేంద్రప్రభుత్వం అటవీ భూములను డీనోటిఫై చేసి అందించగలదని విభజన చట్టంలో స్పష్టంగా పేర్కొనబడింది. కృష్ణా జిల్లాలో నూజివీడు–ఆగిరిపల్లి ప్రాంతములలో దాదాపు 20 వేల ఎకరముల పైన అటవీ భూములు (డిగ్రేడెడ్ ఫారెస్ట్ భూములు) వున్నాయి. సమీపంలో జాతీయ రహదారి నెం.5, జాతీయ రహదారి 221, గన్నవరం వద్ద విమానాశ్రయం, పోలవరం కుడికాలువ, మున్నగునవి అందుబాటులో వున్నప్పటికీ, వాస్తురీత్యా గుంటూరు జిల్లా లోని అమరావతి ప్రాంతం అత్యంత అనుకూలంగా వుండునని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నది.

**అమరావతి రాజధాని ప్రాంతం పరిస్థితి**

భారీ వర్షములు కురిసినప్పుడల్లా కొండవీటివాగు, పాలవాగు మున్నగు వాటి వలన దాదాపు 10 వేల ఎకరాలకు పైగా భూములు ముంపునకు గురిఅవుతూ

వుంటాయి. గతంలో ఇరిగేషన్ శాఖ, పలు ప్రయత్నములు చేసినా ఈ ముంపును సంతృప్తికరంగా పరిష్కరించలేక పోయింది. ఈ ముంపునకు గురిఅగు భూములను రూ.1500కోట్ల ఖర్చుతో 2 మీటర్ల ఎత్తున మెరక చేయవలెనని సి.ఆర్.డి.ఎ. ప్రతిపాదించింది. ఇటీవల రాష్ట్రప్రభుత్వం సుమారు 270 కోట్లు ఖర్చుతో పంపులను, జనరేటర్లను ఏర్పాటు చేసి కృష్ణా నదిలోనికి, కృష్ణా పశ్చిమ ప్రధాన కాలువ లోనికి కొండవీటి వాగునీటిని పంపించేందుకు ప్రయత్నం చేస్తూ వుంది. వాతావరణంలో వస్తున్న పెనుమార్పులు, గ్లోబెల్ వార్మింగ్ వలన వర్షపాతం, తుఫానులు, మున్నగునవి చాలా ప్రమాధకర స్థాయిలో సంభవించగల పరిస్థితులు వున్నాయని వాతావరణ నిపుణులు హెచ్చరిస్తూ వున్నారు. ఉత్తరాఖండ్‌లో, నెల్లూరులో, చెన్నయ్‌లో అధిక వర్షాల వలన ప్రజలకు, ఆస్తులకు భారీ నష్టాలు సంభవించాయి. ప్రభుత్వం చేసే ప్రయత్నం కొంత మేరకు ఉపయోగపడుతుందికాని, అతి భారీ వర్షపాతం ఆ ప్రాంతములో సంభవించినప్పుడు చాలా పెద్ద ఎత్తున నష్టం జరిగే ప్రమాదం వుంటుంది.

**ప్రకృతి ప్రసాదించిన అపూర్ణమైన వరం జరీబు భూములు:**

కృష్ణా నదికి పూర్వం కుడికట్ట లేదు. కొన్ని వేల సంవత్సరముల క్రితం నుండి ప్రవహించగా ఇసుక, సారవంతమైన ఒండ్రుమట్టి పొరలు పొరలుగా ఏర్పడిన భూములు ఈ జరీబు భూములు, స్వాతంత్ర్యానంతరం కృష్ణా కుడి వరద కరకట్ట ఏర్పర్చబడింది. కరకట్టకు ఆనుకొని దక్షిణం వైపున సుమారు 2.5 కి.మీ. వెడల్పుతో వైకుంఠపురం నుండి ఉండవల్లి వరకు వున్న సుమారు 11,250 ఎకరముల విస్తీర్ణంలో ఈ జరీబు భూములు వున్నాయి. సంవత్సరం పొడవునా పలు రకముల ఆకుకూరలు, కూరగాయలు, మల్లి, చేమంతి, బంతి, కనకాంబరాలు, మున్నగు పూలు, అరటి, నిమ్మ, మామిడి, జామ, సపోట వంటి పండ్లతోటలతో కోనసీమను మించిన ప్రకృతి సౌందర్యంతో ఈ ప్రాంతం కళకళలాడుతూ వుంటుంది. వేలాది రైతు కుటుంబములతో పాటు, కౌలు రైతులు, వ్యవసాయ కార్మిక కుటుంబాలకు ఉపాధి, ఆదాయం సమకూరుతూ వుంటాయి. ఇక్కడ స్థానికులకేకాక ప్రతిరోజు వందలాదిమంది సమీప గ్రామాల నుండి ఈ భుములలో పనిచేయుటకు వస్తూ వుంటారు.

అటువంటి ఈ జరీబు భూములలో యిప్పుడు ప్రభుత్వం వారు ప్రభుత్వ భవనముల సముదాయం, సెంట్రల్ బిజినెస్ డిస్ట్రిక్, పర్యాటక అభివృద్ధి పేరుతో కొంత భాగాన్ని "కాంక్రీట్ జంగిల్" గాను, కొంత భాగాన్ని పచ్చని తివాచీలుగా (లాన్స్) గాను ఏర్పాటు చేయాలని ఆలోచించడం ఎంతమాత్రమూ సరికాదు. "దేశమంటే మట్టికాదోయ్, దేశమంటే మనుషులోయ్"అన్న గురజాడ సూక్తిని మరువరాదు. భవిష్యత్తులో రాజధాని నగరంలో నివసించబోయే ప్రజలకు అవుసరమగు వ్యవసాయ, ఉధ్యాన ఉత్పత్తులనే కాక, డైరీ, పౌల్ట్రీ, ఫిషరీస్ రంగాలను కూడా ప్రోత్సహించుతూ, తోడ్పాటును యిస్తూ, వేలాదిమందికి ఉపాది అవకాశాలను కూడా కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపైన వుంది.

**జరీబు భూములలో తరగని జల నిధి:**

జరీబు భూములలో 15-20 అడుగుల లోతు నుండి త్రాగుటకు మంచినీరు లభిస్తుంది. కొండవీటి వాగు వలన, వర్షపాతము వలన, కృష్ణానదిలో ప్రవాహము వలన జరీబు భూముల లోపల జలాశయములు ఏటా రీచార్జ్ అవుతూ వుంటాయి. పర్యావరణ శాస్త్రవేత్తల అంచనాలు ప్రకారం ఈ జరీబు భూముల నుండి ఏటా 60 మిలియన్ క్యూబిక్ మీటర్ల త్రాగునీరు లభించుటకు వీలుంది. ప్రస్తుత అంచనాల ప్రకారం దీని విలువ రూ.900 కోట్లు వుంటుంది. 10 లక్షల జనాభా వరకు ఈ 60 మిలియన్ క్యూబిక్ మీటర్ల త్రాగునీరు సరిపోతుంది.

**అమరావతి సహజ నగరం:**

కృష్ణా కుడి కరకట్టకు దక్షిణం వైపున సుమారు 2.5 కి.మీ. వెడల్పున వైకుంఠపురం నుండి ఉండవల్లి వరకు వున్న జరీబు భూములను వ్యవసాయ అనుబంధ వ్యాపకాల కొరకు కేటాయించడం వలన రాజధాని నగర ప్రజలకే కాక విజయవాడ, గుంటూరు మున్నగు సమీప ప్రాంతాల ప్రజలకు అవుసరమగు ఆహార ఉత్పత్తులు లభించుతాయి. ప్రస్తుతం ప్రభుత్వం రూపొందించిన అమరావతి రాజధాని నగర విస్తీర్ణంలో తుళ్ళూరు, అనంతవరం, నెక్కల్లు, దొండపాడులో కొంత భాగం భూములు వాగుల ముంపునకు గురిఅయ్యే అవకాశం లేదు. కావున ప్రభుత్వం నిర్మించతలపెట్టిన ప్రభుత్వ భవనముల సముదాయము, సెంట్రల్ బిజినెస్ డిస్ట్రిక్ మున్నగువాటిని, ఈ గ్రామాల భూములలో ఏర్పాటు చేయటం మంచిది. అవుసరమైతే కంతేరు సమీప మెట్ట గ్రామములలో కొంత భూమిని తీసుకొనవచ్చును.

**నవ నగరాలు - ఉపాది అవకాశములు - జనాభా - పెట్టుబడులు మున్నగు అంశముల అంచనాలకు - వాస్తవ పరిస్థితులకు పొంతనలేదు:**

అమరావతి రాజధాని నగరములోని 29 గ్రామములలోని ప్రస్తుత జనాభా 3.8 లక్షలుగా వుండగా 2050 నాటికి 25 లక్షలకు పెరుగుతుందనే అంచనా సరికాదు. హర్యానా, పంజాబ్ మరియు కేంద్రపాలిత చండీఘడ్ రాజధాని నగర జనాభా 1981లో 4.5 లక్షలుగా వుండగా 2011 నాటికి 13.3 లక్షలకు మాత్రమే చేరిందన్న వాస్తవాన్ని విస్మరించరాదు.

వాణిజ్య అవుసరాల కొరకు 77 కోట్ల చ.అ. విస్తీర్ణం అవసరం ఉంటుందని, మొత్తంగా ఫ్లోర్‌స్పేస్ 227 కోట్ల చ.అ. అవసరం ఉంటుందనే అంచనా సరికాదు. రహదారులు, డ్రెయిన్‌లు, విద్యుత్, మున్నగు మౌలిక వసతుల కల్పనకు రూ.41,235 కోట్లు అవుసరమని సి.ఆర్.డి.ఎ. అంచనా వేసింది. కృష్ణా జిల్లాలో నూజివీడు-ఆగిరిపల్లి, మల్లపల్లి ప్రాంతములలో వేలకువేలు ఎకరములను, దొనకొండ ప్రాంతములలో 20 వేలు ఎకరాలకుపైగా పారిశ్రామిక ప్రగతి కొరకు కేటాయించుతూ ఉండగా రాజదాని

నగరములో 2వేల ఎకరాలను పరిశ్రమల కొరకు కేటాయించవలసిన ఆవశ్యకత వుండదు.

పంట పొలాలను మాయంచేస్తూ రాజధాని నగర విస్తీర్ణంలో 29.5 శాతం భూమిని పచ్చని తివాచీలు, లాన్లు, కాలువల క్రింద కేటాయించడం ఏ రకంగా సబబు.

| నవ నగరాలు | గ్రామాలు | జనాభా | ఉపాధి అవకాశాలు | నగరమునకు భూమి కేటాయింపు | నగరములో సంస్థలకు అవసరమగు భూమి |
|---|---|---|---|---|---|
| | | | ఎకరాలు | ఎకరాలు | |
| 1) ఆర్థిక నగరం (సి.బి.డి) | | 2,00,000 | 4,30,000 | 5,168 | 1,415 |
| 2) ఆరోగ్య నగరం | నవులూరు<br>పెనుమాక<br>కృష్ణాయపాలెం | 3,30,000 | 1,05,000 | 6,511 | 626 |
| 3) నాలెడ్జ్ నగరం | తుళ్ళూరు<br>ఐనవోలు<br>నీలుకొండ | 6,00,000 | 1,20,000 | 8,547 | 2,200 |
| 4) ప్రభుత్వపాలన | | 2,22,000 | 58,500 | 2,702 | 1,400 |
| 5) న్యాయనగరం | నేలపాడు<br>కృష్ణాయపాలెం | 2,20,000 | 90,000 | 3,438 | |
| 6) ఎలక్ట్రానిక్స్ నగరం | కురగల్లు,<br>నిడమర్రు | 2,80,000 | 2,73,500 | 6,582 | 1,827 |
| 7) స్పోర్ట్ నగరం | బోరుపాలెం<br>అబ్బరాజుపాలెం<br>పిచ్చుకలపాలెం<br>దొండపాడు | 2,40,000 | 1,05,000 | 4,150 | 1,625 |
| 8) మీడియా నగరం | అనంతారం<br>నెక్కల్లు | 2,78,000 | 1,53,500 | 5,107 | 1,578 |
| 9) పర్యాటక నగరం | ఉండవల్లి<br>తాడేపల్లి | 1,30,000 | 1,53,500 | 11,594 | 1,316 |

పైన పేర్కొనబడిన అంచనాలకు వాస్తవ పరిస్థితులకు ఎంతమాత్రమూ పొంతనలేదు:

ఉదాహరణకు పర్యాటక నగరమునకు 11,594 ఎకరాలు భూమి కేటాయించబడింది. ఇందులో 8778 ఎకరములను ఓపెన్ స్పేస్‌గా ఉంచుటకు 1397 ఎకరములను రెసిడెన్సియల్ క్వార్టర్స్ కట్టుటకు 451 ఎకరములను కమర్షియల్ అవసరాలకు 154 ఎకరాలను ప్రత్యేక జోన్‌గానూ వినియోగించాలని నిర్ణయించబడింది. హోటల్/రిసార్ట్స్ కొరకు 790 ఎకరములు, గోల్ఫ్ కోర్సుల కొరకు 384 ఎకరములు కేటాయించినట్లు చూపబడింది. సింగపూర్‌లో సెంతోషా ఐలాండ్‌లో "ఇంటిగ్రేటెడ్ రిసార్ట్, వరల్డ్ సెంతోషా" 121 ఎకరముల విస్తీర్ణములో ఉంది. దీనిపైన రూ.30,000 కోట్లు వెచ్చించబడింది. అలాగే సింగపూర్‌లోనే "మెరీనా బే రిసార్ట్స్" దాదాపు రూ.30,000 కోట్ల వ్యయంతో 50 ఎకరముల పైన నిర్మించబడింది. సింగపూర్‌లో అమెరికా, జపాన్, యూరోపియన్ యూనియన్‌కు చెందిన 7వేల బహుళజాతి సంస్థల కార్యాలయాలు, 1500 చైనీస్ కంపెనీల కార్యాలయాలు ఉండి వాటిల్లో చాలా భారీ వేతనాలు పొందుతూ ఉండే ఉద్యోగులు మరియు విదేశాల నుండి స్వల్పకాలిక వినోదాల కొరకు వచ్చే లక్షలాదిమంది టూరిస్టుల కొరకు ఈ సంస్థలను 2010 సం. దరిమిలా మాత్రమే ఏర్పాటు చేయబడ్డాయన్న వాస్తవాన్ని గమనించాలి. ఈ నగరంలో 1,53,500మందికి ఉపాది లభిస్తుంది అనే అంచనాలలో ఎంతమాత్రమూ పసలేదు. అమరావతిలో జ్ఞానబుద్ధ కేంద్రము, అమరలింగేశ్వరస్వామి, వైకుంఠపురంలో శ్రీ వేంకటేశ్వరస్వామి, మంగళగిరిలో లక్ష్మీ నృశింహస్వామి ఆలయాలకు సమీపంలో పర్యాటకరంగ అభివృద్ధి పేరిట క్యాసినోలు, పబ్బులు, క్లబ్బులను ప్రోత్సహించటం ఎంతమాత్రమూ తగదు.

హైదరాబాద్‌లో 946 పడకలతో ప్రతిష్టాత్మక నిమ్స్ ఆసుపత్రి 23 ఎకరముల విస్తీర్ణములోనే ఉంది. నూఢిల్లీలో ఏటా 12లక్షల మంది రోగులు ఔట్ పేషెంట్లుగా, 46,000 మంది ఇన్‌పేషెంట్లుగా వైద్య సౌకర్యం పొందుతూ ఉండే రామ్‌మనోహర్‌లోహియా హాస్పటల్ 980 పడకలతో కేవలం 30 ఎకరముల విస్తీర్ణములో ఉండగా ఆరోగ్య నగరానికి 6511 ఎకరాలు ఎందుకు?

హైదరాబాద్ నగరంలో ఉమ్మడి హైకోర్టు భవనములు సుమారు 50 ఎకరముల విస్తీర్ణములోనే ఉన్నాయి. అమరావతి రాజధానిలో హైకోర్టు, న్యాయవిద్యకు సంబంధించిన సంస్థలు, శిక్షణా అకాడమీలు, లా స్కూల్స్, ట్రిబ్యునల్స్ మున్నగువాటితోపాటు న్యాయమూర్తులు, న్యాయవాదులకు అవసరమైన సదుపాయములు సమకూర్చుటకు కేటాయించబడిన భూమిలో 4వ వంతు భూమి సరిపోతుంది.

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఐ.టి. కంపెనీలు 1092 ఉండగా వీటిలో దాదాపు 1000 పైగా హైదరాబాద్‌లోనే ఉన్నాయి. ప్రస్తుతం ఐ.టి. ఎగుమతుల రంగంలో నవ్యాంధ్ర వాటా 0.4%గా ఉన్నది. రానున్న కాలంలో 5%కు పెరుగుతుందనే

అంచనా వేయబడింది. విజయవాడ విమానాశ్రయమునకు ఎదురుగా 5 సం.ల క్రితం నిర్మించబడిన మేధా టవర్స్‌లో కేవలం మూడు చిన్న ఐ.టి. కంపెనీలు మాత్రమే కొనసాగుతూ వచ్చాయి. ఇప్పుడు హెచ్.సి.ఎల్. సంస్థ దానిలోకి వెళుతుంది. హైదరాబాద్‌లోని హైటెక్ సిటీ వలెనే రాష్ట్రప్రభుత్వం విశాఖపట్నంలో ఐ.టి. రంగంను ప్రోత్సహించుట కొరకు "సిగ్నేచర్ టవర్స్" రూ.300కోట్ల వ్యయంతో నిర్మించాలని

టెండర్లు పిలిచినా ఒక్క సంస్థ కూడా ముందుకు రాలేదు. చాలాకాలం క్రితం నగరం నడిబొడ్డులో ఏర్పాటు చేయబడిన విప్రో సంస్థ ఆశించిన ఫలితాలను సాధించడంలో వైఫల్యం చెందినందున ఆ సంస్థకు ఇచ్చిన భూమిని వెనుకకు తీసుకొనడానికి ప్రభుత్వం ప్రయత్నిస్తూ ఉంది. ఇట్టి పరిస్థితుల్లో అమరావతి రాజధాని ప్రాంతములో యిన్ని వేల ఎకరాల భూమి ఎలక్ట్రానిక్ నగరం కొరకు 6582 ఎకరాల భూమి ఎంతమాత్రమూ అవసరం లేదు.

నవులూరులో అమరావతి టౌన్‌షిప్‌లో ఆంధ్రక్రికెట్ అసోసియేషన్ వారు అంతర్జాతీయ స్థాయి క్రికెట్ పోటీల నిర్వహణకు అనుగుణంగా స్టేడియంను నిర్మించుతూ ఉన్నారు. అలాగే మూలపాడు గ్రామ సమీపంలో కూడా రెండు క్రికెట్ స్టేడియంలను ఆంధ్రక్రికెట్ అసోసియేషన్ అభివృద్ధి చేస్తూవుంది. విజయవాడలో ఇందిరాగాంధి మున్సిపల్ స్టేడియం, దండమూడి రాజగోపాలరావు మున్సిపల్ ఇండోర్ స్టేడియం, గుంటూరులో కాసు బ్రహ్మానందరెడ్డి స్టేడియంలు ఉన్నాయి. ఇవికాక రెండు నగరాలలోనూ ప్రైవేట్ కళాశాలల్లో కూడా పలు స్టేడియంలు ఉన్నాయి. ఇట్టి పరిస్థితులలో రాజధాని నగరంలో క్రీడాభివృద్ధికి ఏమేరకు వాస్తవంగా అవసరం అన్నది పక్కాగా అంచనా వేసుకోవలసి వుంది. ఒక్క గోల్ఫ్ కోర్సు సరిపోతుంది.

**రాష్ట్ర ఖజానాకు పెద్ద ఎత్తున నిధులను సమకూర్చుకొనటానికి సువర్ణఅవకాశం**

యిప్పుడు వున్న గ్రామములు, గ్రామ కంఠాలు, రైతులకు యివ్వవలసిన నివాస, వాణిజ్య ప్లాట్లు, రహదారులు, కాలువలు, కొండలు పోగా దాదాపు 15,000 ఎకరాల భూమి సి.ఆర్.డి.ఎ. అధీనంలో వుంటుంది. ఈ భూములలో నివాస, వాణిజ్య, భవన నిర్మాణములు చేపట్టు విదేశీ లేక స్వదేశీ సంస్థలకు, విద్యా, వైద్య, సంస్థలకు ప్రస్తుత మార్కెట్ ధరలకు విక్రయించడం ద్వారా రాష్ట్ర ప్రభుత్వ ఖజానాకు వేలాది కోట్ల రూపాయలను సమకూర్చుకొన వచ్చును. ప్రభుత్వ నగరములో అసెంబ్లీ, కౌన్సిల్, సెక్రటేరియట్, హెచ్.ఒ.డి. ఆఫీసులు, రాజ్‌భవన్, సి.యం. మరియు మంత్రుల, ఉద్యోగుల నివాస భవనములు మున్నగు వాటికి రూ.6,000/-కోట్లు అవసరమవుతాయని అంచనా వేయబడింది. బ్యాంకుల నుండి లేక, ఎ.డి.బి., లేక

వరల్డ్ బ్యాంకు మున్నగు ఆర్థిక సహాయ సంస్థల నుండి ఋణం తీసుకోవల్సిన ఆవశ్యకత లేకుండా మౌలిఖ వసతుల కల్పనకు, యితర అభివృద్ధి కార్యక్రమముల కొరకు ఆ ధనాన్ని వినియోగించ వచ్చు. రైతులు చేసిన త్యాగ ఫలితం రాష్ట్ర ప్రభుత్వానికి, తద్వారా రాష్ట్ర ప్రజానీకానికి ఉపయోగపడాలే తప్ప వ్యాపార దృక్పధంతో లాభార్జన కొరకు వచ్చే సింగపూర్, జపాన్, చైనా, రష్యా సంస్థల కొరకు, యు.కె. హెల్త్‌కేర్, వెల్లూర్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజి, ఎస్.ఆర్.ఎమ్. యూనివర్సిటీ వంటి సంస్థలకు కారుచౌకగా ఎంతో విలువైన భూములను కట్టబెట్టడం తగదు. సుప్రీంకోర్టు తీర్పులకు భిన్నంగా, విజయ్ కేల్‌కర్ కమిటీ సిఫార్సులను, విజిలెన్స్ కమీషనర్ సూచనలను, కేంద్ర ఆర్థిక మంత్రిత్వశాఖ సిఫార్సులను విస్మరించి పారదర్శకత లేకుండా ఓపెన్ కాంపిటేషన్ బిడ్డింగ్ లేకుండా సమాజం మొత్తానికి చెందిన భూములను ప్రైవేటు సంస్థలకు ధారాగతం చేయటం ఎంతమాత్రమూ సరికాదు. లోగడ ఉండవల్లి గ్రామంలో కేవలం 73 ఎకరాల భూమిని వి.జి.టి. ఉడా పర్యాటకం కొరకు సేకరించాలని ప్రతిపాదించినపుడు ఆనాడు ప్రతిపక్షనేతగా ఉన్న చంద్రబాబు నాయుడు తీవ్రంగా వ్యతిరేకించారు. పర్యాటకం కొరకు పచ్చని పంట పొలాలను తీసుకోవటం తగదన్నారు.

**అమరావతి ప్రజా రాజధాని అయ్యేదెలా?**

అమరావతి రాజధాని గ్రామాలలో వుంటూవున్న ప్రజలలో ఎక్కువ మందికి వ్యవసాయం తప్ప యితర రంగాలలో అనుభవం లేదు. ప్రభుత్వ ఆలోచనల ప్రకారం ప్రపంచస్థాయి నగరమును ఏర్పాటు చేసినపుడు వీరిలో ఎక్కువ మందికి ఎటువంటి అవకాశములు లభించవు. అమరావతి రాజధాని నగర మాస్టర్ ప్లాన్ ప్రకారం 7817 ఎకరాలలో పచ్చని పచ్చిక బయళ్ళను పెంచాలని చూపబడింది. ఇదికాక 6577 ఎకరముల భూమి భవిష్యత్ అవసరముల కొరకు రిజర్వు చేయాలని ప్రతిపాదించబడింది. ఇందులో ఎక్కువ భాగం జరీబు భూములు ఉన్న ప్రాంతములో ఉంటుంది. లోగడ భూములు ఇచ్చినవారిలో ఆసక్తి ఉన్నవారికి, కౌలు రైతులకు, వ్యవసాయ కార్మికులకు ఈ భూములలో గ్రీన్ హౌస్‌లు లేక పాలీ హౌస్‌లను ఏర్పరచి, సేంద్రీయ / ప్రకృతి సేద్యం చేస్తూ కూరగాయలు, పూలు, పండ్లు పండించేందుకు అవకాశాన్ని ఏకవార్షిక లీజు పద్ధతిలో యిస్తే వేలాదిమందికి ఉపాది లభించడమేకాక, రాజధాని నగర ప్రజానీకంతోపాటు విజయవాడ, గుంటూరు నగర ప్రజలకు కూరగాయలు, పూలు, పండ్లు అందచేసేదానికి అవకాశం ఉంటుంది. అలాగే గ్రామాలకు సమీపంలో కొద్ది విస్తీర్ణంలలో డెయిరి, పౌల్ట్రీ వ్యాపకాలకు కూడా అవకాశం కల్పించాలి. నదీ అభిముఖ అభివృద్ధి పేరుతో "ఫ్లడ్ ప్లెయిన్స్"ను కాంక్రీటు జంగిల్‌గా మార్చకుండా జరీబు భూముల ప్రాంతాన్ని భూసమీకరణ నుండి మినహాయించి "అగ్రికల్చరల్ జోన్"గా ప్రకటించాలి.

# స్వల్ప వ్యయంతో కొత్త రాజధాని

కొత్త రాజధాని విషయమై ఆంధ్రప్రదేశ్ ప్రజలు ఎదురుచూస్తున్న శివరామకృష్ణన్ కమిటీ 187 పేజీల నివేదిక కొన్ని అర్ధ సత్యాలతో, కొన్ని అసత్యాలతో కూడి ఉంది. ప్రజలను అయోమయానికి గురిచేసింది. నివేదికలో పేర్కొనబడిన కొన్ని అంశములు పరస్పర విరుద్ధంగా ఉన్నాయి.

ఉదాహరణకు ఆంధ్రప్రదేశ్ రాజధాని నగరాన్ని వేలాది ఎకరములతో కూడిన గ్రీన్ సిటీగా చేయడం సాధ్యం కాదని, ఆచరణయోగ్యం కాదని పేర్కొంది. హైదరాబాద్ నగరము వలే సూపర్ సిటీగా ఏర్పాటు చేయడం కూడా తగదని, హైదరాబాద్ నగరమును బృహత్తరమైన నగరంగా అభివృద్ధి చేయడం వలన పలు సమస్యలు తలయెత్తిన వాస్తవాన్ని విస్మరించరాదని హితవు పలికింది. ఇప్పటికే గణనీయంగా అభివృద్ధి చెందిన ఉన్న విజయవాడ, గుంటూరు నగరముల మధ్యలో రాజధాని ఏర్పాటు వలన వ్యవసాయ భూములు, వ్యవసాయేతర అవసరాల కొరకు, పట్టణీకరణ కొరకు ఉపయోగించబడే అవకాశమున్నందున, ఆహార భద్రతకు నష్టం వాటిల్లవచ్చని పేర్కొంది. వాస్తవానికి భారతదేశంలో అలాగే ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోను పలు కారణాల వలన గ్రామీణ ప్రజల శాతం తగ్గుతూ పట్టణ ప్రజల శాతం పెరుగుతూ వస్తూ ఉన్నది. ఈ ప్రక్రియ చాలాకాలంగా కొనసాగుతూ వస్తూ ఉంది. రాజధాని అనే అంశంతో సంబంధం లేకుండానే అనేక నగరాలు, పట్టణాల సమీపంలో వ్యవసాయ భూములు, గృహ అవసరాలు, వాణిజ్య, పారిశ్రామిక అవసరాల కొరకు వినియోగించబడుతూ ఉన్నాయి. దీనిని నిలుపుదల చేయడం సాధ్యం కాదు అన్న వాస్తవాన్ని విస్మరించరాఉద.

విజయవాడ, గుంటూరు మధ్యలో రాజధానిని ఏర్పాటుచేస్తే వ్యవసాయ భూములకు నష్టం జరుగుతుందనే వాదన సరికాదు. రాజధానిని ఏ జిల్లాలో పెట్టినా ఎంతోకొంత మేరకు వ్యవసాయ భూమి, వ్యవసాయేతర అవసరానికి వినియోగించక తప్పదు. శివరామకృష్ణన్ కమిటీ గన్నవరంలో ఎయిర్‌పోర్ట్ ఉండగా మరొక పెద్ద ఎయిర్‌పోర్టును నిర్మించాలని సూచించడం అర్థరహితం. గ్రీన్‌ఫీల్డ్ ఎయిర్‌పోర్టు నిర్మించాలంటే దాదాపు 4 వేల ఎకరాలు అవసరమౌతుది. మరి అన్ని వేల ఎకరాలలో పంటలకు స్వస్తి పలకవలసిందే కదా. నూతన రాజధాని నుంచి హైదరాబాద్ నగరానికి

15 వేల కోట్లతో 8 లైన్ల రహదారిని నిర్మించాలని కూడా కమిటీ సూచించింది. మరి దీనికి కొన్ని వేల ఎకరాలు భూసేకరణ చేయవలసి ఉంటుంది కదా! వీటన్నింటిని విస్మరించి గుంటూరు విజయవాడ మధ్యలో మాత్రమే పంట భూములకు నష్టం జరుగుతుందని పేర్కొనడాన్ని చూస్తే శివరామకృష్ణన్ కమిటీకి గుంటూరు విజయవాడ మధ్య ప్రాంతంలో నూతన రాజధానిని ఏర్పాటు చేయడం ఇష్టం లేదన్నట్లు బోధపడుతుంది. కేవలం కొంత పెద్ద ఎత్తున ప్రభుత్వ/దేవాలయ/ ప్రైవేటు భూములు లభ్యమయ్యే అవకాశం ఉన్న దొనకొండ, మార్టూరు, ముసునూరు, నూజివీడు మున్నగు ప్రాంతాలను రాజధానికి అనుకూలంగా కమిటీ సూచించింది. ఆయా ప్రదేశాల నుంచి జాతీయ రహదారులు, రైల్వేల నెట్‌వర్క్‌లకు, నౌకాశ్రయాలకు అనుసంధానం చేయుటకు వేలాది ఎకరముల భూములను సేకరించవలసిన ఆవశ్యకతే గాక వేలకోట్ల రూపాయలు వ్యయం చేయవలసి ఉంటుందన్న సత్యాన్ని మరువరాదు.

వి.జి.టి.యం. ప్రాంతాలలో భూకంపాల ముప్పు ఉన్నదని కమిటీ పేర్కొంది. భారతదేశంలో అనేక ప్రాంతాలలో భూకంపాల పరిస్థితులు ఉన్నాయి. అయితే ఇంతవరకు ఎక్కడా అందువలన ఆ ప్రాంతంలో తలపెట్టిన అభివృద్ధి కార్యక్రమాలకు అవరోధం కాలేదు. రాజ్‌భవన్ కొరకు 15 ఎకరాలు, ముఖ్యమంత్రి కార్యాలయం, మంత్రుల కార్యాలయాలు, సెక్రటేరియట్ భవనాల కొరకు 15 నుంచి 20 ఎకరాలు అసెంబ్లీ ప్రాంగణం కొరకు 80 నుంచి 100 ఎకరాలు సరిపోతుందని శివరామకృష్ణన్ కమిటీ అంచనా వేసింది. విజయవాడ గుంటూరు మధ్యలో ఉన్న ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయ ప్రాంగణం 284 ఎకరాల విస్తీర్ణంలో ఉంది. గుంటూరు సమీపంలో లాం ఫార్మ్ వద్ద ప్రభుత్వ భూమి 900 ఎకరాలు ఉంది.తాడికొండ వద్ద 600 ఎకరాలు ప్రభుత్వ భూమి ఉంది. మంగళగిరి తాడేపల్లి పరిసరాలలో దాదాపు 400 ఎకరాలు ప్రభుత్వ భూములు ఉన్నాయి. సమీపంలో కృష్ణానది, నది నుంచి గుంటూరు చానల్ ద్వారా త్రాగునీటి సదుపాయం కలదు. ఎన్.హెచ్ 5, ఎన్.హెచ్ 9, ఎన్.హెచ్ 216 దగ్గరలో నుంచి వెళుతూ వున్నాయి. మచిలీపట్నం, నిజాంపట్నం ఓడరేవులు మున్నగు రేవు పట్టణాలు సమీపంలో ఉన్నాయి. పలు ఇంజనీరింగ్ కాలేజీలు, పాలిటెక్నిక్, మెడికల్ కాలేజీలతో సహా పలు విద్యాసంస్థలు విజిటియం పరిధిలో ఉన్నాయి. ఉన్నత ప్రమాణాలతో కూడిన పలు ప్రభుత్వ, ప్రైవేటు హాస్పిటల్స్ కూడా ఉన్నాయి. గన్నవరం ఎయిర్‌పోర్ట్ అత్యంత సమీపంలో ఉన్నది. సమీపంలో విజయవాడ థర్మల్ పవర్ స్టేషన్ ఉంది. ప్రకాశం బ్యారేజి వలన 365 రోజులు తాగునీటి సదుపాయం కలదు. ఇప్పటికే ఏర్పడి ఉన్న ఇట్టి సకల సదుపాయాలు, అనుకూలమైన అంశాలు ఉన్న ప్రాంతాన్ని కాదని దొనకొండ మార్టూరు ప్రాంతమును సూచించడాన్ని ప్రజలు అర్థం చేసుకోలేకపోతున్నారు.

విశాఖపట్టణంలో హైకోర్టును, కర్నూలులో బెంచ్‌ని ఏర్పాటు చేయడం సమంజసంగా ఉంటుందని కమిటీ వెలిబుచ్చిన అభిప్రాయం ఆచరణీయం. హైదరాబాద్ నుంచి తరలించవలసిన 110 రాష్ట్ర స్థాయి ప్రభుత్వ కార్యాలయాలను ఒకేచోట కాకుండా వాటిని వివిధ చోట్ల ఏర్పాటు చేయాలని చేసిన సూచన కూడా మంచిదే. రాయలసీమలో మైనింగ్ శాఖకు చెందిన కార్యాలయాలను, కాకినాడ, మచిలీపట్నంలో పోర్టు, మత్స్యశాఖ కార్యాలయాలను సమీకృత స్టీల్ ప్లాంట్‌ను కడపలోను, పశుసంవర్ధక విభాగాలను ఒంగోలులోను, వ్యవసాయ సంబంధిత విభాగాలను అనంతపురం జిల్లాలోను, మీడియం మైనర్ ఇరిగేషన్ విభాగమును శ్రీకాకుళం జిల్లాలోనూ లెదర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్‌ను నెల్లూరు జిల్లాలోనూ ఏర్పాటు చేయడం ఉపయోగకరంగా ఉంటుంది. దుగరాజపట్నం ఓడరేవు సమీపంలో శ్రీహరికోట అంతరిక్ష కేంద్రం, పులికాట్ సరస్సు పక్షుల రక్షిత కేంద్రం అత్యంత సమీపంలో ఉన్నందున పర్యావరణానికి, దేశ భద్రతకు పొంచి ఉన్న ప్రమాదాన్ని శివరామకృష్ణన్ కమిటీ ప్రస్తావించకపోవడం దురదృష్టకరం.

వివిధ సంస్థలు నెలకొల్పుటకు మౌలిక సదుపాయాల కల్పనకు ఎంతెంత నిధులు అవసరమో సూచించారే తప్ప, వాటిని అమలు చేయుటకు రాష్ట్ర ప్రభుత్వం వనరులను ఎలా సమకూర్చుకోవాలనే దానిలో స్పష్టత ఇవ్వలేదు. ఇప్పటికే 15 వేల కోట్ల రూపాయలు లోటు బడ్జెట్ ఉన్నదని అంగీకరించుతూనే రాష్ట్ర రాజధాని కొరకు వివిధ ప్రభుత్వ విభాగాల కొరకు వేలాది కోట్ల రూపాయలు ఖర్చు చేయవలసిన పరిస్థితిని ఎలా ఎదుర్కోవాలో సూచించలేదు. రాష్ట్ర పునర్విభజన చట్టంలో నూతన రాజధానికి అత్యవసరమైన రాజ్‌భవన్, అసెంబ్లీ, కౌన్సిల్, మంత్రుల కార్యాలయాలతో సహా సెక్రటేరియట్ వివిధ శాఖాధిపతుల కార్యాలయ భవనాల నిర్మాణం కొరకు మాత్రమే కేంద్ర ప్రభుత్వం ఆర్థిక సహకారాన్ని అందించగలదని స్పష్టంగా పేర్కొంది. గతంలో కొత్త రాష్ట్రాలను ఏర్పాటు చేసినప్పుడు చత్తీస్‌గఢ్ కొరకు 776 కోట్లు, జార్ఖండ్‌కు 800 కోట్ల రూపాయలు, ఉత్తరాఖండ్‌కు రూ. 436 కోట్లు మాత్రమే కేంద్ర సహకారం అందించిన వాస్తవాన్ని మరువరాదు.

అందువలన రాష్ట్ర ప్రభుత్వం ఈ అంశములన్నింటిని లోతుగా అధ్యయనం చేసి విజయవాడ గుంటూరు ప్రాంతంలోనే రాజధాని ఏర్పాటు చేయడం ఉత్తమం. వివిధ శాఖలకు సంబంధించిన కార్యాలయాలను వేరువేరు జిల్లాల్లో అచ్చట వనరులు, అవసరాల దృష్ట్యా లభ్యమైనంత మేరకు ప్రభుత్వ భూములలో నెలకొల్పి వ్యయ భారం తగ్గించుకొనవచ్చును. రైల్వే మార్గముల అభివృద్ధి, విస్తరణ, విద్యుద్దీకరణ అంశాలపై కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి సాధించుకోవలసి ఉంటుంది.

శ్రీకాళహస్తి దొనకొండ నడికుడి రైలు మార్గాన్ని ఏర్పాటు చేసుకోగలిగితే, రామయ్యపట్నంలో పోర్టును అభివృద్ధి చేసుకోగలిగితే ప్రకాశం జిల్లాతో సహా రాయలసీమ ప్రాంతం శరవేగంతో పురోగమించుకోగలదు. పోలవరంతో కృష్ణా నది, దుమ్ముగూడెం

నుంచి నాగార్జునసాగర్ టెయిల్‌పాండ్‌కు గోదావరి జలాలను తరలించుకుంటూ, శ్రీశైలం వద్ద నుంచి రాయలసీమ జిల్లాలలోని తెలుగుగంగ, ఎస్‌ఆర్‌బిసి, గాలేరు, నగరి, హంద్రీ నీవా పథకాల ద్వారా రిజర్వాయర్‌లలోను, చెరువులలోను నీటిని నింపుకోగలగడం ద్వారా రాయలసీమను కృష్ణ దేవరాయల సమయంలో వలె, రతనాల సీమగా అభివృద్ధి చేసుకునే అవకాశం కలుగుతుంది. ఆ దిశగా రాష్ట్ర ప్రభుత్వం కృషి చేయవలసి ఉన్నది.

అంతిమంగా సామాన్య ప్రజానీకానికి తమ దైనందిన జీవితంలో ఎంఆర్వో, ఎండీవో, పోలీస్ స్టేషన్ మున్నగు కింది స్థాయి ప్రభుత్వ కార్యాలయములతోనే పని ఉంటుంది. గత పది ఏళ్లలో పరిపాలన అస్తవ్యస్తమై అవినీతి పోరిగిపోయింది. లోగడ తెలుగుదేశం ప్రభుత్వ కాలంలో ఉన్న 'సిటిజన్స్ చార్టర్'ను పకడ్బందీగా అన్ని ప్రభుత్వ కార్యాలయాలలో అమలుపరిచేలా తగు చర్యలు తీసుకొని, సామాన్య పౌరునికి అవసరమైన వ్యయం, కాలయాపన లేకుండా వారి సమస్యలు పరిష్కరించాలి. ఇటువంటి 'సుపరిపాలన'ను కొత్త రాజధానిలో తెలుగుదేశం ప్రభుత్వం అందించాలని ప్రజలు కోరుకుంటున్నారు. ఆ దిశగా చంద్రబాబునాయుడు దృష్టిసారించడం ద్వారా స్వర్ణాంధ్రప్రదేశ్‌ను సాధించవలసి ఉంటుంది.

❊ ❊ ❊

## 'నాగార్జున'లో తాత్కాలిక రాజధాని

ఇటీవల మీడియా కథనాల ప్రకారం విజయవాడలో తాత్కాలిక రాజధానిని ఏర్పాటు చేయనున్నారని, ప్రభుత్వ కార్యాలయాలకు అవసరమైన భవనాల కొరకు అన్వేషణ జరుగుచున్నదని తెలుస్తోంది.

రాష్ట్ర విభజన అనంతరం మన రాష్ట్రానికి సుమారు 17 వేల కోట్ల లోటు ఉంటుందని అంచనా. ఎన్నికల సందర్భంగా హామీ ఇచ్చిన రైతు, డ్వాక్రా, చేనేత రుణాల మాఫీ కొరకై రాష్ట్ర ప్రభుత్వం దాదాపు యాభైవేల కోట్ల రూపాయలు చెల్లించవలసిన ప్రత్యేక పరిస్థితులు ఉన్నాయి. రాష్ట్ర పునర్వ్యవస్థీకరణ చట్టంలో రాజ్‌భవన్, అసెంబ్లీ, సెక్రటేరియట్, వివిధ శాఖాధిపతుల కార్యాలయాల భవనాలు వంటి అత్యవసరమైన మౌలిక సదుపాయాల కల్పన కొరకు కేంద్ర ప్రభుత్వం ఆర్థిక సహకారం అందించగలదని పేర్కొనబడింది. సింగపూర్‌ను మించిన అంతర్జాతీయ స్థాయికి తులతూగే నూతన రాజధాని నగరాన్ని నిర్మించాలని రాష్ట్ర ప్రభుత్వంలోని కొందరు పెద్దలు ఆలోచిస్తున్నట్లుగా ప్రకటనలు వస్తూ ఉఅన్నయి. అందుకొరకు షాంఘై, సింగపూర్, ఇస్తాంబుల్, పుత్రజయ మొదలైన విదేశీ నగరాలను పురపాలక శాఖ మంత్రి నారాయణ నాయకత్వంలో ప్రముఖ వ్యాపారవేత్తలతో కూడిన బృందం పర్యటించబోతున్నదని కూడా తెలుస్తోంది.

మన దేశంలోనే నూతనంగా నిర్మితమైన చండీగఢ్, గాంధీనగర్ నయారాయపూర్, భువనేశ్వర్ మొదలైన నగరాలు ఉన్నాయి కదా. మరి పలు దశాబ్దాలుగా ఆయా దేశాలలోని పటిష్టమైన ఆర్థిక సంపత్తి మూలంగా అభివృద్ధి చెందిన ఆ విదేశీ నగరాలను ఈ బృందం సందర్శించడం అర్థరహితం కాదా? కావున ఈ విషయమై పునరాలోచన చేయవలసిన అవసరం ఉంది.

విజయవాడ నగరం ఇప్పటికే గణనీయంగా అభివృద్ధి చెంది ఉన్నది. పరిసర ప్రాంతాలలో భూముల ధరలు ఇటీవల కాలంలో చాలా హెచ్చుస్థాయికి చేరాయి. రాజధాని కొరకు ముందుగా 25 వేల నుంచి 30 వేల ఎకరాలు కావాలని ఇటీవలి కాలంలో 10 నుంచి 15 వేల ఎకరాలు కావాలని మంత్రి నారాయణ ప్రకటిస్తూ ఉన్నారు. రాజధాని కొరకు వేలాది ఎకరాలు అవసరమా? ఆ ఆవశ్యకత లేదు. గుజరాత్ రాజధాని

గాంధీనగర్‌లో కేవలం 190 ఎకరాలలో అసెంబ్లీ, సెక్రటేరియట్, వివిధ శాఖాధిపతుల భవన సముదాయాలు నిర్మితమయ్యాయి. మరొక 390 ఎకరాలలో ఇతర రాష్ట్ర ప్రభుత్వ, కేంద్ర ప్రభుత్వ కార్యాలయాల భవనాలు నిర్మితమయ్యాయి.

విజయవాడ గుంటూరు నగరాల మధ్య ఉన్న ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం క్యాంపస్ 280 ఎకరాల విస్తీర్ణంలో ఏర్పడి ఉన్నది. అందులో ఇప్పటికి ఉన్న భవన సముదాయాలను ముఖ్యమంత్రి, మంత్రులు, కార్యదర్శులు, శాఖాధిపతులు మున్నగు వారి అవసరాలకు మొత్తంగా సరిపోతుంది. చాలా చక్కని పచ్చదనంతో, పరిసరాలతో రమణీయంగా ఉంటుంది. సమీపంలో కృష్ణానది, భవానీ ద్వీపం, కొండపల్లి, కొండవీడు ఖిల్లాలు, గాంధీ హిల్, సైన్స్ సెంటర్, కనకదుర్గ ఆలయం వంటి ప్రదేశాలు టూరిస్టులను ఆకర్షిస్తాయి. గుంటూరులోని కేబీఆర్ స్టేడియం, మంగళగిరిలో క్రికెట్ స్టేడియం, విజయవాడలో ఇందిరాగాంధీ మునిసిపల్ స్టేడియాలు క్రీడాభివృద్ధికి దోహదపడతాయి. ఇంకనూ ఖాళీగా ఉన్న భూమిలో అవసరం మేరకు బహుళ అంతస్తుల భవనాలను నిర్మించుకొనడం ద్వారా దాదాపుగా అన్ని ప్రభుత్వ కార్యాలయాలకు కావలసిన సదుపాయాలను ఏర్పాటు చేసుకోవచ్చు.

గుంటూరు నగరానికి సమీపంలో దాదాపు మూతపడే స్థితిలో ఉన్న రెండు లేక మూడు ఇంజనీరింగ్ కాలేజీల యాజమాన్యాలతో సంప్రదించి ప్రస్తుతం నాగార్జున యూనివర్సిటీ ఆవరణలో ఉన్న ఇంజనీరింగ్ కాలేజీని, సైన్స్, ఆర్ట్స్, ఫార్మసీ విభాగాలను తాత్కాలికంగా ఆ ఇంజనీరింగ్ కాలేజీలర ప్రాంగణాలలోకి తరలించి విద్యార్థులకు ఇబ్బంది లేకుండా చేయవచ్చును. గుంటూరు జిల్లా లాం ఫార్మ్ భవనాల సమీపంలో 100 ఎకరాల ప్రభుత్వ భూమిని నాగార్జున యూనివర్సిటీ కొరకు కేటాయించి కొత్త భవనాలు నిర్మించవచ్చు.

మంగళగిరి పట్టణంలో ఉడా లేఅవుట్‌లో ఖాళీగా ఉన్న 130 ఎకరాల భూమిలో మంత్రులు, శాసనసభ్యులు, ఉన్నతాధికారులకు క్వార్టర్స్ నిర్మించుకోవచ్చు. మరికొన్ని ఇతర ప్రభుత్వ భూములు కూడా భూసేకరణతో నిమిత్తం లేకుండా అందుబాటులో ఉన్నాయి. టీబీ శానిటోరియం, ఎన్‌టీఆర్ హెల్త్ యూనివర్సిటీకి సంబంధించిన భూమిలో ఎయిమ్స్‌ను నెలకొల్పే ఆలోచనను వైద్య ఆరోగ్యశాఖామాత్యులు వెలిబుచ్చారు. తాడికొండ సమీపంలో దాదాపు రెండువేల ఎకరాల ప్రభుత్వ భూమి కూడా అవసరమైతే ఉపయోగించుకునే వీలున్నది.

గన్నవరం వద్ద మేధా టవర్స్‌లో ఐటి పరిశ్రమలు, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ శాఖలకు చెందిన కార్యాలయాలు నిర్వహించుకోవచ్చు. విజయవాడలో ఇరిగేషన్ రాయలసీమలో డీపీఏపీ వాటర్‌షెడ్ ప్రోగ్రాం వంటి పథకాలకు చెందిన కార్యాలయాలు ఏర్పాటు చేసుకోవచ్చు. కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన ఉన్నత విద్యా సంస్థలను జిల్లాకు ఒకటి చొప్పున నెలకొల్పి పదమూడు జిల్లాల్లోనూ ప్రగతి రథాన్ని పరుగులు తీయించాలి.

ముఖ్యంగా ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టిలోకి తెచ్చేది ఏమనగా ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయ ప్రాంగణం తాత్కాలిక రాజధానిగా చాలా అనువుగా ఉంటుంది. దానికి అత్యంత సమీపంలో విజయవాడ గుంటూరు నగరాలు ఉండడం వలన రాజధానితో అవసరముండి వచ్చే వేలాది ప్రజలకు కావలసిన సదుపాయాలు, వసతులు ప్రభుత్వ ఖర్చుతో నిమిత్తం లేకుండా ఆ నగరాలలో సమకూరుతాయి. ఇప్పటికే పీకలలోతు ఆర్థిక ఇబ్బందులతో కూరుకుపోయి ఉన్న మన రాష్ట్ర ప్రభుత్వం కేవలం రాజధాని నిర్మాణం కోసం మంత్రిగారు ప్రకటించినట్లు లక్ష కోట్ల రూపాయలకు పైగా వెచ్చించాలనే ఆలోచనను ప్రజలు హర్షించరు. రాయలసీమ ప్రాంతంలో ఇందుకు తీవ్ర నిరసన ఇప్పటికే ప్రారంభమైనది.

జార్ఖండ్, ఉత్తరాఖండ్, ఛత్తీస్‌గడ్‌లు ఆవిర్భవించినప్పుడు ఆయా రాష్ట్రాలకు కేంద్రం నుంచి వందలకోట్ల రూపాయలు మాత్రమే సహాయం అందిందన్న వాస్తవాన్ని మరువరాదు. ముఖ్యమంత్రిగారు జూన్ 8న ప్రకటించిన విధంగా గుంటూరు విజయవాడ మధ్య రాజధాని ఏర్పాటైతే ప్రభుత్వ వ్యయంతో పనిలేకుండానే విజయవాడ గుంటూరు తెనాలి ప్రాంతం బృహత్తరమైన నగరంగా అభివృద్ధి అయ్యే అవకాశం ఉంటుంది.

అంతిమంగా గమనించవలసిందేమటంటే అతి పెద్దదైన సుందరమైన నగరాన్ని నిర్మించినా సామాన్య ప్రజానీకానికి ఒరిగేదేమీ ఉండబోదు. ప్రస్తుత పరిస్థితులలో ప్రభుత్వం వద్ద లభ్యమయ్యే కొద్దిపాటి ఆర్థిక వనరులను ఇప్పటికే నిర్మాణంలో కొనసాగుతూ ఉన్న మీడియం, మేజర్ ఇరిగేషన్ ప్రాజెక్టులను పూర్తి చేయడానికి మచిలీపట్నం, రామయ్యపట్నం, నిజాంపట్నం మొదలైన ఓడరేవుల అభివృద్ధికి, విద్యుత్ ఉత్పత్తి పెంపుదలకు వినియోగించాలి. అలాగే వ్యవసాయాధార చిన్న పరిశ్రమలతోపాటు పారిశ్రామిక ప్రగతికి వినియోగించడం మంచిది. 57 శాతం ప్రజానీకం ఆధారపడి ఉన్న వ్యవసాయరంగం, సన్నకారు, చిన్నకారు రైతులు, కౌలు రైతులు ఎదుర్కొంటున్న రుణపరపతి సహా పలు సమస్యలు పరిష్కరించడానికి ఉపయోగించడం శ్రేయస్కరం. శీఘ్రంగా వ్యవసాయరంగం అభివృద్ధి చెంది, వ్యవసాయ అనుబంధ రంగాలకు చేయూత లభించే శ్రామికులకు ఉపాధి మెరుగైన ఆదాయం చేకూరి, రానున్న సమీప కాలంలో కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన 'ప్రత్యేక హోదా' తోడ్పాటుతో స్వర్ణాంధ్రప్రదేశ్‌ను సాధించే దిశగా రాష్ట్ర ప్రభుత్వం కృషి చేయవలసి ఉంది. ఆచరణ సాధ్యం కాని ఆశలను కల్పించి ప్రజలను దరిమిలా నిరుత్సాహానికి గురిచేయడం సమంజసం కాదు.

* * *

# నవ్యాంధ్రప్రదేశ్ శీఘ్రంగా అభివృద్ధి అయ్యేది ఎలా?

మన రాష్ట్రానికి 974 కి.మీ. సముద్ర తీరప్రాంతం ఉండటం ప్రకృతి ప్రసాదించిన ఒక వరం. లోగడ నుండి ఉన్న విశాఖపట్నం మేజరు పోర్టు కాక, దరిమిలా అభివృద్ధి చేయబడ్డ కాకినాడ, గంగవరం, కృష్ణపట్నం మైనరు పోర్టులు మినహా మిగిలిన పోర్టుల విషయంలో ఏమాత్రము ప్రగతిలేదు. విభజన చట్టంలో కేంద్రం ప్రతిపాదించిన దుగరాజపట్నం మేజరుపోర్టును శ్రీహరికోట అంతరిక్ష కేంద్రమునకు అత్యంత సమీపంలో ఉండుట వలన, పులికాట్ సరస్సునకు పర్యావరణపరంగా నష్టం చేకూరుతుంది కావున ప్రకాశం జిల్లాలోని రామయ్యపట్నంనకు మార్చవలసిన అవసరం ఎంతైనా ఉన్నది. ఇందువలన ప్రకాశం జిల్లాలోనే కాక రాయలసీమ నాలుగు జిల్లాలకు కూడా చాలా లబ్ధి చేకూరుతుంది.

రాష్ట్ర ప్రభుత్వం పలుచోట్ల 5000 ఎకరాల విస్తీర్ణముతో గ్రీన్‌ఫీల్డ్ పోర్టులను అభివృద్ధి చేయాలనే తలంపుతో ఉంది. కాని 2000 ఎకరముల విస్తీర్ణము కన్నా తక్కువతోనే మైనరు పోర్టులు అభివృద్ధి చేయవచ్చు. 2013 భూసేకరణ చట్టమును అనుసరించి కాకుండా భూసమీకరణ విధానంలో పోర్టులు, పోర్టు ఆధారిత పరిశ్రమల పేరుతో వేలకువేల ఎకరాలు తీసుకోవాలని అనుకుంటూ ఉన్న రాష్ట్రప్రభుత్వ ప్రయత్నం సఫలం కావలం బహు కష్టం. అందువలన మచిలీపట్నం కాని, భావనపట్నం కాని, మరొక చోటకాని, అక్కడ లభ్యమయ్యే ప్రభుత్వ భూమికి తోడు అవసరమైతే మరికొంత భూమిని రైతుల నుండి సేకరించి పోర్టు పనులను ప్రారంభించుటకు తగు చర్యలను తీసుకొనవలసి ఉంటుంది.

స్థానిక సంస్థలు, రాష్ట్ర ప్రభుత్వ పరిధిలో ఉన్న విద్యా సంస్థలలో అవసరమైతే ఇన్‌ఫర్‌మేషన్‌కి, కమ్యూనికేషన్ టెక్నాలజీల తోడ్పాటుతో బోధనా ప్రమాణాలను మెరుగు పరచవలసిన ఆవశ్యకత ఎంతో కలదు. ఇంజనీరింగ్, పాలిటెక్నిక్, ఐ.టి.ఐ. మున్నగు సాంకేతిక విద్యా సంస్థలలో ప్రాక్టికల్ నాలెడ్జి మెరుగుపరచుటకు ఖచ్చితమైన, బాధ్యతాయుతమైన చర్యలను చేపట్టాలి.

ఇటీవలి కాలంలో ప్రభుత్వ వైద్యశాలలలో పనితీరు మెరుగుపర్చుటకు జరుగుతూ ఉన్న కృషి అభినందనీయం. మూలపడిన పరికరములను సరిచేయుటకు ప్రతి ఆసుపత్రిలోనూ అవసరమైన పరికరాలను ఏర్పాటు చేయుటకు బడ్జెట్ కేటాయింపులను గణనీయంగా పెంచి సామాన్య ప్రజానీకంపైన ఆరోగ్య సంరక్షణ వ్యయం తలకుమించిన భారం కాకుండా చూడవలసి ఉంటుంది.

త్రాగునీటికి, పరిశుభ్రతకు అధిక ప్రాధాన్యతను ఇచ్చి కేంద్ర ప్రభుత్వ నిధులను కూడా జోడించి సమర్థవంతంగా వినియోగించేందుకు కృషి జరగాలి.

ప్రతి జిల్లాలోను ఒక ఎయిర్‌పోర్టును ఇప్పటికిప్పుడే అభివృద్ధి చేయవలసిన అవశ్యకత లేదు. గ్రీన్‌ఫీల్డ్ విమానాశ్రయముల అవశ్యకత అంతకన్నా లేదు. లోగడ బ్రిటీష్ కాలంలో ఉన్న బాడంగి, దొనకొండ మున్నగువాటిని కేంద్ర విమానయాన శాఖతో అభివృద్ధి చేయించాలి. రాయలసీమ 4 జిల్లాలకు అనుకూలంగా ఉండు కడపలో కాని మరొక చోట గానీ, విమానాశ్రయమును అభివృద్ధి చేయాలి. ఇప్పటికే విశాఖపట్నం విమానాశ్రయమునుండి విదేశాలకు సర్వీసులు నడపబడుతూ ఉన్నాయి. దాదాపు 5000 ఎకరాల భూమిని 6 నెలలుగా వేలాదిమంది రైతులు ముక్తకంఠంతో తమ భూములను ఇవ్వబోమని తెగేసి చెబుతూ ఉన్నప్పటికీ భూసమీకరణ విధానంలో వారి భూములు తీసుకుని గ్రీన్‌బెల్ట్ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టు అభివృద్ధి చేయాలనుకోవటం ఎంతమాత్రం సరికాదు. విశాఖపట్నం నుండి కేవలం 40 కి.మీ. దూరంలో ఉన్న భోగాపురం వద్ద ప్రయాణీకుల సంఖ్యకాని, కార్గో కాని అతి తక్కువగా ఉన్నప్పటికీ వేల కోట్ల రూపాయల ఖర్చుకాగల ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టు "వయబుల్" కాదు. ముంబయిలో ఛత్రపతి శివాజి ఇంటర్నేషనల్ ఎయిర్ పోర్టు అయిదు టెర్మినల్స్‌తో ఏటా 3 కోట్ల 52 లక్షల ప్రయాణీకులతో 1850 ఎకరాలలోనే నిర్వహించబడుతూ ఉన్నదన్న వాస్తవాన్ని మర్చిపోరాదు. దేశంలోనే నాలుగవ స్థానంలో ఉన్న చెన్నై ఇంటర్ నేషనల్ ఎయిర్‌పోర్టు నుండి ఏటా 1 కోటి 30 లక్షల మంది ప్రయాణం చేస్తూ ఉంటారు, 3 టెర్మినల్స్ ఉన్నాయి. లోగడ నుండి ఉన్న 1283 ఎకరాలు కాక ఇప్పుడు కొత్తగా 800 ఎకరాలు సేకరించుటకు ప్రయత్నం జరుగుతూ ఉన్నది. మన విశాఖపట్నం ఎయిర్‌పోర్టు నుండి సంవత్సరమునకు షుమారు 12 లక్షల మంది మాత్రమే ప్రయాణం చేస్తూ ఉన్నారు. కావున విశాఖపట్నం ఎయిర్‌పోర్టును ఆనుకుని ఉన్న "నావీ" వారి భూమి 3 లేక 4 వందల ఎకరాలు తీసుకుంటే సరిపోతుంది. "నావీ" వారికి రాష్ట్ర ప్రభుత్వం విశాఖపట్నం సమీపంలో రాంబిల్లీ వద్ద 5000 వేల ఎకరాల భూమిని "నావీ" వారికి ఇస్తూ ఉన్నారు. తూర్పు తీరంలో విశాఖపట్నంనకు ఉన్న ప్రత్యేకత దృష్ట్యా చాలా పెద్ద స్థాయిలో రాంబిల్లీ వద్ద నావల్ బేస్‌ను అభివృద్ధి చేస్తూ ఉన్నారు. కావున మనరాష్ట్ర ప్రభుత్వం కోరితే కేంద్రప్రభుత్వం అంగీకరిస్తుంది.

బీబీనగర్, నడకుడితో సహా కొన్ని రైలు మార్గాలను నూతనంగా ఏర్పాటుచేయుటకు, కొన్ని మార్గాలను డబ్లింగ్ చేయుటకు, కొన్ని మార్గాలను విద్యుద్దీకరించుటకు రాష్ట్ర ప్రభుత్వం కొంత, రైల్వే శాఖ కొంత భరించి చేపట్టునట్లు అవగాహన కుదుర్చుకున్నారు. ప్రస్తుతం కేంద్రం నుండి తగు సహకారము లేక, కొన్ని హామీలు అమలు పర్చటంలో ఇబ్బందులుపడుతూ ఆర్థిక సంక్షోభాన్ని ఎదుర్కొంటూ ఉన్న మన రాష్ట్ర ప్రభుత్వం విజయవాడ, విశాఖపట్నం నగరాలలో మెట్రో రైళ్ళ వ్యవస్థలను ఇప్పటికిప్పుడు ఏర్పాటు చేయాలనే ఆలోచనను విరమించి లభ్యమయ్యే నిధులను మన రాష్ట్ర పరిధిలో రైల్వే వ్యవస్థ అభివృద్ధికి ఉపక్రమించాలి.

కేంద్రప్రభుత్వం పెద్దఎత్తున జాతీయ రహదారులను అభివృద్ధి చేయాలని రాష్ట్ర హైవేలను తీసుకుని జాతీయ రహదారులుగా అభివృద్ధి చేసేందుకు నిధులు కేటాయిస్తుంది. ఈ అవకాశాన్ని ఉపయోగించుకుని తమిళనాడులో వలె మన రాష్ట్రములో కూడా రహదారుల వ్యవస్థను అభివృద్ధి చేసుకోవలసి ఉంటుంది. ఇంకా రెండు దశాబ్దాల తర్వాత కాని అవసరం కానటువంటి అమరావతి ఔటర్‌రింగ్ రోడ్డు ఇప్పుడే చేపట్టాలని అత్యుత్సాహంతో ముందుకు సాగటం ఏమాత్రం సమర్ధనీయం కాదు.

వ్యవసాయము, అనుబంధ రంగాలకు కేటాయింపులను పెంచి సేంద్రీయ సాగునకు, వ్యవసాయ యాంత్రీకరణకు ప్రోత్సాహమును అందిస్తూ ప్రకృతి వైపరీత్యాలప్పుడు నష్టపోయిన యావత్తు విస్తీర్ణమునకు ఇన్‌పుట్ సబ్సిడీని అందిస్తూ, మార్కెట్‌లో ధరలు పడిపోయినపుడు "మార్కెట్ ఇంటర్వెన్షన్" స్కీము ద్వారా కేంద్రప్రభుత్వ సహకారం కూడా తీసుకుని రైతులను ఆదుకోవాల్సి ఉంటుంది. రాష్ట్ర ముఖ్యమంత్రి తొలిగా సంతకము చేసిన "వ్యవసాయ ఋణమాఫీ పథకం" నకు రూ. 50,000/-లు పైన ఋణం తీసుకున్న రైతులకు ఇంతవరకు 2వ కిస్తీ విడుదల చేసి యుండలేదు. రాష్ట్ర ప్రభుత్వం నుండి గాని, రిజర్వు బ్యాంకు నుండి ఆదేశాలు లేనందున బ్యాంకులు రైతుల నుండి హెచ్చు మొత్తాలను గుంజుతూ ఉన్న పరిస్థితిని గుర్తించుకుని ప్రభుత్వం వెంటనే స్పందించాలి.

గత ప్రభుత్వ హయాంలో సాగునీటి రంగములో నూతన పథకాల అమలులో చోటుచేసుకున్న అక్రమాలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలి. లాభం మిగిలే మట్టి పనులను మాత్రం చేసి, కాంక్రీటు పనులను అసంపూర్తిగా వదిలివేసిన కాంట్రాక్టర్ల నుండి జరిమానాను వసూలు చేయటంకాని, వారిని బ్లాక్ లిస్ట్‌లో పెట్టడంకాని చేయకపోతే ఇప్పుడు కూడా అదే తంతు కొనసాగుతుంది. అనేక అక్రమాలకు తావిచ్చిన ఇ.పి.సి. పద్ధతిని విడనాడవలసిన అవసరం ఎంతైనా ఉన్నది.

రాష్ట్రాన్ని పారిశ్రామికంగా అభివృద్ధి చేసుకుంటూ, ఉపాధి అవకాశాలను మెరుగు మెరుగుపర్చుకొంటూ రాష్ట్ర ప్రభుత్వానికి ఆదాయాన్ని పెంచుకోవలసిన ఆవశ్యకత ఉంది.

ఏ అభివృద్ధి కార్యక్రమానికైనా భూమి అవసరం అనే ప్రాథమిక సత్యాన్ని ఎవరూ కాదనలేరు. లోగడ పారిశ్రామికాభివృద్ధి పేరుతో, "స్పెషల్ ఎకనామిక్ జోన్"ల పేరుతో వేలాది ఎకరముల భూములు పేద రైతుల నుండి, సాగుదారుల నుండి గుంజుకోబడ్డాయి. వాటివెనుక సాగిన అవినీతి బాగోతాలు బహిరంగ మయ్యాయి. ఇప్పటికీ అనేక వేల ఎకరాల భూములు ప్రభుత్వం వద్ద కాని, ఎ.పి.ఐ.ఐ.సి. వద్ద కాని ఉన్నాయి. ముందుగా ఈ భూములను సద్వినియోగం చేసుకోవచ్చు. భూములను తీసుకొనే సందర్భంలో పార్లమెంట్ ఆమోదం పొందిఉన్న చట్టం"2013 న్యాయమైన పరిహారంతో భూసేకరణ, పునరావాస చట్టం" క్రింద మాత్రమే రైతుల భూములను తీసుకొనవచ్చును.

మన దేశంలో విద్యావంతులతో సహా యువతకు నైపుణ్యాభివృద్ధి కల్పించితేనే వారికి అధిక ఆదాయంతోపాటు దేశ ప్రగతికి కూడా దోహదం చేకూరుతుందని కేంద్రప్రభుత్వం భావించుతూ ఉన్నది. రాష్ట్ర ప్రభుత్వ పరిపాలనలో, శాఖల మధ్య సమన్వయం లోపాల వలన ఈ కార్యక్రమం ఆశించిన మేరకు ముందుకు సాగటంలేదు. వెనుకబడిన ప్రకాశం జిల్లాలో యువతకు నైపుణ్య శిక్షణ ఇచ్చేందుకు "సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టూల్ డిజైన్" (సి.ఐ.టి.డి) ముందుకు వచ్చినా ఒంగోలు సమీపమున మద్దిపాడు మండలం"అన్నంగి" వద్ద ఏర్పాటు చేయబడిన గ్రోత్ సెంటర్‌లో 12 సం.ల నుండి ఖాళీగా ఉన్న భవనమునకు ఏడాదికి 3 లక్షలు అద్దె చెల్లించాలని రాష్ట్ర ఆర్థికశాఖ కోరటం, సి.ఐ.టి.డి. నామమాత్రపు అద్దె ఇవ్వాలని కోరటం జరిగింది. విజయవాడలో భవన యజమానులు తక్కువ అద్దెలకు ఉద్యోగులకు ఇవ్వాలని కోరుతూ ఉన్న ప్రభుత్వం ఖాళీగా మూతపడిన భవనాన్ని మన యువతకు మేలు చేకూర్చుడానికి కేంద్ర సంస్థకు ఇచ్చేందుకు తటపటాయించటం ఇందుకు ఒక ఉదాహరణ.

మన నవ్యాంధ్రప్రదేశ్‌లో 13 జిల్లాలలో అభివృద్ధిని సాధిస్తామని, హైదరాబాద్ వలే కాకుండా అభివృద్ధిని వికేంద్రీకరిస్తామని చెప్పిన ప్రభుత్వం ఈనాడు అమరావతి రాజధాని నిర్మాణ అంశంపైనే కేంద్రీకరించటం ఏ విధంగాను సరికాదు. రాష్ట్ర విభజన చట్టంలో హామీ ఇచ్చిన విధంగా నూతనంగా ఏర్పడ్డ నవ్యాధ్రప్రదేశ్ రాజధానికి అవసరమైన రాజ్‌భవన్, అసెంబ్లీ, కౌన్సిల్, హైకోర్టు, సెక్రటేరియట్, హెచ్.ఒ.డి. కార్యాలయములు, ప్రజాప్రతినిధులు, ఉద్యోగుల నివాస భవనములతోపాటు మౌలిక సదుపాయాలు (రహదారులు, సాగునీరు, విద్యుత్, డ్రైనేజి)లకు నిధులు అందచేసెదమని ఇచ్చిన హామీని అమలు చేయించుకోవలసిన బాధ్యత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఉంది. ఇప్పటికే సింగపూర్ సంస్థలు "సీడ్ కాపిటల్" ఇచ్చి ఉన్న మాష్టర్ ప్లాన్ నేపథ్యంలో దానిలో సెక్రటేరియట్‌కు సూచించిన స్థలములోనే శాశ్వత సెక్రటేరియట్ భవన నిర్మాణము చేపట్టడం సబబు. కాని అందుకు భిన్నంగా సమీపంలో వేరే ప్రదేశంలో తాత్కాలిక

సెక్రటేరియట్ భవన నిర్మాణము ప్రస్తుతం ఆర్థిక పరిస్థితులలో ఏవిధంగానూ సమర్ధనీయం కాదు. సింగపూర్, చైనా, జపాన్ మున్నగు దేశములకు చెందిన వ్యాపార సంస్థలకు మన రైతుల భూములను కట్టబెట్టాలనుకోవటం సరికాదు. మాస్టర్‌ప్లాన్ ప్రకారము రహదారులను ఏర్పరచి, కేంద్రప్రభుత్వ నిధులతో "సీడ్ కాపిటల్" నిర్మాణమును చేపట్టి మిగిలిన భూమిలో విదేశీ, స్వదేశీ సంస్థలకు విద్యాసంస్థలు కాని, హాస్పటల్స్‌కు గాని, నివాస, వాణిజ్య భవనములు, క్రీడలు, వినోద కేంద్రాలు వంటి వాటిని ఏర్పాటు చేయటానికి ముందుకు వచ్చినపుడు బహిరంగ ఆక్షన్ ద్వారా గాని భూమి ధర నిర్ణయించి అమ్మటం ద్వారా గాని రాజధాని నగర అభివృద్ధికి ప్రయత్నం చేయవచ్చు.

నూతన రాజధాని నగర నిర్మాణ ప్రక్రియ రెండు లేక మూడు సం.లలో సాధ్యమయ్యే పనికాదు. చండీఘర్, నయా రాయ్‌పూర్‌ల అనుభవాలు మనముందు ఉన్నాయి. రాష్ట్రప్రభుత్వం ఆశిస్తూ ఉన్న స్థాయిలో ఆర్థిక సహకారం రావటంకాని, భవన నిర్మాణములు జరగటం కాని, పారిశ్రామిక-వాణిజ్య సంస్థలు రావటం కాని, లక్షలాదిగా ప్రజలు నివాసాల కొరకు తరలిరావటం కాని సాధ్యమయ్యే పనికాదు. అందువలన సీడ్ కాపిటల్ ఏర్పాటుచేయగా, లాండ్ పూలింగ్ స్కీమ్ హామీ ప్రకారం రైతులకు ఇవ్వవలసిన నివాస-వాణిజ్య ప్లాట్లను ఇవ్వగా రహదార్లు నిర్మించగా, జలాశయములు పోగా ప్రభుత్వ వాటాకు వచ్చు భూమిని ఖాళీగా ఉంచకుండా కూరగాయలు, పూలు, అరటి తోటలు వంటి పంటలను వార్షిక లీజు పద్ధతిపై సాగుచేసుకొనడానికి అవకాశం కల్పించితే నిన్నమొన్నటి వరకు వ్యవసాయంపైనే ఆధారపడిన సన్న, చిన్నకారు, కౌలురైతులు, వ్యవసాయ కూలీలకు కూడా ఉపాధి లభించడమేకాక రాజధాని నగర వాసులకు ఈ వ్యవసాయ ఉత్పత్తులు సరసమైన ధరలకు లభించే వీలు కలుగుతుంది.

విదేశీ, స్వదేశీ పెట్టుబడులను ఆకర్షించాలంటే కొన్ని ప్రోత్సాహకాలతోపాటు, అవినీతికి ఆస్కారంలేని సమర్ధవంతమైన, పారదర్శకమైన పాలన ఇవ్వగలగడం అత్యంత అవసరం. కాని ఈనాడు మన రాష్ట్రంలో క్షేత్రస్థాయిలో పరిస్థితి ఇందుకు ఆశాజనకంగా లేదు. అత్యంత ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులోకి వచ్చినా సామాన్య ప్రజలు, దైనందిక జీవితంలో ఎదుర్కొంటూ ఉన్న సమస్యల పరిష్కారం, సౌకర్యాల కల్పనలో చాలా లోపం జరుగుతూ ఉంది. ఈ పరిస్థితిని చక్కదిద్దటానికి ప్రభుత్వం దృఢచిత్తంతో కృషిచేసినప్పుడే రాష్ట్ర అభివృద్ధి వేగంగా పరుగులు తీసే అవకాశం ఉంటుంది.

* * *

# ప్రజామోద యోగ్యమైన నవ్యాంధ్ర రాజధాని నిర్మించుకొందాం

నవ్యాంధ్రప్రదేశ్ రాజధానిని గుంటూరు - విజయవాడ మధ్యే ఏర్పాటు చెయ్యనున్నట్లు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గారు ప్రకటించడం పట్ల శ్రీకాకుళం జిల్లా నుండి అనంతపురం వరకు కొద్దిమంది మినహా ప్రజలు హర్షించారు. ప్రపంచస్థాయి అత్యుత్తమ రాజధాని నగరాన్ని ఏర్పాటు చేయదలచినట్లు, అందుకు మొదటి దశలో 25వేల నుండి 30వేల ఎకరాలు, తదుపరి దశలవారీగా మొత్తం మీద లక్ష ఎకరాల వరకు భూమిని ల్యాండ్‌పూలింగ్ పద్ధతిలో సేకరించనున్నట్లు మున్సిపల్ శాఖామంత్రి నారాయణ గారు ప్రకటించారు. దాదాపు 1లక్ష 10వేల కోట్ల వ్యయంతో సింగపూర్‌ను మించిన నగరాన్ని అభివృద్ధి చేస్తామని ప్రభుత్వ వర్గాలు పేర్కొన్నాయి.

ప్రభుత్వ పక్షముగా మొదటి దశలో 30వేల ఎకరాలలో రాజ్‌భవన్, అసెంబ్లీ, సెక్రటేరియట్, వివిధ వాఖాదిపతుల కార్యాలయాలు, శాసనసభ్యులకు, ఉద్యోగులకు నివాస సముదాయాలు మున్నగు వాటికి ఎంతెంత భూమి అవసరమో, మిగతా విస్తీర్ణములో రహదారులు, డ్రైన్లు, తాగునీటి వసతి మున్నగు సౌకర్యములు ఏర్పరుచుటయేగాక యింకనూ, ఏ ఏ సంస్థలకు కేటాయించనున్నదో తెలియపర్చి ఉండలేదు. తదుపరి దశలలో సేకరించతలపెట్టిన 70 వేల ఎకరాలలో ఏ ఏ నిర్మాణాలు రానున్నాయో ప్రకటించి ఉండలేదు. కొందరు మంత్రులు కృష్ణా నదికి ఇరువైపులా నదికి అభిముఖంగా రాజదాని ఏర్పాటు అవుతుందని ప్రకటనలు చేశారు, ఫలితంగా గందరగోళ పరిస్థితులు నెలకొన్నాయి.

మనదేశంలో స్వాతంత్రానంతరం నిర్మించబడ్డ చండీఘర్, గాంధినగర్, భువనేశ్వర్, నయా రాయపూర్ నగరములేకాక, మలేసియా రాజదాని పుత్రజయ, ఇస్తాంబుల్, షాంఘై, సింగపూర్, మున్నగు నగరములను కూడా సందర్శించి, నవ్యాంధ్రప్రదేశ్ రాజధానికి రూపకల్పన చేస్తామన్నారు. సాదారణంగా రాజధాని నగరము అనగానే గుర్తుకువచ్చేవి అసెంబ్లీ, సెక్రటేరియట్, హైకోర్టు, శాఖాదిపతుల కార్యాలయాలు, మున్నగునవి. ఇవి అన్నీ ఉండే ప్రాంతాన్ని "క్యాపిటల్ కాంప్లెక్స్" అంటారు.

గుజరాత్ రాజదాని నగరముగా నిర్మించబడ్డ గాంధీనగర్ విస్తీర్ణం 12 వేల ఎకరములు. అందులో అసెంబ్లీ, హైకోర్టు, సెక్రటేరియట్, హెడ్స్ ఆఫ్ డిపార్టుమెంట్ కార్యాలయాలతో పాటు కొన్ని కేంద్రప్రభుత్వ కార్యాలయాలతో సహా 5వందల ఎకరముల విస్తీర్ణములోనే నిర్మించబడ్డాయి. నూతనంగా ఏర్పరచబడ్డ చత్తీస్‌ఘడ్ రాష్ట్ర రాజదాని నయా రాయపూర్ నకు 20 వేల ఎకరాలు సేకరించబడ్డాయి. అందులో అసెంబ్లీతో సహా “క్యాపిటల్ కాంప్లెక్స్” 750 ఎకరముల విస్తీర్ణములో ఏర్పాటు చేయబడ్డాయి. మలేసియా దేశ రాజధాని పుత్రజయ నగర విస్తీర్ణం 12 వేల ఎకరములు మాత్రమే. యిట్టి నేపధ్యంలో నవ్యాంధ్రప్రదేశ్ రాజధానికి 30 వేల నుండి, లక్ష ఎకరముల భూమి అవసరమా అన్న ప్రశ్న ఉదయిస్తూ వుంది, ప్రస్తుతం విజయవాడ సిటీ 15వేల ఐదు వందల ఎకరాలలో గుంటూరు సిటీ, 13వేల ఎకరాల విస్తీర్ణములో ఉన్నాయన్న వాస్తవాన్ని దృష్టిలో ఉంచుకోవాలి. కావున ఈ విషయమై రాష్ట్ర ప్రభుత్వము పునరాలోచన చేసి వివరాణ్మక పత్రమును విడుదల చేయుట అవసరము.

ఆంధ్రప్రదేశ్ విభజన చట్టంలో నూతన రాష్ట్రానికి రాజ్‌భవన్, హైకోర్టు, అసెంబ్లీ, సెక్రటేరియట్, శాఖాధిపతుల కార్యాలయాలు, శాసనసభ్యులు, అధికారుల నివాస సముదాయముల కొరకు కేంద్ర ప్రభుత్వము ఆర్ధిక సహకారము అందించగలదని పేర్కొనబడినది. గతంలో ఉత్తరాఖండ్ రాష్ట్రమునకు 436 కోట్లు, జార్ఖండ్ రాష్ట్రమునకు రూ.800 కోట్లు కేంద్ర ప్రభుత్వము అందించినది. చత్తీస్‌ఘడ్ రాష్ట్ర రాజదానిగా నిర్మాణము అవుతూ ఉన్న నయా రాయపూర్‌నకు ఇప్పటికి కేవలం రూ.580 కోట్లు అందించినది. 2008లో నిర్మాణం ప్రారంభమై కొనసాగుతూ ఉన్నది. ఇప్పటికి రూ.2,600 కోట్లు ఖర్చు అయినది. 2030 వరకు నిర్మాణం కొనసాగవచ్చుని అంచనా.

ఇట్టి పరిస్థితులలో మన నవ్యాంధ్ర రాజధాని నిర్మాణమునకు కేంద్రం ఏ మేరకు ఆర్ధిక సహకారమును అందించగలదు అనేది అతి ముఖ్యమైన అంశం! దాదాపు రూ.16 వేల కోట్ల రెవిన్యూ లోటుతో ఉన్న మన రాష్ట్ర ప్రభుత్వానికి యిది ఒక గడ్డు సమస్య కాగలదు. కేవలం రెండు రోజుల క్రితం ఈ విషయమై మన రాష్ట్ర ప్రభుత్వం, కేంద్ర ప్రభుత్వానికి లక్ష కోట్లకుపైన సహకారమును అందించవలయునని కోరినట్లుగా వార్తలు వచ్చాయి. ఏ మేరకు కేంద్రం స్పందిస్తుందో చూడాల్సి ఉంది.

రాజదాని నిర్మాణమునకు అవుసరమైన భూమిని సేకరించే దానిలో కూడా కొంత గందరగోళ పరిస్థితులు ఉన్నాయి. 2013 భూసేకరణ చట్టం ప్రకారం బహుళ పంటలు పండే భూమిని సేకరించరాదు. రైతులతోపాటు ఆ ప్రాంతములోని కౌలు రైతులు, వ్యవసాయ కార్మికులు, ఇతర పేదవర్గాలవారితో సహా 70% మంది సేకరణకు అనుకూలముగా ఉంటేనే భూసేకరణ చేపట్టటానికి వీలుంటుంది. మార్కెట్ వాల్యూ అనగా సబ్ రిజిస్ట్రార్ ఆఫీసులో లెక్క ప్రకారం భూమి విలువకు రెండున్నర నుండి నాలుగు రెట్ల వరకు పరిహారం అందించే వీలు ఉన్నా ఈ మొత్తం వాస్తవ బహిరంగ

మార్కెట్ విలువ కన్నా చాలా తక్కువ ఉంటుంది. మరొక ప్రత్యామ్నాయ మార్గం భూసమీకరణ. భూసేకరణ విధానంలో ప్రభుత్వం రైతులకు నష్టపరిహారంతోపాటు చట్టం ప్రకారం నిర్వర్తించవలసిన ఇతర బాధ్యతలు అనగా 10 సం.ల పాటు జీవనభృతి కొరకు కొంత నగదు మొత్తమును ఇవ్వడం, ఇండ్లు, ఉపాది అవకాశములు కల్పించడం మున్నగు అంశాలు కూడా ఇమిడి ఉన్నాయి. ప్రస్తుత పరిస్థితులలో రాష్ట్ర ప్రభుత్వం భూసేకరణ పద్ధతులలో ముందుకు సాగడం కష్టం. భూ సమీకరణ పద్ధతిలోనే ముందుకు సాగగలదు, అయితే అందుకు తగిన విధముగా రైతులతో సహా అందరి ప్రయోజనాలను పరిరక్షించుటకు చట్టమును తీసుకురావలసి ఉంటుంది.

భూ సమీకరణ విధానంలో తక్షణమే రైతులకు నష్ట పరిహారం చెల్లించవలసిన ఆవశ్యకత ఉండదు. రహదారుల వంటి వాటితో భూమిని అభివృద్ధి చేయగా కొంత భూమిని రైతులకు ఇచ్చి, మిగిలిన భూమిని ప్రభుత్వం ఉంచుకునే వీలు ఉంటుంది. కొంతకాలం క్రితం విజయవాడ నగరమునకు సమీపంలో జక్కంపూడి వద్ద, విశాఖ పట్టణం నగరమునకు సమీపంలో కొంత భూమిని, భూ సమీకరణ పద్ధతులలో సేకరించటం జరిగినది. ఎకరమునకు 1800 చ.గ.ల రహదారులకు పోగా, 1800 చ.గ. రైతులకు ఇచ్చి, 1240 చ.గ. ప్రభుత్వం ఉంచుకొన్నది. యిప్పుడు తుళ్ళూరు ప్రాంతంలో రాజధానికి భూ సమీకరణ విషయంలో రాష్ట్రప్రభుత్వం 1000 చ.గ.ల నివాస స్థలమును 100 నుండి 200 చ.గ.ల వాణిజ్య స్థలమును యిచ్చు ప్రతిపాదనను రైతుల ముందు ఉంచినది. విజయవాడ, విశాఖ నగరముల సమీపంలో భూ సమీకరణలో కన్నా యిక్కడ తక్కువ వస్తుందన్న అభిప్రాయం రైతులలో ఉన్నది.

ముందు ప్రకటించిన గ్రామములకు తోడు, దరిమిలా మరికొన్ని గ్రామములను కూడా భూసమీకరణలో చేర్చటం జరిగింది. కృష్ణా కుడి కరకట్ట వెంటనే ఉన్న కొన్ని గ్రామములలో అత్యంత సారవంతమైన భూములు ఉన్నాయి. భూగర్భ జలాలు 10 నుండి 20 అడుగుల లోతుల లోనే లభ్యమవుతాయి. కూరగాయలు, పూలు, పసుపు, మిర్చి, అరటి వంటి వాణిజ్య రైతులకు తోడు నిమ్మ తోటలు కూడా ఉన్నాయి. ఎకరాకు దాదాపు లక్ష రూపాయల వరకు కూడా ఆదాయము వచ్చే భూములు, అందువలన ఈ గ్రామాలలోని అధిక భాగం రైతులు భూములు యిచ్చేందుకు సుముఖత చూపటం లేదు. తుళ్ళూరు మండలంలో పత్తి, పొగాకు పైర్లను సాగుచేస్తూ కొండవీటివాగు ముంపునకు గురయ్యే గ్రామాలలోని రైతులు తమ భూములను యిచ్చేందుకు ముందుకు వస్తూ ఉన్నారు. యిలా రైతుల అంగీకారంతో 10 నుండి 20 వేల ఎకరముల లోపు భూములను సమీకరించడానికి యిబ్బంది లేకపోవచ్చు. కృష్ణా నది కట్టకు ప్రక్కన ఉన్న గ్రామాలను మినహాయించుట సముచితంగా ఉంటుంది.

ప్రస్తుతం ప్రభుత్వం ప్రతిపాదించిన తుళ్ళూరు మండలంలోని పలు గ్రామాల భూములు దాదాపు 2 లేక 3 సం.లకు ఒక పర్యాయం కొండవీటి వాగు వరదలకు

మునిగిపోతూ ఉంటాయి. లోగడ నుండి ఇరిగేషన్ శాఖ పక్షాన కొద్దిపాటి చర్యలు తీసుకొన్నా, ముంపు ప్రభావం అరికట్ట బడలేదు. నిపుణులతో చర్చించి ఎగువన కొండవీటి వాగు పరీవాహక ప్రాంతము నుండి హెచ్చు పరిమాణంలోవచ్చు నీటిని నిల్వచేయు సామర్థ్యం గల ఒకటి రెండు రిజర్వాయర్లను యుద్ధ ప్రాతిపదికన రానున్న జూన్ మాసం లోపల నిర్మాణం చేయించవలసిన ఆవశ్యకత ఎంతైనా ఉన్నది. రైతులకు మరింత అధిక ప్రయోజనం కల్పించడతోపాటు, కౌలురైతులు, యితర అల్పాదాయ వర్గాల వారికి ఉపాది అవకాశములను నివాస సముదాయాన్ని తప్పనిసరిగా ఏర్పాటు చేయవలసి వుంటుంది.

రాజదాని నగరమును "స్మార్ట్ సిటీగా" అభివృద్ధి చేయవచ్చు. ఇప్పటికే కేరళ రాష్ట్రంలో కొచ్చిన్ సమీపములో "కొచ్చి స్మార్ట్ సిటీని" కేవలం 246 ఎకరముల విస్తీర్ణములో నిర్మించబడుతూ ఉన్నది. మొదటి దశగా 6.5 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణముతో 7 అంతస్తుల భవన నిర్మాణం పూర్తి అవుతూ ఉన్నది. 2020 నాటికి పూర్తికాగల ఈ ప్రాజెక్టు ద్వారా 88 లక్షల చ.అ. విస్తీర్ణం అందుబాటులోనికి రానున్నది.

దక్షిణ కొరియా రాజదాని సియోల్ నగరమునకు సమీపంలో నిర్మించబడ్డ స్మార్ట్ సిటీ "ఈయున్" - పైకాంగ్ - "యు సిటీ" 862 ఎకరములలో 2006 నుండి 2011 లోపు నిర్మించడం జరిగినది. యిందులో 55 వేలమంది ప్రజలు నివసిస్తున్నారు. ఇన్ఫర్మేషన్ టెక్నాలజి, కమ్యూనికేషన్ టెక్నాలజీలను ప్రజలకు అవుసరమైన నీరు, విద్యుత్, డ్రైనేజి, రవాణా, వాణిజ్య, నివాస, మున్నగు ప్రజా అవుసరాలకు సమర్ధవంతముగా ఉపయోగించబడునట్లు స్మార్ట్ సిటీని రూపొందిస్తారు. కొత్తగా నిర్మించే దానికి తక్కువ విస్తీర్ణం సరిపోతుంది. యిప్పటికే అభివృద్ధి చెందిన పెద్ద నగరాలలో పలు కూడలి ప్రదేశములలో వై-ఫై సదుపాయములను ఏర్పాటు చెయ్యటంతో సహా కొన్ని చర్యలు తీసుకోబడతాయి. హైద్రాబాద్ నగరంలో కూడా ఈ ప్రయత్నం ఆరంబం అవుతూ ఉన్నది.

ప్రభుత్వంలోని కొందరు పెద్దలు సింగపూర్ లాంటి రాజధానిని నిర్మించాలని ఆకాంక్షిస్తూ ఉన్నారు. సింగపూర్ ఒక చిన్న ద్వీప దేశం. సింగపూర్ జి.డి.పి. 425 బిలియన్ డాలర్లు. మన నవ్యాంధ్ర ఆంధ్రప్రదేశ్ జి.డి.పి. 75 బిలియన్ డాలర్లు, సింగపూర్ ఈ స్థాయికి చేరడానికి ఆరు దశాబ్దాలకాలం పట్టినది. అవినీతి అతి తక్కువ. పరిశుభ్రత, క్రమశిక్షణలకు మారుపేరు. వ్యవసాయం దాదాపుగా లేదు. జి.డి.పి.లో పరిశ్రమలు, నిర్మాణరంగంతో సహా 27 శాతము,వాటా సేవలరంగంది 73 శాతం వాటా, పన్నులు అతి తక్కువ. మన ఆంధ్రప్రదేశ్, భారతదేశంలో ఒక రాష్ట్రం. ఆర్ధిక విదానాలు, పన్నులు మున్నగు అంశాలలో కేంద్రప్రభుత్వ నిర్ణయాలే

శిరోదార్యం. మన దేశంలోని 11 మేజరు పోర్టులలో ఏటా 511 మి.మి.టన్నుల కార్గో నిర్వహింపబడుతూ ఉండగా సింగపూరు లోని పోర్టు 534 మి.మి. టన్నుల కార్గోని నిర్వహించింది.

మనకున్న వనరులలో మన 13 జిల్లాలను అభివృద్ధి చేసుకొంటూ ముందుకుసాగాల్సి ఉంది. వాస్తవానికి "క్యాపిటల్ కాంప్లెక్స్‌ను" వెయ్యి ఎకరముల లోపలే నిర్మించుకోగల అవకాశము ఉన్నా, ఒక సుందరమైన రాజదాని నగరాన్ని నిర్మించాలనే తపన రాష్ట్ర ప్రభుత్వానికి వుంది కాబట్టి రైతులు అంగీకారం తెలుపుతూ ఉన్న, 10 వేలు లేక 15 వేల ఎకరాలు సమీకరించి అందమైన ఆదర్శ ప్రాయమైన స్మార్ట్ సిటీని "ఎన్.టి.ఆర్. నగర్"గా నామకరణం చేసి, కేంద్రప్రభుత్వం సహకారంతో రాష్ట్రప్రభుత్వముపై ఆర్థికభారం పడనిరీతిలో అభివృద్ధి చెయ్యటం సముచితం. తీసుకొన్న భూమిలో విశాలమైన రహదారులు, కృత్రిమ తటాకములు, పచ్చని ఉద్యానవనములతో, తెలుగుజాతి గర్వించదగ్గ మహనీయుల కాంస్య విగ్రహములతో తెలుగుజాతి చరిత్ర, సంస్కృతి విశిష్టలతలను ప్రతిభింబించే రాజదానిని నిర్మించుకొంటూ వివిద జిల్లాలలో రాష్ట్ర ప్రభుత్వం చేపటుతామని ప్రకటించిన పథకాలను అమలు చేస్తూ స్వర్ణాంద్రప్రదేశ్ సాధించాల్సి ఉన్నది.

* * *

# అమరావతి రాజధాని
# అమరావతి సమీపాన స్థల నిర్ణయం సబబేనా?

"ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టం – 2014" సెక్షన్ 6 అనుసరించి ఏర్పాటు చేయబడిన శివరామకృష్ణన్ కమిటీకి నిర్దేశించబడిన మార్గదర్శక సూత్రాలను రాష్ట్రప్రభుత్వం విస్మరించింది. వ్యవసాయ భూములకు పెద్దగా నష్టం చేకూర్చని రీతిలో తక్కువమంది ప్రజలు, నివాస ప్రాంతాలకు పునరావాసం కల్పించేలా, పర్యావరణము, నీటి వనరుల సహజస్థితికి భంగం కలుగకుండా, భూసేకరణ కొరకు – నిర్మాణం కొరకు తక్కువ వ్యయం అయ్యేవిధంగా రాజధాని స్థల నిర్ణయం జరగాలని మార్గదర్శక సూత్రాలలో స్పష్టం చేయబడింది.

రాజధాని నిర్మాణం కొరకు అవసరమయితే అటవీ భూమిని డీనోటిఫై చేసి యివ్వగలమని కూడా విభజన చట్టంలో హామీ యివ్వబడింది. కృష్ణా జిల్లాలో నూజివీడు, ఆగిరిపల్లి ప్రాంతములో వేలాది ఎకరాలలో పెద్దగా వృక్షములు లేని హీనస్థితిలో (డీగ్రేడెడ్) ఫారెస్ట్ భూములు వున్నాయి. నావ్యాంధ్రప్రదేశ్ రాష్ట్రంలో శ్రీకాకుళం – అనంతపురంలకు దాదాపు సమానమైన దూరంలో వుంటుంది. సమీపం నుండి నాగార్జునసాగర్–నూజివీడు బ్రాంచి కెనాల్, పోలవరం కుడి కాలువలు వెళ్తూ వున్నాయి. దగ్గరలో గన్నవరంలో ఎయిర్‌పోర్టు వుంది. విజయవాడ–కలకత్తా నేషనల్ హైవే నెం.5 మరియు ఇబ్రహీంపట్నం – జగదల్‌పూర్ నేషనల్ హైవే నెం.221 వెళ్ళుతున్నాయి. భూసేకరణ సమస్య ఎదురయ్యేదికాదు.

కాని వాస్తు కొరకు, నదీ అభిముఖ అభివృద్ధిపైన మక్కువతో అమరావతి సమీపమున ప్రస్తుతం ఏర్పాటు చేయబడిన ప్రదేశంలోని భూములలో రాజధాని నగర నిర్మాణ ప్రతిపాదన సరికాదు. కొన్నివేల సంవత్సరములపాటు కృష్ణానది ప్రవహించినందువలన ఏర్పడిన అత్యంత సారవంతమైన జరీబు భూములు యిప్పుడు కాంక్రీటు జంగిల్‌గా మారబోతున్నాయి. ఈ భూములను "ఫ్లడ్‌ప్లెయిన్స్" అంటారు. ఈ భూముల దిగువన 20 అడుగుల లోతు నుండి స్వచ్ఛమైన త్రాగునీరు లభించుతుంది. నిపుణుల అంచనాల ప్రకారం ఈ ఫ్లడ్ ప్లెయిన్స్ భూముల క్రింద లభించు మంచినీరు

10 లక్షల జనాభా త్రాగునీటి అవసరాలు తీర్చుతుందని లెక్కవేయబడింది. ప్రతి సంవత్సరం కురియు వర్షములు, కొండవీటివాగు, కృష్ణా నది వరదల వలన రీచార్జ్ అవుతూవుంటుంది. సుమారు 12వేల ఎకరముల విస్తీర్ణం ఉన్న జరీబు భూములను/ ఫ్లడ్ ప్లెయిన్స్ కాంక్రీటు జంగిల్‌గా మార్చటం వలన వందలకోట్లు ఖర్చుచేసి కృష్ణానది పైన మంచినీటి నిల్వకొరకు బ్యారేజీని నిర్మించాలని ప్రభుత్వం భావిస్తూవుంది.

కొండవీటి వాగు వరదల వలన ముంపునకు గురయ్యే సుమారు 10వేల ఎకరముల భూమిని రూ.1500 కోట్ల ఖర్చుతో 2 మీటర్ల ఎత్తున మెరక చెయ్యవలసి వుంటుందని సి.ఆర్.డి.ఎ. అంచనావేసింది. లింగాయపాలెం, ఉద్దండరాయునిపాలెం, తాళ్ళాయపాలెం గ్రామాల వద్ద "స్టార్టప్ ఏరియా" అభివృద్ధికై స్విస్ చాలెంజ్ విధానంలో సింగపూర్ సంస్థలు సమర్పించి, రాష్ట్ర ప్రభుత్వం ఆమోదించిన ప్రతిపాదన ప్రకారం సముద్రమట్టమునకు 24 మీటర్ల స్థాయికి రాష్ట్ర ప్రభుత్వం భూమిని లెవెల్ చేయవలసి వుంటుంది. యిలా జరిగినప్పుడు అనేక గ్రామాలలో యిపుడు వున్న నివాస ప్రాంతాలన్ని బారీ వర్షములు కురిసినపుడు జలమయమయ్యే ప్రమాదం స్పష్టంగా వుంది.

దీనికితోడు రాజధాని ప్రాంతములో "బ్లూ - గ్రీన్" కాన్సెప్ట్‌లో రెండు పెద్ద జలాశయములు, కాలువలు, బోటు విహారములు ఉండేలా ప్రణాళికలు రూపొందించబడుతున్నందువలన ఈనాటికి తోడు అధిక వర్షములు సంభవించినపుడు, కృష్ణా నదికి 2009లో వచ్చిన భారీ వరదలు లాంటివి సంభవించితే యిప్పుడు ప్రభుత్వం కొండవీటి వాగు ముంపు నివారణ కొరకు చేపడుతున్న లిఫ్ట్ పథకం వలన కూడా ఉపయోగం ఉండక రాజధాని ప్రాంతములో చాలాభాగం ముంపునకు గురియై తీరుతుంది.

**జనాభా పెరుగుదల అంచనాలలో నిజమెంత?**

సింగపూర్ సంస్థలు ముందు అందచేసిన రాజధాని మాష్టర్ ప్లాన్‌లో 2050 నాటికి 45 లక్షలకు చేరుతుందని పేర్కొనగా తదుపరి అందచేసిన మాష్టర్‌ప్లాన్‌లో 25 లక్షలకు

❊ ❊ ❊

# నవ్యాంధ్ర ప్రజా రాజధానికై సింగపూర్ ప్రతిపాదన సరైనదేనా?

నవ్యాంధ్ర రాజధాని అమరావతి నగర ప్రాంత మాష్టర్ ప్లానును సింగపూర్ మంత్రి ఈశ్వరన్ ఇటీవల ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రికి అందచేశారు. సింగపూరులో రూపొందించబడిన ఈ మాష్టర్ ప్లాను చాలా బాగుందని, దీని ద్వారా అమరావతిలో ప్రజా రాజధానిగా నిర్మించబడుతుంది అని చంద్రబాబు ప్రకటించినారు. తొమ్మిది ప్రణాళికలతో, తొమ్మిది వ్యూహాలతో రూపొందించబడిన ఈ ప్రణాళికపై పైన చూడటానికి చాలా మంచిగా, సుందరముగా కనిపించినా, లోతుగా పరిశీలించినప్పుడు వాస్తవ పరిస్థితులు, అవసరాలను పరిగణలో ఉంచుకొనకుండా తయారుచేసినట్లు కనుబడుతుంది.

ఉదాహరణకు అతి సమీపములో సువిశాల ప్రాంగణములో నాగార్జున యూనివర్శిటీ ఉండగా రాజధాని నగరములో ఒక యూనివర్శిటీని స్థాపించాలి అని సూచించటము ఏవిధంగా సమంజసము? ఏమైనా కొన్ని కొత్త కోర్సులను ప్రారంభించాలి అనుకుంటే నాగార్జున యూనివర్శిటీలో ప్రారంభించవచ్చు లేదా అమరావతి నగరములో ఒక విద్యా సంస్థను నూతన కోర్సుల కొరకు ప్రారంభించవచ్చు. మంగళగిరి వి.జి.టి. ఉడా టౌన్ షిప్‌లో ఆంధ్రక్రికెట్ అసోసియేషన్ అంతర్జాతీయ పోటీల నిర్వహణకు అనుకూలముగా సుందరమైన క్రికెట్ స్టేడియమ్‌ను నిర్మించుతూ ఉండగా రాజధాని నగరములో మరొక క్రికెట్ స్టేడియమ్‌ను నిర్మించాలనే సూచన సమర్థనీయమా?

గన్నవరంలో ఎయిర్‌పోర్టును అంతర్జాతీయ ఎయిర్‌పోర్టుగా అభివృద్ధి చేయుటకు కేంద్రప్రభుత్వము సహకారము అందిస్తుంది అని కేంద్రమంత్రి అశోకగజపతిరాజు స్పష్టముగా ప్రకటించి ఉన్నారు. రన్‌వే పొడిగించుటకు, ఇతర మౌలిక వసతులకు అవసరమైన భూమిని సేకరించుటకు ప్రభుత్వ యంత్రాంగము కృషి చేస్తూ వుంది. అమరావతి రాజధాని నగరము నుండి గన్నవరం విమానాశ్రయము సుమారు 30 కిలోమీటర్ల దూరములో వుంటుంది. విజయవాడలో బెంజిసర్కిల్ వద్ద ఫ్లైఓవరు,

రామవరప్పాడు రింగు నుండి, ప్రసాదంపాడు వరకు జాతీయ రహదారి విస్తరణ జరిగితే 30 ని.ల నుండి 45 ని.లలో గన్నవరం విమానాశ్రయమును చేరుకోవచ్చును. ఎన్నారై హాస్పటల్‌కు సమీపములో పెదపరిమి, నిడుమర్రు, ఎర్రబాలెం, మున్నగు గ్రామాల పరిధిలో గ్రీన్ ఫీల్డ్ ఇంటర్ నేషనల్ విమానాశ్రయము నిర్మించాలి అనే సూచన అనుసరణీయమా? దేశములో రెండవదిగా సంవత్సరానికి 3 కోట్ల 53 లక్షల ప్రయాణీకుల రాకపోకలతో, ఒక కోటి ఇరువది లక్షల జనాభా కలిగిన ముంబాయి నగరములో ఛత్రపతి శివాజి అంతర్జాతీయ ఎయిర్ పోర్టు 5 టెర్మినల్స్‌తో కేవలం 1850 ఎకరముల విస్తీర్ణముతో నిర్వహించబడుతూ ఉన్న వాస్తవాన్ని పరిగణలో వుంచుకోవాలి. దేశములో నాల్గవ స్థానములో 47 లక్షల జనాభాతో ఏటా కోటి ముప్పది ఎనిమిది లక్షల ప్రయాణీకులతో చెన్నయ్ ఇంటర్ నేషనల్ ఎయిర్‌పోర్టు 3 టెర్మినల్స్‌తో 1283 ఎకరముల విస్తీర్ణములో ఏర్పాటై ఉన్నది. ఇప్పుడు విస్తరణ కొరకు 800 ఎకరాల విస్తీర్ణము సేకరించబడుతోంది. ఈ నేపథ్యములో గన్నవరం ఇంటర్ నేషనల్ ఎయిర్ పోర్టు అభివృద్ధి అయిన తరువాత, మంగళగిరి సమీపములో మరొక ఇంటర్ నేషనల్ ఎయిర్‌పోర్టు ప్రభుత్వముపైన పెను భారాన్ని మోపుతుంది. లోగడ శంషాబాద్ చుట్టుప్రక్కల ప్రభుత్వ భూములతోపాటు ఏ పంటలు పండని, రాళ్ళు, రప్పలు, తుప్పలతో కూడిన భూమిని హైదరాబాద్ అంతర్జాతీయ ఎయిర్‌పోర్టునకు తీసుకోబడినది. కాని ఇక్కడ పలురకాల పూలు, కూరగాయలు, ఇతర వాణిజ్య పంటలతో సస్యశ్యామలముగా ఉండే భూములను తీసుకోవాలి అనే సూచన గర్హనీయం.

అమరావతి రాజధాని నగర ప్రాంతములో 127 కి.మీ.ల నిడివిలో 150 నుండి 200 అడుగుల వెడల్పుతో ఆరు వరుసలు లేక 8 వరుసల ఎక్స్‌ప్రెస్ మరియు సెమీ ఎక్స్‌ప్రెస్ రహదారులు ఏర్పాటు చేయాలి అని సూచించబడినది. ఇప్పటికి హెచ్చుస్థాయిలో ట్రాఫిక్ ఉండే పలు జాతీయ రహదారులు నాలుగు వరుసలతో ఉన్నాయి. అక్కడక్కడ అత్యంత హెచ్చు ట్రాఫిక్ ఉండే భాగములలో ఆరు వరుసలుగా విస్తరించబడుతూ ఉన్నాయి. దాదాపు 230 కిలోమీటరు ఔటర్ రింగురోడ్డు ప్రతిపాదన చేయబడింది. దాదాపు 40 లక్షల పైన జనాభా కలిగిన హైదరాబాద్ నగరము చుట్టూ దాదాపు రూ.7వేల కోట్ల ఖర్చుతో చేపట్టబడిన హైదరాబాద్ ఔటర్ రింగు రోడ్డులో ఇంకా 33 కి.మీలు నిర్మించవలసి ఉంది. ఇప్పటికి ఆ రహదారిపై ఊహించిన ట్రాఫిక్‌లో 5% కూడా ప్రయాణించడము జరగటము లేదు. అందువలన ఇక్కడ 230 కి.మీల ఔటర్‌రింగ్‌రోడ్డు ప్రతిపాదన ఏవిధముగానూ అనుసరణీయం కాదు. ఫార్ములావన్ కార్ల రేసులకు మాత్రము ఉపయోగపడవచ్చు.

అమరావతి రాజధాని ప్రాంతములో 135 కి.మీ.ల నిడివిన మెట్రో రైలు కారిడార్‌లను ఏర్పాటు చేసి విజయవాడ నగర మెట్రో రైలు వ్యవస్థతో అనుసందానించాలి అనే సూచన రాష్ట్ర ప్రభుత్వ ఖజానాపై పెనుభారాన్ని మోపుతుంది. కిలోమీటరుకు రూ.200కోట్లు ఖర్చు అయ్యే అంశాన్ని దృష్టిలోపెట్టుకుంటే ఇందుకొరకు దాదాపు 27వేల కోట్ల రూపాయలను వెచ్చించవలసి ఉంటుంది. విజయవాడ నగరములో 26 కి.మీ.ల నిడివిలో దాదాపు రూ.6723 కోట్ల వ్యయము అవుతుంది అని డి.యం.ఆర్.సి. రాష్ట్ర ప్రభుత్వమునకు నివేదిక ఇచ్చినది. విజయవాడ నగరములో మెట్రో రైల్ లాభాల లోనికి రావడానికి 7సం.ల పైనే సమయము పడుతుంది అని, అందువలన ప్రైవేటు సంస్థలు ఈ ప్రాజెక్టు చేపట్టడానికి ముందుకు రాకపోవచ్చును అని, కావున రాష్ట్ర ప్రభుత్వమే చేపట్టవలసి వుంటుంది అని శ్రీధరన్ లోగడే ప్రకటించి ఉన్నారు. ఈ నేపథ్యములో అమరావతి రాజధాని నగరము లోని మెట్రో రైలు వ్యవస్థ ఎన్ని దశాబ్దముల తరువాత లాభాలబాటను పడుతుందో ఊహించుకోవలసినదే.

అన్నిటికంటే ఆశ్చర్యకర విషయమేమిటంటే ప్రతిపాదిత రాజధాని నగర ప్రాంతములో 2 లేక 3 సం.లకు ఒక పర్యాయము కొండవీటివాగు వేలాది ఎకరముల విస్తీర్ణమును వరదలతో ముంచేసిన వాస్తవాన్ని రాష్ట్ర ప్రభుత్వము సింగపూర్ సంస్థల దృష్టికి కడవరకు తీసుకువెళ్ళకపోవటము శోచనీయము. ఇప్పుడు పెద్ద రిజర్వాయర్‌లను నిర్మించాలని, 10వేల ఎకరాల విస్తీర్ణమును రూ.1500కోట్ల ఖర్చుతో 2 మీటర్ల ఎత్తున బరంతు చేయాలి అని నిర్ణయించటము సిగ్గుచేటు. కేంద్రం నియమించిన శివరామకృష్ణన్ కమిటీ చేసిన హెచ్చరికలను పెడచెవిన పెట్టిన పర్యవసానము ఇది.

ఏడాది పొడవునా పూలతో, కూరగాయలతో, అరటి, నిమ్మ, జామ, మున్నగు పలురకాల పండ్ల తోటలతో వేలాది మంది రైతులు, కౌలు రైతులు, వ్యవసాయ కార్మికులకు మెరుగైన ఆదాయాన్ని, జీవన ఉపాదిని కాలరాశి, పశ్చిక బయళ్ళను, పార్కులను వినోద కేంద్రాలను ఏర్పాటు చేయడము, ఇదే ప్రజా రాజధాని అని, చాటుకోవడము అభ్యంతరకరము. నదీతీరాన ఉన్న జరీబు భూములను తీసుకోవడము తగదని, ఆ ప్రాంతాన్ని ప్రఖ్యాత వ్యవసాయ శాస్త్రవేత్త యమ్.ఎస్. స్వామినాధన్ సూచించినట్లుగా వ్యవసాయ ఎక్స్‌పోర్టు జోన్‌గా ఏర్పాటు చేయడము ద్వారా మెట్ట భూములలో రాజధాని నిర్మాణము సందర్భముగా ఉపాదిని కోల్పోయే వేలాదిమంది కౌలు రైతులు, వ్యవసాయ కార్మికులకు ఈ ఎక్స్‌పోర్టు జోన్‌లో ఉపాధి కల్పించవచ్చు అని రైతు-రైతుకూలీల హక్కుల పరిరక్షణ సంఘముతోపాటు పలు రైతు సంఘాలు, ప్రజా సంఘాలు పలు పర్యాయములు సూచించినా వాటిని ప్రభుత్వము పరిగణలోనికి తీసుకోకపోవడము బాధాకరము.

కృష్ణా నది గర్భములో భవానీ ద్వీపముతోపాటు మరి కొన్ని ద్వీపములలో పర్యాటక రంగాన్ని ప్రోత్సహించేందుకు కొన్ని చర్యలు తీసుకోవలసి ఉంటుంది. అదే సమయములో మన 13 జిల్లాలలో పర్యాటక ప్రదేశములను సందర్శించుచున్న వారి సంఖ్య, రానున్న కాలములో పెరగనున్న సందర్శకుల సంఖ్యను దృష్టిలో ఉంచుకుని పర్యాటక పథకములను అమలు చేయాలి. కృష్ణా నదికి ఉత్తరపు వైపున కృష్ణా జిల్లాలో నదిని ఆనుకొని వున్న 12వేల ఎకరములను పర్యాటక రంగాన్ని అభివృద్ధి చేసేందుకు రైతుల నుండి సేకరించవలెను అనే రాష్ట్ర క్యాబినెట్ నిర్ణయము ఎంతమాత్రము సమంజసము కాదు.

రాష్ట్ర ప్రభుత్వము సింగపూర్ సంస్థలతో కుదుర్చుకొన్న అవగాహనా ఒప్పందమును తానంతట తాను ప్రజలకు బహిర్గతపరచవలసిన బాధ్యత ఉండగా, అలా చేయకపోగా, సమాచార హక్కు చట్టము ద్వారా వచ్చిన అభ్యర్థనలకు సమాధానము ఇవ్వకపోవటము పలు అనుమానాలకు తావు ఇస్తూ వుంది. ఇప్పుడు సింగపూర్ సంస్థలు అందచేసిన మాస్టర్ ప్లాన్‌ను బహిరంగపరచి ప్రజలు, మేధావులు, ఇంజనీర్లు, మున్నగు వర్గాల నుండి సూచనలను సేకరించి దానిపైన తుది నిర్ణయము తీసుకుని ముందుకు అడుగు వేయటము ఉత్తమము. రాజధాని నగర నిర్మాణములో పారదర్శకముగా ప్రభుత్వము వ్యవహరించాల్సివుంది. సాధ్యమైనంత మేరకు తక్కువ వ్యయముతో, తక్కువ విస్తీర్ణముతో, ప్రజలను ఎక్కువమందిని నిర్వాసితులుగా చేయని విధముగా రాజధాని నగర నిర్మాణము చేయవచ్చు అని శివరామకృష్ణన్ కమిటి చేసిన సిఫార్సులను దృష్టిలో పెట్టుకుని ప్రజా రాజదానిని నిర్మాంచాలని ప్రజలు కోరుకుంటున్నారు. వెనుకబడిన రాయలసీమ, ఉత్తరాంధ్ర జిల్లాలలో అమరావతి రాజదాని నగర నిర్మాణము పట్ల అసూయ, భేదభావాలు కలుగని రీతిలో రాష్ట్ర ప్రభుత్వము, కేంద్ర ప్రభుత్వ సహకారముతో రాజదాని నగర నిర్మాణమునకు నడుం బిగించాలి.

రాష్ట్ర విభజన అనంతరం మన రాష్ట్రంపైన పడిన షుమారు లక్షకోట్ల రూపాయల ఋణభారంనకుతోడు రైతు, డ్వాక్రా సంఘాల రుణమాఫీ భారం, 14వ ఫైనాన్స్ కమీషన్ సిఫార్సుల అమలు దరిమిలా కూడా ఎదుర్కోవలసి వున్న గడ్డు ఆర్థిక పరిస్థితిని దృష్టిలో వుంచుకొని వ్యవహరించాలి. ప్రపంచ బ్యాంకు, జపాన్, సింగపూర్ అందచేసే ఆర్థిక సహకారాన్ని అసంపూర్తిగా ఉన్న ఇరిగేషన్ ప్రాజెక్టులను పూర్తిచేయడానికి, వ్యవసాయ, అనుబంధ రంగాల ప్రగతి చిన్న, మధ్య తరహా పరిశ్రమల అభివృద్ధి మున్నగు వాటి కొరకు, సామాన్య ప్రజల దైనందిక జీవితములో అవసరమైన మౌళిక వసతులను, మెరుగైన పాలనను అధునాతన సాంకేతిక పరిజ్ఞానముతో, అందించేందుకు వినియోగించాలే తప్ప మెట్రో రైళ్ళు, అవసరము లేని ఇంటర్‌నేషనల్ ఎయిర్‌పోర్టులు, మున్నగు వాటిపైన వ్యయపర్చటము ఎంతమాత్రము తగదు.

# భూములిచ్చిన రైతులకు, వ్యవసాయానికి న్యాయం చేయాలి

రైతులలో అత్యధిక శాతం మందికి ఇంగ్లీషు భాషరానందున మాస్టర్ ప్లాన్‌లోని విషయాలను అవగాహన చేసుకునే అవకాశం లేదు. కావున ఇప్పటికైనా రాజధాని నగర డ్రాఫ్ట్ మాస్టర్ ప్లాన్‌ను తెలుగులోనికి అనువదించి ప్రతి గ్రామంలోను రైతులకు అందజేయవలసిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది. అభ్యంతరములు, సూచనలను తెలియజేయవలసిన గడువును ప్రస్తుతం ఉన్న నెల రోజులతోపాటు కనీసం మరొక నెల రోజుల పాటు పొడిగించటం ప్రభుత్వం యొక్క కనీస ధర్మం.

**కేంద్ర మార్గదర్శక సూత్రాల ఉల్లంఘన సబబా?**

"ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టం 2014"లో నవ్యాంధ్రకు నూతన రాజధాని ఏర్పాటు చేయు విషయంగా కేంద్ర ప్రభుత్వం సెక్షన్ 6 ను అనుసరించి కేంద్ర హోం కార్యదర్శి శివరామకృష్ణన్ నేతృత్వంలో నిపుణుల కమిటీని నియమించుతూ లెటర్ నెం. 12012/03/2014 SR 28.3.2014న కమిటీకి మార్గదర్శక సూత్రాలను నిర్దేశించటం జరిగింది. దీని ప్రకారం వ్యవసాయ భూములకు పెద్దగా నష్టం చేకూర్చని రీతిలో, తక్కువ మంది ప్రజలు, నివాస ప్రాంతాలకు పునరావాసం కల్పించేలా, పర్యావరణం, నీటి వనరుల సహజ స్థితికి భంగం కలగకుండా, భూసేకరణ కొరకు నిర్మాణం కొరకు తక్కువ వ్యయం అయ్యే విధంగా రాజధాని విషయంలో సిఫార్సులు చేయమని కోరబడింది.

**కొండవీటివాగు ముంపు పొంచి ఉందా?**

రాజధాని ప్రాంతంలో కొండవీటి వాగు వలన సగటున 3 టియంసిల వరద నీరు (కృష్ణాయపాలెం సమీపమునకు చేరుసరికి) ఉంటుందని అంచనాలు ఉన్నాయి. (23 వేల ఎకరాలలో ఒక మీటరు లోతున నీటి పరిమాణమును ఒక టియంసిగా లెక్క). 27, 28 మే, 2015న ప్రముఖ దినపత్రికలలో రాజధాని ప్రాంతంలో 10 వేల ఎకరాల భూమిని రూ. 1500 కోట్ల ఖర్చుతో 2 మీటర్ల ఎత్తున మెరక చేయవలసిన అవసరం

ఉందనే వార్తలు ఉన్నాయి. దాదాపు 2015 మే నెలాఖరు వరకు రాష్ట్ర ప్రభుత్వ పక్షంగా కొండవీటి వాగునకు సంబంధించిన సమగ్ర సమాచారాన్ని సింగపూర్ సంస్థలకు అందజేయకపోవటం ఆశ్చర్యకరం. ఇప్పుడు డ్రాఫ్ట్ మాస్టర్ ప్లాన్‌లో "బ్లూ గ్రీన్" కాన్సెప్ట్‌లో రెండు పెద్ద జలాశయములు, కాలువలు, బోటు విహారములు ఉంటాయని పేర్కొనబడింది. పర్యావరణంలో వస్తున్న పెను మార్పులు, గ్లోబల్ వార్మింగుల వలన అత్యధిక వర్షములు, తీవ్ర దుర్భిక్షములు సంభవించు పరిస్థితులు ఏర్పడతాయని వాతావరణ శాస్త్రవేత్తలు ప్రకటిస్తూ ఉన్నారు. ఇటీవల మద్రాసు నెల్లూరు ప్రాంతములలోని వర్ష బీభత్సం వంటిది కొండవీటి వాగు వలన సంభవిస్తే అపారమైన నష్టం చేకూరే ప్రమాదం ఉంది.

**జరీబు భూముల్లో సాయిల్ బేరింగ్ కెపాసిటి అంచనాలు ఏమిటి?**

కృష్ణానది పొడవునా బోరుపాలెం నుండి ఉండవల్లి వరకు ఒకటి నుండి రెండు కిలోల మీటర్ల వెడల్పున ఉన్న జరీబు భూములలో భూగర్భములో నీటి ప్రవాహములు (పాలియో ఛానెల్స్) గురించి ఇప్పటికీ స్పష్టమైన అవగాహన లేదు. నేషనల్ జియో ఫిజికల్ లేబరేటరీ వారి చేత భూమిలోపల 60 అడుగుల వరకు భూమిలోని పొరల సమాచారాన్ని తెలుసుకోవాలనే ఆలోచన జరిగినట్లుగా పత్రికలలో వచ్చినది కానీ, తదనంతర సమాచారం బహిర్గతం కాలేదు. ఈ జరీబు భూములపైనే చాలా ఎత్తైన బహుళ అంతస్తుల భవనాలు, ఐకానిక్ టవర్ మున్నగు భారీ నిర్మాణములు ప్రతిపాదించబడి ఉన్న అంశాన్ని మరచిపోరాదు.

**వాగ్దానాల భంగం సబబా?**

తొలి నుండి అనేక పర్యాయములు మంత్రులు స్పష్టంగా రాజధాని నగర పరిధిలోని గ్రామాలను ఎట్టి పరిస్థితులలోను తరలించమని, గ్రామాల గుండా రహదారులు ఏర్పాటు చేయబోమని, భూములు ఇచ్చిన రైతులకు వారి వారి గ్రామాల సమీపంలోనే వారి వాటాకు వచ్చు నివాస స్థల ప్లాట్లను, వాణిజ్య ప్లాట్లను ఇచ్చేస్తామని చెప్పి ఉన్నారు. ఇప్పుడు లింగాయపాలెం, తాళ్ళాయపాలెం, ఉద్దండరాయనిపాలెం గ్రామాల రైతులకు వారి గ్రామాల్లో కాకుండా దక్షిణపువైపున ఇస్తామని ప్రకటించటం, ఆరు గ్రామాల నుండి రహదారులు వెళ్ళే పరిస్థితి మాస్టరు ప్లాన్‌లో కనిపించటం తీవ్ర అభ్యంతరకరం. ఎన్నో పర్యాయములు రాష్ట్ర ప్రభుత్వంలోని పెద్దలు, సిఆర్‌డిఏ అధికారులు సింగపూర్‌కు చెందిన సుర్బానా, జురాంగ్ సంస్థలతో చర్చించి ఉన్నారు. క్యాపిటల్ సిటీ మాస్టర్ ప్లాన్ మే 25, 2015న అందించబడగా సీడ్ క్యాపిటల్ మాస్టర్ ప్లాన్ జులై 20,. 2015న అందించబడగా ఇన్ని నెలల తర్వాత కూడా ఆ సంస్థలతో పలు సమావేశములు జరిపినప్పటికీ ఈ విధంగా చేయటం ఎంతమాత్రం తగదు. ఎట్టి పరిస్థితులలోను

భూములు ఇచ్చిన రైతులకు ముందు చేసిన వాగ్దానం ప్రకారం ఆయా గ్రామాల సమీపంలోనే వారి వాటాలకు వచ్చు నివాస, వాణిజ్య ప్లాట్లను కేటాయించాలి.

### భూములిచ్చిన రైతుల పట్ల వివక్షత తగదు

రైతుల వాటాలకు లభించు నివాస/వాణిజ్య ప్లాట్లలో భవన నిర్మాణాల విషయాలలో ఎట్టి వివక్షత చూపరాదు. డెవలప్‌మెంటు ఛార్జీలు, యూజర్ ఛార్జీలు మున్నగు అంశాలపైన రైతులకు ముందుగానే స్పష్టంగా తెలియపరచాలి.

### కార్పొరేట్ సంస్థలకు కారుచౌకగా/99 ఏళ్ళ లీజునకు కట్టబెట్టటం సమర్థనీయమా?

జీవో నెంబరు 110 తేదీ 2 5 2015 ద్వారా రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన కాపిటల్ సిటీ 'డెవలప్‌మెంట్ అండ్ మేనేజ్‌మెంట్ అథారిటీ' రాజధాని నగర పరిధిలోని అభివృద్ధిపరచదగిన స్థలాలను లేక భూములను ప్రైవేటు పార్టీలకు 99 సంవత్సరముల లీజుకు ఇచ్చే దానికి వీలు కల్పించబడింది. లోగడ ప్రభుత్వ భూములు, ఏపిఐఐసి వంటి ప్రభుత్వ రంగ సంస్థల భూములు, కేటాయింపులలో పలు అక్రమాలు, అవినీతి చోటుచేసుకున్నాయని 'కాగ్' పలు రిపోర్టులలో పేర్కొన్న అంశాలను దృష్టిలో ఉంచుకుని కేంద్ర ప్రభుత్వం కొద్దికాలం క్రిందట లీజు కాలం 30 సంవత్సరములకు మించరాదని, లీజు మొత్తాన్ని నిర్ణయించటంలోనూ కొన్ని మార్గదర్శకాలను రూపొందించింది. ప్రభుత్వ భూముల అమ్మకాలలో లేక లీజు మంజూరులలో ఖచ్చితముగా పారదర్శకంగా ఉండాలని, ప్రభుత్వ ఖజానాకు నష్టం చేకూర్చని రీతిలో ఉండాలని సుప్రీంకోర్టు తీర్పులు ఉన్న నేపథ్యంలో మన రాష్ట్ర ప్రభుత్వం రైతుల నుండి భూ సమీకరణ ద్వారా తీసుకున్న భూములను సింగపూర్ లేక జపాన్ లేక ప్రైవేట్ సంస్థలకు 99 సంవత్సరాల లీజు ప్రాతిపదికన కేటాయించాలనుకోవటం ఎంత మాత్రం తగదు. దీనిలో పెద్ద ఎత్తున అవినీతికి ఆస్కారం, అవకాశం ఉండే ప్రమాదం ఉంది.

### పచ్చని పంటపొలాల బదులు పచ్చిక బయళ్ళే ముద్దా?

ఇట్టి నేపథ్యంలో వేలాది మంది రైతుల నుండి భూ సమీకరణ విధానంలో దాదాపు 30 వేల ఎకరములకు పైగా సేకరించి, ఈ భూములలో వేలాది ఎకరాల భూములను సింగపూర్ సంస్థలకు లేక మరో దేశ సంస్థలకో కట్టబెట్టాలను కోవడం ఎంతమాత్రమూ తగదు. దశల వారీగా కేంద్ర ప్రభుత్వం అందజేయు నిధులతో నిర్మాణ ప్రక్రియ కొనసాగాలి. ముందుగా రహదారులకు రూపకల్పన చేసి ఆయా గ్రామాలకు అతి సమీపంలోనే రైతులకు నివాస, వాణిజ్య ప్లాట్‌ల కేటాయింపును పూర్తి చేయాలి. మాస్టర్ ప్లాన్‌లో ప్రకారం రహదారులతో పాటు వివిధ సిటీలలో తలపెట్టిన ముఖ్య భవనములను నిర్మించుటకు తగు చర్యలు ప్రారంభించబడాలి. రైతులకు ల్యాండ్ పూలింగ్

పథకం ప్రకారం ఇవ్వవల్సిన భూమి, ఇప్పుడు ఉన్న గ్రామాల విస్తీర్ణము, నీటి ప్రవాహములు మరియు కృష్ణానదీ భాగ విస్తీర్ణము మొత్తంగా సుమారు 18,535 ఎకరములు పోగా 36 వేల ఎకరముల విస్తీర్ణము మిగులుతుంది. ఇందులో రహదారులు, 9 సిటీల వాస్తవ అవసరాలకు అనుగుణంగా సవరించబడిన విస్తీర్ణమునకు మించి ఇంకనూ వేలాది ఎకరముల భూమి మిగులుతుంది. ఈ భూములను ఖాళీగా ఉంచకుండా భూ సమీకరణకు భూములు ఇచ్చిన రైతులు, కౌలు రైతులలో వ్యవసాయ కార్మికులలో కావాలన్న వారికి వారు ఇచ్చిన భూములకు దామాషా ప్రాతిపదికన భూమిని ఇచ్చి గ్రీన్ హౌస్, పాలీ హౌస్ సౌకర్యములను కల్పించి, సేంద్రియ వ్యవసాయ పద్ధతిలో కూరగాయలు, అరటి తోటలు, పూలు సాగునకు అవకాశం కల్పించడం సముచితం. ఇందుకు వారి నుండి కొంత లీజు రూపంలో ప్రభుత్వం రుసుము వసూలు చేయవచ్చు. ప్రభుత్వం భవన నిర్మాణ కార్యక్రమం ప్రారంభించే వరకు ఈ భూములలో పంటలు సాగు చేసుకునేందుకు అనుమతించడం వలన వేలాది మందికి, వారికి ముందు నుండి అనుభవం ఉన్న వ్యవసాయ కార్యక్రమములో కొనసాగే వీలు కలుగుతుంది. వ్యవసాయ కార్మికులకు కూడా ఉపాధి దొరుకుతుంది. రాజధాని నగరంలోని ప్రజల అవసరాలే కాక సమీప పట్టణాలకు కూడా పూలు, పండ్లు, కూరగాయలు దొరికే వీలు కలుగుతుంది. కాపిటల్ సిటీ మాస్టర్ ప్లాన్‌లో 11 వేల 688 ఎకరాల భూములను "ప్రైమరీ గ్రీన్" పచ్చనిబయలుగా ఉంచాలని, ఆలోచన చేస్తూ ఉండటం ఎంతమాత్రం తగదు. లోగడ ఉండవల్లి గ్రామంలో కేవలం 73 ఎకరాల భూమిని విజిటి ఉడా పర్యాటకం కొరకు ప్రతిపాదించినపుడు ఆనాడు ప్రతిపక్ష నేతగా వ్యతిరేకించిన వారే, ఈనాడు ముఖ్యమంత్రిగా ఉన్నారు కావున ఏడాది పొడవునా 3 పంటలు పండుతూ ఉండే అత్యంత సారవంతమైన జరీబు భూములను పచ్చిక బయలుగా ఉంచేలా కాకుండా ఆ భూముల్లో సేంద్రియ వ్యవసాయ సాగును ప్రోత్సహించటం ప్రభుత్వం కనీస కర్తవ్యం.

* * *

# గోరంత పెట్టుబడితో సింగపూర్ కన్సార్షియంనకు కొండంత లబ్ధి

ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యంతో (పి.పి.పి ప్రాజెక్టులు) చేపట్టబడే ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ప్రాజెక్టుల విషయంలో పారదర్శకతతో, అవినీతికి ఆస్కారం లేకుండా ఉండేందుకు లోగడ చంద్రబాబు నాయుడు గారు ముఖ్యమంత్రిగా ఉండగా ఎ.పి. ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ ఎనేబిలింగ్ యాక్టు (ఎ.పి.ఐ.డి.ఇ.ఎ.యాక్టు) 2001ను అమలులోకి తెచ్చారు. ప్రభుత్వ భూమి, పన్ను రాయితీలు కల్పించే ప్రాజెక్టులను కేటగిరి–II ప్రాజెక్టులుగా వర్గీకరించారు. ఈ ప్రాజెక్టులో రాష్ట్రప్రభుత్వానికి/ప్రభుత్వ సంస్థకు 51%నకు తగ్గకుండా వాటా ఉండవలసి వుంటుంది. కానీ ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సింగపూర్ కన్సార్షియంతో కుదిరిన ఒప్పందం ప్రకారం రాష్ట్రప్రభుత్వానికి / ప్రభుత్వ సంస్థకు రూ.221 కోట్ల పెట్టుబడులతో 42శాతం వాటా మాత్రము ఉన్నది. రూ.306 కోట్ల పెట్టుబడితో సింగపూర్ కన్సార్షియంనకు 58శాతం వాటా వుంది. రాష్ట్రప్రభుత్వ సంస్థ క్యాపిటల్ సిటీ డెవలప్‌మెంట్ మేనేజ్‌మెంట్ కమిటీ (సి.సి.డి.యం.సి) / అమరావతి డెవలప్‌మెంట్ కంపెనీ (ఎ.డి.సి)తో సింగపూర్ కన్సార్షియం (సెమ్‌కార్ప్ – ఎస్సెండాస్, సింగ్ బ్రిడ్జి) సంయుక్త భాగస్వామ్యంతో ఏర్పాటు చేయు అమరావతి డెవలప్‌మెంట్ పార్ట్‌నర్స్ (ఎ.డి.పి)కు సింగపూర్ సంస్థ ప్రతినిధి చైర్మన్‌గా ఉండటమేకాక సింగపూర్ కన్సార్షియం (ఎస్.సి) ప్రతినిధులు నలుగురు డైరెక్టర్లుగా వుండగా, రాష్ట్రప్రభుత్వ సంస్థ తరపున ఇద్దరే డైరెక్టర్లుగా వుంటారు. సింగపూర్ ప్రతినిధి అయిన చైర్మన్ బోర్డు మీటింగునకు హాజరు కాలేకపోతే సింగపూర్ డైరెక్టర్లు నుండి ఒకరిని చైర్మన్‌గా ఎన్నుకొని మీటింగు నిర్వహించాల్సి వుంటుంది. దాదాపు రూ.6,500కోట్ల విలువ చేసే 1691 ఎకరముల భూములను అందచేయటమే కాక మౌలిక వసతులు కల్పించడం కొరకు రాష్ట్రప్రభుత్వం రూ.5560 కోట్లు ఖర్చు చేయవలసిన బాధ్యత వుంది. కావున సింగపూర్ కన్సార్షియంనకు 58% వాటా యివ్వటం ఆర్థికపరంగా చూసినా, చట్టప్రకారం చూసినా ఎంతమాత్రమూ సరికాదు.

### 50 ఎకరముల భూమిని ఉచితంగా ఎందుకు యివ్వాలి?

ఎ.పి. సి.ఆర్.డి.ఎ. మొదటి దశలో ఎ.డి.పి.కి 656 ఎకరముల భూమిని అందచేయవలసి వుంటుంది. రాష్ట్రప్రభుత్వం ఆమోదించిన సింగపూర్ కన్సార్షియం ప్రతిపాదించిన కన్సెషనీర్ అగ్రిమెంట్ డెవలప్ అగ్రిమెంట్ (సి.ఎ.డి.ఎ) క్లాజ్ 2.1 (రిరిరి) ప్రకారం మొదటి దశలో కేటాలిటిక్ డెవలప్‌మెంట్ కొరకు రాష్ట్రప్రభుత్వం 50 ఎకరముల భూమిని లింగాయపాలెం గ్రామ సమీపంలో ఫ్రీ హోల్డు పద్ధతిలో నామమాత్రమైన ధరకు (దాదాపు ఉచితంగా) అందచేయవలసి వుంటుంది. ఈ భూమిలో 3 సం.ల లోపు అత్యంత సుందరమైన (స్టేట్ ఆఫ్ ది ఆర్ట్) భవన సముదాయమును నిర్మించి 8లక్షల చదరపు అడుగుల గ్రాస్‌ఫ్లోర్ ఏరియా నివాస మరియు కమర్షియల్ (మిక్స్‌డ్) స్పేస్‌ను కల్పించవలసి వుంటుంది. రాజధాని మొత్తం సుమారు 53 వేల ఎకరముల విస్తీర్ణములో అత్యంత ప్రాముఖ్యత మరియు విలువ ఈ నిర్మాణాలకు నది ఒడ్డునే ఉండుట వలన వుంటుంది. చదరపు అడుగునకు సగటున రూ.7,000/- చొప్పున విక్రయించినప్పుడు నిర్మాణ వ్యయం చదరపు అడుగునకు రూ.2,000/- చొప్పున పోగా నికరంగా చదరపు అడుగునకు దాదాపు రూ.5,000/- లాభం మిగులుతుంది. అంటే సుమారు రూ.400 కోట్లలో రూ.232 కోట్లు సింగపూర్ కన్సార్టియంనకు వెళితే రాష్ట్ర ప్రభుత్వానికి 168 కోట్లు మాత్రమే వస్తాయి.

### డౌన్ టౌన్ రోడ్డు వెంట 200 ఎకరములకు రెవిన్యూ షేర్ వచ్చేది 20 సం.ల తరువాతే!

కన్‌సెషన్ డవలప్‌మెంట్ అగ్రిమెంట్ క్లాజ్ 2.3 (రి) ప్రకారం విజయవాడ - చెన్నై జాతీయ రహదారి నుండి రాజధానిలోకి వచ్చు సీడ్ యాక్సిస్ రోడ్డు (డౌన్ టౌన్ రోడ్డు) వెంట 200 ఎకరముల భూములను ఎకరాకు రూ.4కోట్లు బేసిక్ ధర ప్రకారం కాని లేక భూమిని యిచ్చినందుకు గానూ ప్రభుత్వం/సి.ఆర్.డి.ఎ.నకు గ్రాస్ రెవిన్యూలో మొదటి దశలో 5%, రెండవ దశలో 7.5%, 3వ దశలో 12% చొప్పున షేర్ యివ్వాలని నిర్ణయించాలన్న ప్రతిపాదనను రాష్ట్రప్రభుత్వం ఆమోదించింది! భూమి అభివృద్ధి, మౌలిక వసతుల కల్పన, నిర్మాణముల కొరకు ప్రభుత్వం యిచ్చిన భూములను హామీగా వుంచి, బ్యాంకులు/ఆర్థిక సంస్థల నుండి తీసుకున్న ఋణం, ప్లాట్లు లేక ప్లాట్ల అమ్మకాల ద్వారా వచ్చిన ధనంతో 3 దశల అభివృద్ధిని 15 సంవత్సరములలో, గరిష్టంగా 20 సంవత్సరముల వ్యవధిలో పూర్తిచేయవలెనని ప్రతిపాదించ బడింది.

క్లాజ్ 2.1 (రిరిరి) మరియు 2.3 (రి) భూములను మినహాయించి మిగిలిన భూములను మాత్రమే బ్యాంకులకు హామీగా వుంచుటకు, అభివృద్ధి చేయుటకు, అమ్మక ధరల నిర్ణయంనకు, ప్లాట్లు / ఫ్లాట్లు అమ్ముటకు వీలు కల్పించబడింది. అలాగే 1.1,

5 (ii)లలో కూడా యిలాగే 2.1లో (iii) 2.3లో (ii) భూములు మినహాయించబడటం చూస్తే యీ 250 ఎకరాలలో భూముల అభివృద్ధిని ఎవరు/ఏ సంస్థ ఏవిధంగా, ఎక్కడి నిధులతో అభివృద్ధి చేయనున్నదో స్పష్టంగా తెలియరావటం లేదు. అంతేకాక ఈ 200 ఎకరముల భూములకు సంబంధించి ప్రభుత్వము/ప్రభుత్వ సంస్థలకు చెల్లించవలసిన గ్రాస్ రెవిన్యూ షేర్ మొత్తాన్ని ప్రాజెక్టు పూర్తి అయిన దరిమిలా మాత్రమే చెల్లించే వెసులుబాటు ఎ.డి.పి. తద్వారా సింగపూర్ కన్సార్షియంకు వుంటుంది. అంటే దాదాపు 200 కోట్ల విలువ చేసే మొదటి 50 ఎకరముల భూమిని దాదాపు ఉచితంగా పొందటమేకాక, దాదాపు 1,000 కోట్లపైన విలువ చేసే 200 ఎకరముల భూమికిగాను అమ్మకాలపై సగటున 8.5 గ్రాస్ రెవిన్యూ వాటాతో అది కూడా 20 సం.ల తర్వాత చెల్లించే వెసులుబాటును ఎ.డి.పి.కి కల్పించేందుకు రాష్ట్రప్రభుత్వం అంగీకరించటం ఏ కోణంలో చూసినా సరికాదు.

**సింగపూర్ కన్సార్షియంనకు వేలాదికోట్ల రూపాయల లబ్ధి:**

సింగపూర్ కన్సార్షియం అంచనా ప్రకారం రాజధాని స్టార్టప్ ఏరియా (1691 ఎ.లు) మొత్తం మూడు దశలలోను కలిపి నివాసముల కొరకు 78.82 మిలియన్ చ॥అ॥, ఐ.టి., ఐ.టి.ఇ.ఎస్. మరియు ఐ.టి.యేతర ఆఫీసుల కొరకు 21.67 మిలియన్ చ॥అ॥, రెసిడెన్షియల్/రిటైల్/కమర్షియల్ మిక్స్‌డ్ వాడకం కొరకు 10.20 మి॥చ॥అ॥ కావల్సి ఉంటుందని భావించబడింది. అంటే మొత్తంగా 110.69 మిలియన్ చ.అ.లు, అనగా 11.069 కోట్ల చ.అ.ల గ్రాస్ ఫ్లోర్ ఏరియాకు డిమాండ్ ఉంటుందని సింగపూర్ సంస్థ అంచనా కట్టింది. సగటున చ॥అ॥ 6వేల రూపాయల చొప్పున అమ్మితే, అందులో నుండి నిర్మాణ వ్యయం చ॥అ॥నకు 2వేల రూపాయల చొప్పున తీసివేయగా చ॥అ॥నకు రూ. 4వేల రూపాయలు లాభం మిగులుతుంది. ఈ అంచనాలు వాస్తవ రూపం దాలిస్తే దాదాపు రూ. 44వేల కోట్ల లాభం వచ్చే అవకాశం వుంటుంది. యిందులో సింగపూర్ కన్సార్షియంనకు రూ. 25,520 కోట్లు వాటాగా పోతే ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ సంస్థకు రూ. 18,480 కోట్లు వస్తుంది. ఈ విధంగా సింగపూర్ కన్సార్షియంనకు స్విస్ చాలెంజ్ విధానంలో రూ. 306 కోట్ల పెట్టుబడితో అంతిమంగా రూ. 25,520 కోట్లు (మేనేజ్‌మెంట్ కంపెనీకు యివ్వవలసిన వందలాది కోట్ల రూపాయల ఫీజులు దీనికి అదనం) చెందుతుంది. రూ. 221 కోట్ల పెట్టుబడి, దాదాపు 7,000 కోట్ల రూపాయలు విలువ చేసే భూమిని భూమివిలువ తీసుకోకుండానే యిస్తూ ఉండటమేకాక మౌలిక వసతులపైన రూ. 5,560 కోట్లు ఖర్చుపెట్టే రాష్ట్రప్రభుత్వానికి రూ. 18,480 కోట్లు మాత్రమే వచ్చే అసంబద్ధ ప్రతిపాదనకు రాష్ట్రప్రభుత్వం తల ఊపి యిటీవలే సింగపూర్ కన్సార్షియంతో అవగాహనా ఒప్పందాన్ని కుదుర్చుకొనటం రాష్ట్ర ప్రయోజనాలను సింగపూర్ సంస్థకు తాకట్టుపెట్టడం అవుతుందని అనడంలో ఎంతమాత్రమూ సందేహం లేదు.

### ఎ.డి.పి. ఉండగా మేనేజ్‌మెంట్ కంపెనీ ఎందుకు?

భూమిని అభివృద్ధి చేసి, ప్లాట్లు వేసి, భవన నిర్మాణములు కావించి, ధరలు నిర్ణయించి, అమ్మే అధికారం మరియు బాధ్యత ఎ.డి.పి.కి వుండగా వందశాతం సింగపూర్ మేనేజ్‌మెంట్ కంపెనీకి ఎ) ప్రాజెక్టు విలువలో 5.5% ఫీజుగా బి) ప్లాట్లు/ఫ్లాట్లు అమ్మకాలపై 2% ఫీజుగా సి) ప్రోపర్టీ మేనేజ్‌మెంట్ సర్వీసు రూపంలో గ్రాస్ రెవిన్యూలో 2% ఫీజుగా వందలు/వేల కోట్ల రూపాయలను చెల్లించాలనడం ఎంతమాత్రమూ సరికాదు.

### మల్టీ నేషనల్ కంపెనీలతో లింకు ఎందుకు?

క్రిందటి పర్యాయం జస్టిస్ యమ్.యస్. రామచంద్రరావు గారు ఉమ్మడి హైకోర్టులో స్విస్ చాలెంజ్ పైన విచారణ సందర్భముగా టెండర్ నిబంధనలు టెక్నికల్ ఎలిజిబిలిటీకి సంబంధించి పేర్కొన్న నిబంధనలు భారతీయ సంస్థలు పాల్గొనటానికి ఆటంకంగా ఉన్నాయని న్యాయమూర్తిగారు అభిప్రాయ పడ్డారు. విదేశాలలో వెంచర్లు వేయటం, భవన నిర్మాణములు చేసి వుండటం అర్హతలుగా పేర్కొనడం సరికాదని న్యాయమూర్తి గారు అభిప్రాయాన్ని వ్యక్తం చేసినందున యిప్పుడు 2వ పర్యాయం పిలిచిన బిడ్లలో టెక్నికల్ ఎలిజిబిలిటీలో భారతదేశం వెలుపల (ఔట్ సైడ్ ఇండియా) స్థానంలో ఎక్కడైనా (ఎనీవేర్) అని మార్పుచేయటం జరిగింది. కాని టెక్నికల్ ఎలిజిబిలిటీ క్రైటేరియాలో తిరిగి 375 ఎకరముల విస్తీర్ణంలో అభివృద్ధి చేసిన ప్లాట్లను (వెంచర్) మల్టీ నేషనల్ కంపెనీలకు అమ్మి ఉండాలని మరియు 40 లక్షల చ॥అ.ల భవన నిర్మాణ ఏరియా (బిల్ట్అప్ ఏరియా)ను మల్టీ నేషనల్ కంపెనీలకు సంబంధించిన సంస్థలకు అమ్మి వుండాలి అను నిబంధనలు ఉండుటవలన ఎల్ & టి కాని, షాపూజీ పల్లోంజి కాని, టాటా హౌసింగ్ డెవలప్‌మెంట్ కంపెనీకాని, గోద్రెజ్ హౌసింగ్ కంపెనీ లాంటి మనదేశంలో రియల్ ఎస్టేట్ రంగంలో ప్రఖ్యాతిగాంచిన సంస్థలు పాల్గొనుటకు వీలులేకుండా పోవటం దురదృష్టకరం. మల్టీ నేషనల్ కంపెనీ అంటే భారతదేశం వెలుపల గ్లోబల్ హెడ్ క్వార్టర్స్ ఉండాలని, ఒకదేశంలో కన్నా, ఎక్కువ దేశాలలో ఆ కంపెనీ పనిచేస్తూ ఉండాలనే నిబంధన మున్నగునవి సింగపూర్ కన్సార్షియంనకు టెండర్ దక్కేదానికొరకే యిలాంటి నిబంధనలు పొందుపర్చటం జరిగిందని ప్రజలు భావించటానికి ఆస్కారం వుంది.

### అత్యంత వ్యయప్రయాసలతో కూడిన లండన్ కోర్టు వద్దకు ఎందుకు వెళ్ళాలి?

లోగడ చంద్రబాబు నాయుడుగారు ముఖ్యమంత్రిగా వుండగా రూపు దిద్దుకొన్న పటిష్ఠమైన, ఆదర్శప్రాయమైన ఎ.పి. ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఎనేబిలింగ్ యాక్టునకు పలుమార్పులను చేస్తూ, ఆ చట్టాన్ని యిటీవల రాష్ట్రప్రభుత్వం నిర్వీర్యం కావించింది.

పి.పి.పి. ప్రాజెక్టుల అమలులో భాగస్వాముల మధ్య విభేదములు ఏర్పడినప్పుడు పరిష్కారం కొరకు అనుసరించవలసిన ప్రక్రియ చట్టంలో స్పష్టంగా చాప్టర్ 4, సెక్షన్ 30 నుండి 53 వరకు వివరంగా పేర్కొనబడింది. ఈ సూత్రాలు ఈ అగ్రిమెంటుకు వర్తించకూడదని సింగపూర్ కన్సార్షియం చేసిన ప్రతిపాదనను మన రాష్ట్ర ప్రభుత్వం అంగీకరించడం సరికాదని, ఎంతో దూరాన, ఎంతో వ్యయంతో కూడుకొన్న లండన్ కోర్టునకు మన రాష్ట్రప్రభుత్వం వెళ్ళవలసి రావటం అన్యాయమని జస్టిస్ రామచంద్రరావు గారు అభిప్రాయపడ్డారు. అందుకనుగుణంగా సింగపూర్ సంస్థ చేత మార్పు చేయించ వలసినదిపోయి, ఆ సెక్షన్‌లను యిటీవల సవరించిన చట్టంలో పూర్తిగా తొలగించటం నీతిబాహ్యమైన చర్య. కేవలం సింగపూర్ సంస్థకు లాభం చూకూర్చటం కొరకు రాష్ట్రప్రభుత్వం దీర్ఘకాలిక ప్రయోజనాలున్న, ఎంతో పరిపాలన అనుభవం కలిగిన అధికారులు, న్యాయ నిపుణులతో చర్చించబడి, రూపొందించబడిన ఒక మంచి చట్టాన్ని కోరలు లేని జీవచ్ఛవంగా తయారు చేయటం కడు దురదృష్టకరం.

**మామూలు పద్ధతిలో టెండర్లు పిలిచి వెంటనే ప్రభుత్వ భవనాల నిర్మాణం ప్రారంభించాలి:**

యిప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం పలు లోపాలతో, సందేహాలకు ఆస్కారం కల్గిస్తూ వున్న స్విస్ చాలెంజ్ పద్ధతిలో కాకుండా సుప్రీంకోర్టు తీర్పులను గమనంలో వుంచుకొని మామూలు పద్ధతిలో టెండర్ ప్రక్రియ ద్వారా దేశవిదేశాలలోని ప్రముఖ నిర్మాణ రంగ సంస్థలు పాల్గొని త్వరత్వరగా రాష్ట్రప్రభుత్వ పరిపాలన విభాగములలోని భవనములను, ప్రజాప్రతినిధులు, ఉద్యోగుల వసతి గృహాలను నిర్మాణం చేయించుటకు తగు చర్యలను వెంటనే చేపట్టడం అవసరం. భవన నిర్మాణ కార్మికులతో సహా పేదలు, సామాన్యులు నివసించేందుకు కూడా భవనముల నిర్మాణం ప్రారంభం కావలసి వుంది. తాత్కాలిక సెక్రటేరియట్ భవనాన్ని 6 నెలల్లో పూర్తి గావించాలని తాపత్రయ పడిన ముఖ్యమంత్రి గారు స్టార్టప్ ఏరియా అభివృద్ధికి 20 సం.ల వ్యవధిని సింగపూర్ కన్సార్షియంనకు అనుమతించడం ఎంతమాత్రమూ సరికాదు. రాజధాని నగర మాస్టర్ ప్లాన్, సీడ్ క్యాపిటల్ మాస్టర్ ప్లాన్‌లు రాష్ట్రప్రభుత్వానికి అంది 2 సం.ల పైన దాటిపోతున్నాయి. మాస్టర్‌ప్లాన్‌లో సూచించిన చోటే శాశ్వత సెక్రటేరియట్ మరియు అసెంబ్లీ భవనములు నిర్మించేందుకు వీలున్నప్పటికీ తాత్కాలిక సెక్రటేరియట్, అసెంబ్లీ భవనములు కట్టి దాదాపు 800 కోట్ల రూపాయలు వృధాగా ఖర్చు చేశారు. కేంద్రప్రభుత్వం రాజధాని భవనముల కొరకు యిస్తానన్న రూ.2,500 కోట్లలో యిక రూ.1700 కోట్లు మాత్రమే మిగిలి ఉన్నాయి. యికనైనా కాలయాపనన లేకుండా రాజధాని నగరంలో ప్రజలకు అత్యంత ఆవశ్యకమైన భవన నిర్మాణ ప్రక్రియను ప్రారంభించాలని ప్రజలు కోరుకుంటున్నారు.

* * *

# నిర్వీర్యమైన ఎ.పి. ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ అథారిటి

లోగడ చంద్రబాబు నాయుడు గారు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రిగా వుండగా భౌతిక మరియు సామాజిక, మౌలిక సదుపాయాలను వీలైనంత త్వరగా అభివృద్ధి చేయించటానికి ఆ ప్రక్రియలో ప్రైవేటు రంగాన్ని ప్రోత్సహించాల్సిన అవసరాన్ని దృష్టిలో ఉంచుకొని "ఆంధ్రప్రదేశ్ మౌలిక సదుపాయాల అభివృద్ధికి వీలుకల్పించు చట్టము 2001" చేయబడింది.

ఈ ఆంధ్రప్రదేశ్ మౌలిక సదుపాయాల అభివృద్ధికి వీలుకల్పించే చట్టము 2001 ద్వారా అవినీతికి ఆస్కారం లేకుండా పారదర్శకతతో ప్రభుత్వ, ప్రైవేట్ భాగస్వామ్యంతో మౌలిక సదుపాయముల అభివృద్ధి ప్రాజెక్టులను అమలు చేసేందుకు ఎ.పి. ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ అథారిటీ ఏర్పాటు చేయుటకు, అది సమర్ధవంతంగా పనిచేయుటకు అవసరమైన విధివిధానాలను రూపొందించటమేకాక చట్టం లోని నిబంధనల అమలు కొరకు అనుసరించవలసిన క్రమపద్ధతులు స్పష్టంగా పేర్కొనబడ్డాయి. రాష్ట్రప్రభుత్వ ప్రధాన కార్యదర్శి లేక అంతటి సుదీర్ఘ అనుభవం వున్న అధికారి ఈ అథారిటీకి చైర్మన్‌గా ఉంటారు. ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ & ఇన్‌వెస్ట్‌మెంట్ డిపార్ట్‌మెంట్ ప్రిన్సిపల్ సెక్రటరి వైస్ చైర్మన్‌గా ఉంటారు. ఫైనాన్స్ & ప్లానింగ్, ఆర్.&.బి., మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్, ఐ.టి. డిపార్ట్‌మెంట్ల కార్యదర్శులు, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పోరేషన్ యం.డి. సభ్యులుగా ఉంటారు. అవసరమైన సందర్భములలో ఆయా రంగాలలో నిపుణులతో కమిటీలను ఏర్పాటు చేస్తుంది. ప్రాజెక్టు ప్రతిపాదనలను స్వీకరించి, పరిశీలించి ప్రభుత్వానికి సిఫార్సులను, సూచనలను అందిస్తుంది. కేటగిరి-2 ప్రాజెక్టుల పోటీ బిడ్డింగ్‌లను నిర్వహించుతుంది. ప్రాజెక్టు అమలుకు అవసరమైన నిధులు, ఎదురయ్యే యిబ్బందులు మున్నగు కీలక అంశాలన్నింటినీ క్షుణ్ణంగా పరిశీలించే విధులను నిర్వర్తిస్తుంది. ప్రాజెక్టులకు అనుమతి యివ్వడానికి స్థానిక సంస్థలకు/ప్రభుత్వ ఏజన్సీలకు ప్రాజెక్టు అమలు సందర్భంగా డైరక్షన్స్, ప్రాజెక్టు అమలయ్యేట్లు పరిశీలించి, మానిటరింగ్ చేసే అధికారం కూడా అథారిటీకి ఉంటుంది.

అంతేకాక ఏదైనా సంస్థ అంతకు ముందు ప్రతిపాదన/ఆలోచన లేని సమయంలో తనంతటతానుగా ఒక నూతన ప్రతిపాదనను ప్రభుత్వ ఏజన్సీ/స్థానిక సంస్థకు సమర్పించేందుకు వీలు కల్పించే "స్విస్ చాలెంజ్ పద్ధతి" క్రింద అవకాశములు కల్పించింది. అంతకన్నా మెరుగైన పోటీ ప్రతిపాదనను ఇచ్చేందుకు అవకాశమును కల్పించేందుకు కార్యాచరణ వివరముగా చట్టంలో పొందుపర్చబడింది. ఏదైనా సందర్భంలో ప్రభుత్వ ఏజన్సీ/స్థానిక సంస్థకు మరియు అభివృద్ధిదారునకు భేదాభిప్రాయం ఏర్పడినప్పుడు పరిష్కరించుటకు మధ్యవర్తిత్వ బోర్డు ఏర్పాటుకు, మధ్యవర్తిత్వమునకు సంబంధించి అనుసరించవలసిన పద్ధతులు చట్టంలో స్పష్టంగా పేర్కొనబడ్డాయి.

జి.ఒ.యం.ఎస్.నెం.3, తేది 28-05-2015 ద్వారా స్విస్‌చాలెంజ్ పద్ధతిలో చేపట్టే ప్రాజెక్టుల జాబితాకు చట్టంలోని సెక్షన్ 2 (ss) 1) టెలికమ్యూనికేషన్ మరియు బ్రాడ్‌బాండ్ ఇంటర్నెట్ సర్వీసులు, వై ఫై సర్వీసులు మున్నగునవి (2) పవర్ జనరేషన్; ట్రాన్స్‌మిషన్, డిస్ట్రిబ్యూషన్, సోలార్ మరియు విండ్ ఎనర్జీ ప్రాజెక్టులు (3) హైవే ప్రాజెక్టులు (4) నౌకాశ్రయములు (5) విమానాశ్రయములు (6) స్మార్ట్ సిటి ప్రాజెక్టులతో సహా పట్టణ ప్రాంత అభివృద్ధి ప్రాజెక్టులు (7) విద్యా సంస్థలు మున్నగు వాటిని చేర్చటం జరిగినది.

రాష్ట్ర విభజన అనంతరం నూతన రాజధాని అమరావతి నగర నిర్మాణం కొరకు రాష్ట్రప్రభుత్వం కొన్ని చర్యలను చేపట్టింది. అందులో భాగంగా 1691 ఎకరాలలో కృష్ణా నదికి అభిముఖంగా లింగాయపాలెం, ఉద్దండరాయునిపాలెం, తాళ్ళాయపాలెం గ్రామాల సమీపంలో "స్టార్టప్ ఏరియా"గా అభివృద్ధి చేయుటకు సింగపూర్‌కు చెందిన "ఎస్సెండాస్, సెంబ్‌కార్ప్" సంస్థను మాస్టర్ డెవలపర్‌గా రాష్ట్రప్రభుత్వం నిర్ణయించి ప్రతిపాదనను కోరగా ఆ సంస్థ ది 30-10-2015న రాష్ట్ర ప్రభుత్వానికి తన ప్రతిపాదనను అందచేసింది. వారి ప్రతిపాదనలో కొన్ని అంశములపట్ల ప్రజానీకంలో విమర్శ వచ్చినందున పునఃపరిశీలించమని రాష్ట్రప్రభుత్వం కోరగా సవరించిన ప్రతిపాదనను ది 21-03-2016న ప్రభుత్వానికి సమర్పించినది. రాష్ట్రప్రభుత్వం ఈ ప్రతిపాదనను పరిశీలించుటకు ది 6-5-2016న ఒక హైపవర్ కమిటీని నియమించగా ఆ కమిటీ ది 10-6-2016న ప్రభుత్వానికి నివేదిక ఇచ్చింది. అక్కడ నుండి ఆ ప్రతిపాదన సి.ఆర్.డి.ఎ. కమీషనర్‌కు, అక్కడనుండి కాపిటల్ సిటీ డెవలప్‌మెంటు మేనేజ్‌మెంట్ కంపెనీ లిమిటెడ్‌కు, అక్కడనుండి ఎ.పి. ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ అథారిటీకి వెళ్ళింది. ది 22-06-2016న జరిగిన మీటింగ్‌లో పరిశీలించి, ఆమోదించి సింగపూర్ ప్రతిపాదనకు కౌంటర్ చాలెంజ్ ప్రతిపాదనలను ఆహ్వానించటానికి ఇన్‌ఫ్రాస్టక్చర్ అథారిటీ సి.ఆర్.డి.ఎ. కమీషనర్‌కు అనుమతిని ఇచ్చింది. సింగపూర్ సంస్థ యొక్క సవరణ

ప్రతిపాదనను ది 04-07-2016న జి.ఓ.యం.ఎస్.నెం.170 ద్వారా రాష్ట్రప్రభుత్వం ఆమోదించింది. క్యాపిటల్ సిటీ డెవలప్‌మెంట్ మేనేజ్‌మెంట్ కంపెనీ లిమిటెడ్ మరియు స్విస్‌చాలెంజ్ పద్ధతి ద్వారా ఎంపిక కాబడిన సంస్థల భాగస్వామ్యంతో "అమరావతి డెవలప్‌మెంట్ పార్టనర్" జాయింట్ వెంచర్ సంస్థ ఏర్పాటై, ఆ సంస్థ ఆధ్వర్యంలో ఎ.పి.ఐ.డి.ఇ. చట్టం-2001ని అనుసరించి ఈ ప్రాజెక్టు అభివృద్ధి - నిర్వహణ చేపట్టబడుతుందని తెలియపర్చబడింది. ఈ ప్రతిపాదనకన్నా మెరుగైన ప్రతిపాదనలను సమర్పించేందుకు అవకాశం కల్పిస్తూ ది 17-7-2016న సి.ఆర్.డి.ఎ. కమీషనర్ పత్రికా ప్రకటన యిచ్చారు. 08-08-2016న జరిగిన ప్రీ బిడ్ మీటింగ్‌లో ఆదిత్య హౌసింగ్ కన్‌స్ట్రక్షన్ ప్రైవేట్, హైదరాబాద్ వారు కొన్ని ప్రశ్నలను, సందేహాలను లేవనెత్తగా సమాచారం లభించలేదు. దానిపైన ఆ సంస్థ ది 19-08-2016న ఆంధ్రప్రదేశ్ హైకోర్టులో పిటీషన్ దాఖలు చేసింది. ది 18-08-2016 రాత్రి ప్రొద్దుపోయిన తర్వాత సదరు సందేహాలకు/ప్రశ్నలకు వివరణలను సి.ఆర్.డి.ఎ. యిచ్చింది. ఎన్.వి.ఎన్. ఇంజనీర్స్ ప్రైవేట్ లిమిటెడ్, చెన్నై అను సంస్థ కూడా సి.ఆర్.డి.ఎ. స్విస్ చాలెంజ్ విధానంలో చేపట్టిన ఈ ప్రాజెక్టు ఎ.పి.ఐ.డి.ఇ. చట్టం-2001 లోని అంశములకు భిన్నంగా ఉందని, పారదర్శకత లోపించినదని, టెండర్ నిబంధనలు విదేశీ సంస్థలకు అనుకూలంగానూ, దేశీయ సంస్థలు పోటీలో పాల్గొనుటకు అనర్హత కల్పించేవిధంగానూ ఉన్నాయని మున్నగు అంశాలతో వ్యాజ్యం దాఖలు చేశారు. జస్టిస్ యం.ఎస్. రామచంద్రరావు గారు పిటీషనర్ల వాదనలలోని అంశాలను మరియు ప్రభుత్వ అడ్వకేట్ జనరల్ యొక్క వాదనలను విన్నదానిపైన పిటీషనర్స్ లేవనెత్తిన అంశములలో బలమున్నదని భావించుతూ "స్టే ఆర్డర్" ఇవ్వటం జరిగినది.

**ముందు బండి - వెనుక గుర్రం:**

ప్రధానంగా పోటీ ప్రతిపాదనలను ఆహ్వానించిన "R.F.PÑÑ (Request for Proposals) ప్రకటన మరియు 28-8-2016 నాటి "ఎడ్డెండమ్ - క్లారిఫికేషన్స్" రెండు కూడా ఎ.పి.ఐ.డి.ఇ. చట్టం 2001నకు విరుద్ధంగా ఉన్నాయని, చట్టంలో పొందుపర్చినట్లుగా ముందుగా ప్రతిపాదన ప్రభుత్వ ఏజన్సీ/స్థానిక సంస్థ వద్ద సమర్పించబడి, అక్కడ పరిశీలన దరిమిలా ఎ.పి. ఇన్‌ఫ్రాస్ట్రక్షర్ అథారిటీకి, అక్కడ నుండి ప్రభుత్వానికి వెళ్ళవలసి ఉండగా ఇక్కడ సదరు వ్యవహారం రివర్స్ డైరెక్షన్‌లో జరిగిందని అందువలన ఆ ప్రక్రియ చట్ట విరుద్ధంగా వుందని న్యాయమూర్తి అభిప్రాయ పడ్డారు.

**బిజినెస్ ప్లాన్ - రెవెన్యూ వాటా రహస్యంగా ఉంచుట సరికాదు:**

ఎ.పి.ఐ.డి.ఇ. చట్టం-2001 ప్రకారం 'స్విస్ చాలెంజ్" పద్ధతిలో మొదటి ప్రతిపాదనలోని బిజినెస్‌ప్లాన్, రెవెన్యూ వాటా మున్నగు అంశములన్నిటి గురించి

పోటీదారులకు తెలియ పర్చవలసిన అవసరముంది. అందుకు భిన్నంగా సింగపూర్ సంస్థ "రెవిన్యూ షేర్ / బిజినెస్ ప్లాన్"ను సీల్డ్ కవర్‌లో ఉంచి దానిని "Propritory InformationÑÑ క్రింద రహస్యంగా ఉంచాలని కోరిన దానిని రాష్ట్రప్రభుత్వం ఆమోదించటం సరికాదని న్యాయమూర్తి భావించారు. పేటెంట్లు, కాపీరైట్లు వంటివి తప్ప బిజినెస్ ప్లాన్ మరియు రెవిన్యూ షేర్ వంటి అంశములు ప్రొప్రయిటరీ ఇన్ఫర్మేషన్ క్రిందకు రాదని కోర్టు భావించింది. సింగపూర్ ప్రతిపాదనలో రెవెన్యూ షేరింగ్/ బిజినెస్ ప్లాన్‌లను పరిశీలించకుండానే ప్రభుత్వానికి లాభదాయకమని భావించటం సరికాదన్నారు. ఈ వివరాలను బహిర్గతం చేసినప్పుడే పోటీదారులు తమవైపు నుండి మెరుగైన ప్రతిపాదనలు ఇవ్వటానికి అస్కారం కలుగుతుంది. వచ్చినవాటిలో అత్యుత్తమమైన ప్రతిపాదనకు మొదటి ప్రతిపాదకుడు (O.P.P) అంగీకరించితే ఆ సంస్థకే ప్రాజెక్ట్ దక్కుతుంది. అలాకాకపోతే అత్యుత్తమ ప్రతిపాదన ఇచ్చిన సంస్థకు అవకాశం దక్కుతుంది.

**లండన్ కోర్టు దాకా ఎందుకు వెళ్లాలి?**

ఐలిబీ-32, 33 ల క్రింద కన్సీలియేషన్ బోర్డు ఏర్పాటు చేయవలసిన బాధ్యత రాష్ట్రప్రభుత్వంపైన ఉండగా ఆ పనిచేయకుండా "లండన్ కోర్ట్ ఆఫ్ ఇంటర్‌నేషనల్ ఆర్బిట్రేషన్"

కోర్టు వద్ద వివాదమును పరిష్కరించుకొనవలెనన్న సింగపూర్ సంస్థ ప్రతిపాదనను రాష్ట్రప్రభుత్వం ఆమోదించి ఆర్.పి.ఎఫ్.లో పొందుపర్చటం చట్టవిరుద్ధమని (In legality) కోర్టు భావించినది. కన్సీలియేషన్ ప్రొసీడింగ్స్ ఏవిధంగా జరగాలో స్పష్టంగా చాప్టర్-VI సెక్షన్ 30 నుండి 53 వరకు వివరంగా పేర్కొనబడ్డాయి. అయితే ఈ సూత్రాలు ఈ అగ్రిమెంట్‌కు వర్తించవని మన రాష్ట్రప్రభుత్వం అంగీకరించటం ఏవిధంగానూ సమర్థనీయం కాదు.

**టెండర్ నిబంధనలు, సింగపూర్ సంస్థల లాభం కొరకే:**

సుప్రీంకోర్టు ఇచ్చిన కొన్ని తీర్పులను ఉదహరించుతూ న్యాయమూర్తి గారు ప్రభుత్వ అడ్వకేట్ జనరల్ చేసిన వాదనలో పసలేదని, 10 ఏండ్లలో కనీసం 500 హెక్టార్లలో విదేశాల్లో ల్యాండ్ డెవలప్‌మెంట్ చేసి ఉండాలని, 50 లక్షల చ.అ.ల నిర్మాణాలను చేసివుండాలని, 25వేల మందికి ఉపాధి కల్పించి ఉండాలని మున్నగు టెండర్ నిబంధనలు బిడ్ ప్రాసెసింగ్ ఫీజు రూ.25లక్షలు, బిడ్ సెక్యూరిటీ డిపాజిట్ 6కోట్ల 35 లక్షల 50వేలు ఉండాలని, నెట్‌వర్త్ రూ.2వేల కోట్లు ఉండాలని పేర్కొనబడిన టెండర్ నిబంధనలు మన దేశంలోని నిర్మాణ సంస్థలను పోటీలో పాల్గొనటానికి

అర్హతలేకుండా చేయటానికి, విదేశీ సంస్థలకు అవకాశం (ఫేవర్) కల్పించటానికి దోహదపడేలా ఉన్నాయన్న పిటీషనర్ల వాదనలలో బలముందని న్యాయస్థానం పేర్కొన్నది.

**అందరికి సమాన అవకాశం ఇవ్వవద్దా?**

సింగపూర్ సంస్థ మొదటి ప్రతిపాదన 31-10-2015న ఇవ్వగా సవరించిన ప్రతిపాదన 21-03-2016న ఇచ్చింది. అనగా దాదాపు 4 నెలల 20 రోజులు వ్యవధి లభించింది. కాని ది 28-08-2016 "ఎడ్డెండమ్ - క్లారిఫికేషన్స్" ప్రకారం పోటీ బిడ్ల దాఖలు గడువు 13-09-2016 కాగా 10 రోజుల్లో అంటే 23-09-2016 నాటికి కమర్షియల్ బిడ్లు దాఖలు చేయాలి. దీనివలన మొదటి ప్రతిపాదనదారు సింగపూర్ సంస్థకు చాలా ఎక్కువ సమయం లభించగా, పోటీ బిడ్లు దాఖలు చేయతలపెట్టిన సంస్థలకు చాలా తక్కువ సమయం లభించింది. అంటే పోటీదార్లకు అందరికీ సమాన సమయం లభించలేదు.

పైన పేర్కొన్న కారణముల వలన స్విస్ చాలెంజ్ పద్ధతిలో 1691 ఎకరముల విస్తీర్ణంలో "స్టార్టప్ ఏరియా" అభివృద్ధి ప్రాజెక్టునకు "స్టే" విధించారు. తీర్పులో ఉదహరించిన పొరపాట్లను/లోపాలను/తప్పులను సవరించుకునేబదులు తాను ముఖ్యమంత్రిగా ఉండగా రూపొందించబడిన పటిష్టమైన ఎ.పి.ఐ.డి.ఇ. చట్టం 2001నకు అనేక సవరణలను ప్రతిపాదించి సదరు చట్టమునకు తెలుగుదేశం ప్రభుత్వం దాదాపు మంగళంపాడింది. పెద్ద సంఖ్యలో శాసనసభ్యుల బలం ఉన్నప్పటికీ, సరియైన అవగాహన, ఆలోచన, ప్రణాళిక, హోమ్‌వర్క్ లేకుండా ప్రతిపక్ష వై.ఎస్.ఆర్ పార్టీ ఈ బిల్లుపైన, "పారదర్శకతతోకూడిన భూసేకరణ, నష్టపరిహారం, పునరావాస బిల్లు-2017"ల పైన చర్చించకుండా "10వ తరగతి" ప్రశ్నాపత్రం లీకేజి పేరుతో గందరగోళం కొనసాగించడం అత్యంత దురదృష్టకరం. ఈ పరిస్థితిని అవకాశంగా మలుచుకొని అధికారపక్షం వ్యూహాత్మకంగా తెలివితేటలతో, ఎంతమాత్రం చర్చలేకుండానే ఎంతో కీలకమైన ఈ రెండు సవరణ బిల్లులను ఆమోదింప చేసుకుంది. ఫలితంగా బహుళ పంటలు పండే భూములతో సహా లక్షలాది ఎకరాల భూములను రైతుల ఆమోదం, గ్రామ సభల ఆమోదం, సామాజిక ప్రభావం అంచనా వంటి కీలకమైన అంశాలను పక్కన పెట్టడం వలన రైతాంగం తీవ్రంగా నష్టపోనుంది. సెక్షన్ 10 క్రింద Infrastructure అథారిటి యొక్క పరిధిలోని విధులు దాదాపు అన్నిటినీ తొలగించటం, అట్లాగే Section 11 క్రింద ఉన్న అధికారాలను తొలగించటం, Section -12లో ప్రభుత్వానికి రిపోర్టు ఇవ్వటం, Section -16లో ప్రభుత్వానికి రికమెండ్ చేయటం,

Section -19లో క్లాజ్ ii స్విస్ చాలెంజ్ ప్రక్రియకు సంబంధించి సబ్‌క్లాజు iv, v, vi, vii లను తొలగించటం. బిడ్‌లపైన నిర్ణయం తీసుకునే విషయంలో Infrastructure Authority కి కాకుండా ప్రభుత్వానికే అధికారాలు దఖలుపడటం, Infrastructure Project Fund నిర్వహణ కొరకు Section -56 టు 60 సెక్షన్‌లను పూర్తిగా తొలగించటం, మున్నగు సవరణల వలన నాన్‌కేవాస్తే తప్ప Infrastructure Authority కి ఏమాత్రం అధికారాలు ఉండవు.

కేవలం సింగపూర్ సంస్థకు లాభం చేరూర్చుట కొరకు రాష్ట్ర ప్రభుత్వం దీర్ఘకాలిక ప్రయోజనాలు ఉన్న, ఎంతో పరిపాలన అనుభవం కలిగిన అధికారులు, నిపుణులతో చర్చించబడి రూపొందించబడిన ఒక మంచి చట్టాన్ని కోరలు లేని జీవశ్చవంగా తయారుచేసినందువలన రానున్న కాలంలో మన రాష్ట్రంలో అభివృద్ధి పథకాల పేరుతో చోటుచేసుకొంటూ ఉన్న పలు లోపాలకు పాలకులు న్యాయస్థానాలలో సమాధానం నేరుగా చెప్పుకొనవలసిన పరిస్థితులు ఎదురవుతాయని భావించటంలో పొరపాటు ఉండదు. పారదర్శకతతో, పక్షపాతరహితంగా అర్హులకే అభివృద్ధి ప్రాజెక్టులకు అవకాశం కల్పించే కీలక "A.P. Infrastructure Authority"ను నిర్వీర్యం చేయటం వలన రానున్నకాలంలో పలు దుష్పరిణామాలు సంభవించే అవకాశం ఉంది.

* * *

# ఎ.పి.లో గాడి తప్పుతున్న ఆర్థిక క్రమశిక్షణ

లోగడ యన్.టి.రామారావుగారు ముఖ్యమంత్రిగా వుండగా జయప్రకాష్ నారాయణ్ (ఐ.ఎ.ఎస్) గారు ఆయన వద్ద కార్యదర్శిగా పనిచేశారు. ఒక సందర్భములో యన్.టి.రామారావు గారితో తన అనుభవాల గురించి చెబుతూ యన్.టి.ఆర్. ఎంత జాగ్రత్తగా ప్రభుత్వ ధనాన్ని ఖర్చు చేస్తూ ఉండేవారో వివరించారు. అప్పట్లో యన్.టి.రామారావుగారు ముఖ్యమంత్రిగా వాడే వాహనం పాతదై సెక్యూరిటీ సిబ్బంది వాహనాలతోపాటు వేగంగా పరుగెత్తలేకపోతూ వుందని, భద్రతా కారణాల దృష్ట్యా పాతకారు స్థానంలో కొత్తకారును వాడటం అవసరమని హోంశాఖ వారు సూచించారు. ఆ రోజుల్లో కొత్తకారు కోసం 4 లక్షల రూపాయలు ప్రభుత్వ ధనాన్ని ఖర్చు చేయడం యిష్టంలేక రామారావుగారు పాత కారునే రిపేరు చేయించి వాడారని జయప్రకాష్ చెప్పారు. రామారావు గారు తన స్వంత ధనాన్ని ఎంత పొదుపుగా, జాగ్రత్తగా వాడే వారో ప్రభుత్వ ధనాన్ని కూడా అంతే జాగ్రత్తగా ఖర్చు చేస్తూ ఉండేవారు, అనేందుకు యిది ఒక ఉదాహరణ.

అనేక కారణాలవలన నవ్యాంధ్ర ప్రదేశ్‌లో చంద్రబాబు నాయుడు గారి ప్రభుత్వం ఒకవైపు నిధుల కొరతను ఎదుర్కొంటూనే, మరొకవైపు విచ్చలవిడిగా, మంచినీళ్ళ ప్రాయంగా వందలాది కోట్ల రూపాయలను ఖర్చు చేస్తూ ఉండటం బాధాకరం. క్రిందటి పర్యాయం చంద్రబాబు నాయుడు గారు ముఖ్యమంత్రిగా పలు సంస్కరణలను అమలు చేశారు. శ్రమదానం, జన్మభూమి, సాగునీటి సంఘాలు, డ్వాక్రా మహిళా సంఘాలు, వన సంరక్షణ సమితులు, మున్నగు వాటి ద్వారా ప్రజలను భాగస్వాములుగా చేసి, ఆయా పథకాలు సక్రమముగా, సమర్ధవంతంగా అమలయ్యేందుకు కృషి సల్పారు. ఇప్పుడు ప్రభుత్వమే అన్ని అంశాలను నిర్వర్తిస్తుందనే భావనను కలుగచేస్తూ వున్నారు.

లోగడ 9 సం.లు ముఖ్యమంత్రిగా పని చేసిన కాలంలో ఢిల్లీకి కాని, యితర నగరాలకు కాని, విదేశములకు కాని ప్రయాణించవలసి వచ్చినప్పుడు "సర్వీసు ఫ్లైట్లలోనే" ప్రయాణిస్తూ ఉండేవారు. ఇప్పుడు దాదాపు అన్ని "ప్రత్యేక ఫ్లైట్ల"లోనే, కోట్లాది రూపాయలు ఖర్చుచేస్తూ వున్నారు. విదేశములకు కూడా ప్రత్యేక ఫ్లైట్లలోనే ప్రయాణిస్తూ వున్నారు.

జిల్లా కలెక్టర్లతో బేటీ కాని, పారిశ్రామికవేత్తలతో, వ్యాపారవేత్తలతో సమావేశములకు హైద్రాబాదులోని జూబ్లీ హాలులో, యం.సి.ఆర్. మానవ వనరుల అభివృద్ధి సంస్థ ప్రాంగణంలో కాని, సెక్రటేరియట్‌లో కాని నిర్వహిస్తూ ఉండేవారు. అందుకు భిన్నంగా ఈనాడు దాదాపు అన్ని సమావేశములను స్టార్ హోటల్స్‌లో లక్షలకు లక్షల రూపాయలు ఖర్చు చేస్తూ, నిర్వహిస్తూ ఉన్నారు. విజయవాడలో కలెక్టర్ క్యాంపు కార్యాలయములోని కాన్ఫరెన్స్ హాలు, సబ్ కలెక్టర్ ఆఫీసు లోని కాన్ఫరెన్సు హాలు, గుంటూరు లోని జిల్లా పరిషత్ మీటింగు హాలు వంటివి ఉండగా, ప్రతి పర్యాయము అనేక లక్షల రూపాయలు ఖర్చయ్యే స్టార్ హోటళ్ళ మీటింగులు రాష్ట్రం ఇప్పుడు ఎదుర్కొంటూ వున్న గడ్డు ఆర్థిక పరిస్థితులలో ఎంతమాత్రమూ సమర్థనీయంకాదు.

చాలా కాలం క్రితమే సింగపూర్ సంస్థలు "సీడ్ క్యాపిటల్"లో రాజ్‌భవన్, శాసనసభ, శాసనమండలి, సెక్రటేరియట్-హెచ్.ఓ.డీ.ల కార్యాలయములు, హైకోర్టు, ప్రజాప్రతినిదులు-ఉద్యోగుల నివాస సముదాయాలు, ఎక్కడెక్కడ నిర్మించినచో ప్రజలందరికి అనుకూలంగా ఉంటుందో సూచించి వున్నారు. అత్యంత ఆధునిక, సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకుంటే పైన పేర్కొన్న సంస్థలను నిర్మించుకొనటానికి తక్కువ సమయం పడుతుంది. ఆంధ్రప్రదేశ్ పునర్ వ్యవస్థీకరణ చట్టం ప్రకారం 10 సంవత్సరములపాటు హైదరాబాద్‌లో ఎ.పి. ప్రభుత్వ కార్యక్రమాలు కొనసాగించుకొనే వెసులుబాటు మనకు వుంది. హైద్రాబాద్ లోని సెక్రటేరియట్‌లో ఎ.పి. సి.యం. ఆఫీసును కోట్ల రూపాయలు ఖర్చు చేసి ఆధునీకరించారు. కోట్ల రూపాయలను వెచ్చించి లేక్‌వ్యూ గెస్ట్ హౌస్‌ను సి.యం. క్యాంపు కార్యాలయముగా తీర్చి దిద్దారు. బహుశ "ఓటుకు నోటు - ఫోన్ ట్యాపింగ్" వ్యవహారంలో కుదిరిన రాజీ సూత్రంను అనుసరించి ఎ.పి ప్రభుత్వ పాలనా వ్యవహారములను విజయవాడ సమీపం నుండే నిర్వహించు కోవాలనే ఆలోచనకు అనుగుణంగా విజయవాడలో ఇరిగేషన్ ప్రాంగణములో కోట్ల రూపాయలు ఖర్చు చేసి సి.యం క్యాంపు కార్యాలయాన్ని తయారు చేశారు.

గన్నవరం సమీపంలో మేధా టవర్స్, బందరు రోడ్డులో సబ్-కలెక్టర్ ఆఫీసుకు ఎదురుగా వున్న కెనాల్ గెస్ట్ హౌస్ ప్రాంగణములో వున్న లైలా కాంప్లెక్స్‌ను కొద్ది లక్షల రూపాయలు ఖర్చు చేసి ఉపయోగించుకోగల అవకాశం ఉన్నవాటిని ప్రక్కనపెట్టి వెలగపూడి వద్ద సుమారు రూ.200కోట్ల వ్యయంతో తాత్కాలిక రాజధాని భవనాన్ని కట్టిస్తూ వున్నారు. మొదట్లో "జి+1 అంతస్థులు అని చెప్పిన ప్రభుత్వం, యిపుడు ఇంకా రెండు అంతస్థులను హెచ్.ఓ.డి.ల కొరకు నిర్మించాలని నిర్ణయం తీసుకొంది. ఈ భవనం పైన మొత్తంగా నాలుగు అంతస్థులను నిర్మించటానికి లోపల, వెలుపల సుందరీకరణకు, కార్యాలయాల నిర్వహణకు అనుకూలంగా ఫర్నిచర్, యితర మౌలిక సదుపాయాలకు దాదాపు రూ.600 కోట్ల రూపాయలు

పైనే ఖర్చవుతుంది. పునర్విభజన చట్టంలో నూతన రాష్ట్రానికి అత్యంత అవసరమైన రాజ్‌భవన్‌తో సహా పైన పేర్కొన్న ప్రభుత్వ భవనముల నిర్మాణమునకు, మౌలిక వసతుల కల్పనకు కేంద్రప్రభుత్వం విధిగా నిధులను సమకూర్చవలసి వున్నది. యిప్పుడు నిర్మిస్తూ వున్న తాత్కాలిక సచివాలయ భవనమునకు అయ్యే ఖర్చు భరించి తిరిగి శాశ్వత సచివాలయ భవన నిర్మాణానికి కేంద్రం నిధులను అందచేయటం ఎట్టి పరిస్థితుల లోనూ జరుగదు. తాత్కాలిక సచివాలయ నిర్మాణ వ్యయమును రాష్ట్ర ప్రభుత్వమే భరించవలసి ఉంటుంది.

అంతర్జాతీయ సంస్థలు ప్రభుత్వ భవనాల ఆకృతులకు సంబంధించిన ప్రతిపాదనలను రాష్ట్ర ప్రభుత్వానికి అందచేసి వున్నారు. కావున ప్రభుత్వ భవనాల సదుపాయం కొరకు కేటాయిస్తూవున్న 900 ఎకరాల విస్తీర్ణంలోనే ప్రభుత్వం కోరుకున్నచోట శాశ్వత సెక్రటేరియట్ భవన నిర్మాణం ప్రారంభించి ఉంటే సమంజసంగా ఉండేది. వెలగపూడి సమీపములో యిప్పుడు నిర్మిస్తూఉన్న తాత్కాలిక సచివాలయ భవనాన్నే శాశ్వత సచివాలయ భవనంగా ఏర్పరచుకుంటే దాదాపు రూ.600కోట్ల ఆదా అవుతుంది.

విజయవాడ విశాఖపట్నం నగరాలలో మెట్రో రైళ్ళను నడపాలని రాష్ట్ర ప్రభుత్వం కోరినపుడు ఢిల్లీ మెట్రో రైల్ కార్పోరేషన్ (డి.యమ్.ఆర్.సి) విజయవాడలో మెట్రో రైళ్ళ ఏర్పాటుకు అవసరమైన జనాభా, ట్రాఫిక్ తగినంతగా లేవని, కనీసం 10 నుండి 15 సం.ల వరకు మెట్రో రైల్ ప్రాజెక్టు లాభసాటిగా ఉండదని, ప్రైవేటు సంస్థలు ముందుకు వచ్చే అవకాశం ఉండదని, రాష్ట్ర ప్రభుత్వమే చేపట్టి నిర్వహించు కోవాలని చెప్పి ఉన్నది. అయినప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం, కేంద్ర ప్రభుత్వం నుండి అవసరమైన అనుమతులు రాకుండానే జపాన్‌కు చెందిన జైకా నుండి రూ.4,200కోట్లు ఋణాన్ని తీసుకొని విజయవాడ మెట్రో రైల్ ప్రాజెక్టును పట్టాలకు ఎక్కించాలని ఆలోచిస్తూ ఉండటం ఎంతమాత్రమూ తగదు. ఇప్పటికీ మన 13 జిల్లాలలో ఎ.పి.యస్.ఆర్.టి.సి. ఏడాదికి 500 కోట్లు నష్టాలతో నడుస్తూ ఉండగా, ఆర్థికంగా లాభసాటికాని విజయవాడ మెట్రో రైల్ ప్రాజెక్టు అంశంపై రాష్ట్ర ప్రభుత్వం పునరాలోచన చెయ్యాలి.

మన రాష్ట్రం తూర్పు తీరంలో బావనపాడు వద్ద కాని, మరొకచోట కాని, విశాఖపట్నం పోర్టు ట్రస్టు ఒక నౌకాశ్రయాన్ని అభివృద్ధి చేసేందుకు ముందుకొస్తూ వున్నది. ఎంతోకాలంగా ముందుకు నడవని విజయవాడ-మచిలీపట్నం (ఎన్.హెచ్-9) నాలుగు లైన్ల రహదారి అభివృద్ధి కార్యక్రమం యిప్పుడు మొదలవ్వబోతూ వుంది. బందరులో ప్రభుత్వ ఆధీనంలో వున్న 2,300 ఎకరముల భూమిని అందించి వైజాగ్ పోర్టు ట్రస్టుతో బందరు పోర్టు అభివృద్ధికి శ్రీకారం చుట్టడం అవసరం. దీనిపైన రాష్ట్రప్రభుత్వంపై వ్యయభారం పడదు.

అలాగే విశాఖపట్నం ఎయిర్‌పోర్టు నుండి విదేశాలకు ఎయిర్ సర్వీసులు నడుస్తూనే వున్నాయి. ప్రక్కనే నేవీ ఆధీనంలో వున్న మరొక 400 ఎకరాల భూమిని ఎయిర్‌పోర్టుకు తీసుకొంటే, భోగాపురం వద్ద 5300 ఎకరాలలో గ్రీన్‌ఫీల్డ్ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టు నిర్మించాలన్న ప్రతిపాదన అవసరం ఉండదు.

నూతనంగా పరిశ్రమలను కాని, ఇతర అభివృద్ధి కార్యక్రమాలను కాని చేపట్టడానికి ముందుకువచ్చే దేశీయ, అంతర్జాతీయ పెట్టుబడిదారులకు ఆన్‌లైన్‌లో 15 రోజులలోనే అన్ని అనుమతులు ఇస్తామని పదేపదే ప్రకటిస్తూ వున్న ముఖ్యమంత్రిగార్కి లక్షలాదిమంది రైతులకు పాస్ పుస్తకాలు అందించటానికి నెలల తరబడి కాలయాపన జరుగుతూ ఉండటం, వేలకువేల రూపాయలు ముడుపులు చెల్లించితే తప్ప, పాస్ పుస్తకములు కాని, భూమి యాజమాన్య హక్కు పుస్తకములు కాని రైతు చేతికి అందటం లేదన్న చేదునిజం ముఖ్యమంత్రిగార్కి పట్టినట్లు కనపడటం లేదు.

గ్రామగ్రామాన త్రాగేందుకు 20 లీటర్ల మంచినీటిని రూ. 2/-లకే అందిస్తామన్న ఎన్నికల హామీ కాగితాలకే పరిమితం అయ్యింది. ముఖ్యమంత్రి గారు మొదటిగా సంతకం చేసిన "రైతు ఋణమాఫీ" పరిది తగ్గించబడి, వ్యవసాయ ఋణమాఫీని పంట ఋణాలకు, గరిష్టంగా 1.50 లక్షల రూపాయలకు కుదించబడి రూ. 24వేల కోట్లకు పరిమితి అయ్యింది. ఇప్పటికి సుమారు 7200 కోట్లు మాత్రమే బ్యాంకులకు జమపడినా, పలుమార్లు ముఖ్యమంత్రి గారు రూ. 24వేల కోట్లు మాఫీ చేసినట్లు మాట్లాడుతూ వుండటం ఆశ్చర్యకరం. ఇంకనూ రైతుల నుండి బ్యాంకులకు జమకావలసి వున్నా పంట ఋణాలపై బ్యాంకులు వడ్డీ వసూలు చేస్తున్నాయని రైతులు ప్రభుత్వానికి అనేక పర్యాయాలు మొరపెట్టుకున్నా యిప్పటికీ వడ్డీ వసూలు చెయ్యవద్దని రాష్ట్ర ప్రభుత్వం నుండికాని, ఆర్.బి.ఐ. నుండి కాని బ్యాంకులకు ఆదేశాలు రాకపోవటం విచారకరం.

అనేక గురుకుల పాఠశాలల్లో పేద విద్యార్థులకు మౌలిక సదుపాయాలు సరిగాలేవని, సాంఘిక సంక్షేమ హాస్టల్స్ సక్రమముగా నిర్వహించబడటం లేదని, ప్రభుత్వ కార్యాలయాలలో గత ప్రభుత్వ హయాములో పెచ్చు పెరిగిన అవినీతి ఎంతమాత్రము తగ్గలేదని ప్రముఖ దిన పత్రికలు, ఎలక్ట్రానిక్ మీడియాలలో వార్తలు వస్తున్నప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం తరపున స్పందన అంతంతమాత్రంగానే ఉండుట వలన సామాన్య ప్రజానీకం, ముఖ్యంగా బడుగు, బలహీన వర్గాలవారు నష్టపోతూ వున్నారన్న వాస్తవాన్ని అర్థం చేసుకొని, దిద్దుబాటు చర్యలను చేపట్టాల్సిన ఆవశ్యకత ఎంతోవుంది. రూ. 225 కోట్ల వ్యయంతో 125 అడుగుల ఎత్తైన బాబా సాహెబ్ అంబేద్కర్ విగ్రహం ఏర్పాటుకన్నా తాడిత, పీడిత ప్రజానీకం సర్వతోముఖాభివృద్ధి చెందేలా కార్యక్రమాలను అమలు చెయ్యటమే అంబేద్కర్ గార్కి యివ్వగలిగిన నిజమైన నివాళి అవుతుంది.

విభజన హామీల అమలుకు కేంద్రప్రభుత్వం సరిగ్గా సహకరించుట లేదని ముఖ్యమంత్రి, యితర మంత్రులు పలు పర్యాయములు ప్రకటిస్తూ ఉన్నారు. విభజన హామీలను అమలుపర్చటంలో కేంద్రప్రభుత్వ నిర్లక్ష్యం, ఉదాసీనత వాస్తవమే అయినప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం సరియైన సమయంలో సరైన నిర్ణయములు తీసుకొనటంలో లోపాలు కొట్టొచ్చినట్లు కనపడు తున్నాయి. ఉదాహరణకు షెడ్యూలు 10లో పేర్కొనబడిన సేవా సంస్థలు, సేవలను కొనసాగించే విషయములో ఎ.పి. మరియు తెలంగాణా రాష్ట్ర ప్రభుత్వములు విభజన జరిగిన నాటి నుండి ఒక సంవత్సరము లోపల చర్చించుకొని ఆమోదయోగ్యంగా విధివిదానాలను రూపొందించుకోవాలని, అలా ఏకగ్రీవంగా ఒక అభిప్రాయానికి రాలేని పక్షంలో కేంద్రప్రభుత్వం నిర్ణయించాలని స్పష్టంగా పేర్కొనబడింది. ఎక్కువ సంస్థల కేంద్రకార్యాలయాలు హైదరాబాద్‌లోనే ఉన్నాయి కావున తెలంగాణా ప్రభుత్వం ఉపేక్షించినా, మన అవసరం కాబట్టి ఎ.పి. ప్రభుత్వం చొరవ తీసుకుని తెలంగాణా ప్రబుత్వంతో చర్చించాలి. ఆ దిశగా చంద్రబాబు నాయుడు ప్రభుత్వం సకాలంలో తగు చర్యలు చేపట్టనందున ఉన్నత విద్యా మండలి, తెలుగు యూనివర్శిటీ మున్నగు సంస్థల నిర్వహణలో ఇబ్బందులు ఎదురయ్యాయి. అదేవిధంగా 9వ షెడ్యూల్‌లో ఎ.పి.యస్.ఆర్.టి.సి., ఎ.పి.జెన్ కో, ఎ.పి. ట్రాన్స్‌కో, ఎ.పి. అగ్రోస్ మున్నగు రాష్ట్రస్థాయి సంస్థలకు సంబంధించి ఆ సంస్థల శాఖలు ఏ రాష్ట్రంలో ఉంటే, అవి అలాగే కొనసాగుతాయని, హెడ్ క్వార్టర్స్ ఆస్తులను, వాటి విలువలను జనాభా నిష్పత్తి (52:48) థామాషాగా 3 సం.ల వ్యవధి లోపల ఉభయ రాష్ట్రాలు చర్చించుకొని అంగీకారమునకు రావాలని, అలారాలేని పక్షంలో కేంద్రప్రభుత్వం నిర్ణయం చేస్తుందని పేర్కొనబడింది. ఈ రెండు అంశాల విషయంను సమర్థులైన సీనియర్ ఐ.ఎ.ఎస్. ఆఫీసర్లకు అప్పగించి మన రాష్ట్రానికి న్యాయంగా రావలసిన ఆస్తులను లేక అందుకు సమాన ఆర్థిక విలువను పొందేందుకు రాష్ట్ర ప్రభుత్వం తగు చర్యలు తీసుకొనలేదని ప్రజలు భావిస్తున్నారు. కేవలం నలుగురు వ్యక్తుల పదవీకాంక్షలకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని నిట్టనిలువుగా, అసంబద్ధముగా చీల్చిన దుర్మార్గంలో ఒక్క సి.పి.యం. మినహా, అన్ని రాజకీయ పక్షాలకు భాగస్వామ్యం ఉన్నదని, "సమన్యాయం రెండు కళ్ళు" సిద్ధాంతంతో 13 జిల్లాల పునర్విభజించబడిన నవ్యాంధ్రప్రదేశ్ ప్రజల ప్రయోజనాలకు పరిరక్షించడంలో వైఫల్యం చెందిన వాస్తవాన్ని మరుగుపర్చి, ఇతర పార్టీలపైకి నెట్టి తమ రాజకీయ ప్రయోజనాలను కాపాడుకొనాలని ప్రయత్నించడం ఎంతమాత్రము తగదని, ప్రజలందరిని ఎల్లకాలం మాయమాటలతో మభ్యపెట్టలేమని పాలకులు గ్రహించాలి.

ఎంతసేపు అమరావతి రాజధాని, విదేశీ పెట్టుబడుల గురించే ఆలోచిస్తున్న ప్రభుత్వం, అనేక అంశాలలో తగురీతిలో స్పందించడం లేదు. యిందుకు ఒక చక్కని ఉదాహరణ కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన ఉదయ్ పథకంలో రాష్ట్ర ప్రభుత్వం చేరకపోవటం. మోడీ ప్రభుత్వం ఏర్పడిన తొలినాళ్ళలోనే ఎ.పి. ప్రభుత్వం ఎనర్జీ శాఖామాత్యులు పీయూష్ గోయల్‌తో ఉదయ్ పథకం లోనికి ఎ.పి. చేరాలని ఉందని చెప్పినా యిప్పటివరకు ఉదయ్ పథకంలో చేరటానికి అవసరమగు చర్యలను రాష్ట్ర ప్రభుత్వం చేపట్టకపోవటం పట్ల కేంద్రమంత్రి గోయల్ ఇటీవల విస్మయం ప్రకటించడం గమనార్హం. అందువలన యిప్పటికైనా చంద్రబాబు నాయుడు గారు పగటి కలలు కనడం మాని, రాష్ట్రప్రభుత్వానికి అందుబాటులో వున్న నిధులను జాగ్రత్తగా, పొదుపుగా, సమర్థవంతంగా వినియోగిస్తూ కోట్లాది ప్రజలకు ఉపయోగపడే పథకాలను చేపడుతూ, ప్రజలను భాగస్వాములను చేస్తూ పాలనలో అవినీతికి ఆస్కారం లేని పారదర్శకమైన పరిపాలనను అందిస్తూ, గంపెడు ఆశలతో తమ ప్రభుత్వ ఏర్పాటుకు మద్దతు ఇచ్చిన ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా సుపరిపాలనను అందించాలి.

* * *

# బుల్లెట్ రైళ్ళకన్నా రైల్వే వ్యవస్థ ఆధునీకరణకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలి

ఇటీవల రాజధాని, దురాంటో, శతాబ్ది రైళ్ళలో ఎ.సి. మొదటి తరగతి మరియు ఎగ్జిక్యూటివ్ క్లాస్‌లు కాక మిగతా II A.C²., III A.C²., చైర్‌కార్ మరియు సాధారణ తరగతులలో ప్రయాణించు ప్రయాణీకులపైన అదనపు భారం పడేలా "అదనపు ఆదాయము" కొరకు ఒక నూతన విధానాన్ని ప్రయోగాత్మకంగా రైల్వేశాఖామాత్యులు సురేష్‌ప్రభు ప్రవేశపెట్టారు. దీనిప్రకారం సదరు రైళ్ళలో, సదరు తరగతులలో మొదటి 10% సీట్ల వరకు ఇప్పుడున్న టికెట్ ధరలు (బేస్ ధర) వర్తిస్తూ, తదుపరి 10% సీట్లకు టిక్కెట్ ధర 10% చొప్పున పెరుగుతూ గరిష్ఠంగా 50% పెరుగుతాయి. ఈ విధానం ద్వారా సుమారు 5000 కోట్లరూపాయలు అదనపు ఆదాయాన్ని చేకూర్చుకోవచ్చని రైల్వే శాఖ భావిస్తూ ఉన్నది. దిగువ, ఎగువ, మధ్య తరగతి ప్రయాణీకులపైన అదనపు భారాన్ని రైల్వేశాఖ మోపబోతూ ఉంది. ఇప్పటికే ।రీశి జు౹ు చార్జీలు, విమాన చార్జీలకన్నా కొద్దిగా దిగువన ఉన్నాయి. కావున వాటిని ఇంకా పెంచే ప్రయత్నం రైల్వే మానుకుంది.

ప్రస్తుతం భారతీయ రైల్వేలలో సగటున ఒక ప్రయాణీకుడిని ఒక కిలోమీటరు దూరం చేరవేయటానికి రైల్వేకు అవుతున్న ఖర్చు 73 పైసలు కాగా, వసూలవుతున్నది 34 పైసలు మాత్రమే. 2016-17 సం.లో ప్రయాణీకుల చార్జీల ద్వారా 51,012 కోట్లు ఆదాయం రాగా సరుకు రవాణా ద్వారా రూ.1,17,932/- కోట్లు వస్తుందని అంచనా. ప్రయాణీకుల చేరవేతపై వస్తూవున్న నష్టాన్ని సరుకుల రవాణా ద్వారా వచ్చే ఆదాయం భర్తీ చేస్తూ వుంది. సగటున భారతీయ రైల్వేలు ప్రతిరోజు 7వేల పాసింజర్ రైళ్ళను, 4వేల గూడ్స్ రైళ్ళను నడుపుతూ వుంది. సగటున ప్రతిరోజు 2 కోట్ల 30 లక్షల ప్రయాణీకులకు రైల్వే సేవలు అందిస్తూ ఉన్నది.

గత శతాబ్ద కాలంలో భారత రైల్వే వ్యవస్థ గణనీయమైన ప్రగతిని సాధించింది. బస్సు, విమాన ప్రయాణములతో పోల్చితే ఇప్పటికీ రైల్వే చార్జీలే సరసంగా ఉంటాయి.

అయితే ప్రయాణీకులకు మెరుగైన సౌకర్యాలు కల్పించుటకు, భద్రతను మెరుగుపర్చుటకు, రైల్వే స్టేషన్ల ఆధునీకరణకు, రైల్వే లెవెల్ క్రాసింగ్‌ల నిర్వహణకు, బ్రిడ్జిల నిర్మాణమునకు, విద్యుద్ధీకరణ విస్తరణకు, అదనంగా లైన్లు నిర్మించుటకు, డెడికేటెడ్ ఫ్రైట్ కారిడార్ల నిర్మాణమునకు, ప్రధాన రైల్వే స్టేషన్ల ప్లాట్‌ఫారాల నిడివి పెంచుటకు, ఏటా అదనంగా బోగీల నిర్మాణమునకు, అదనంగా వ్యాగన్ల నిర్మాణమునకు మున్నగు అనేక అంశాలపైన దృష్టిని సారించి అందుకు అవసరమైన నిధులను కేటాయించి మారుతూఉన్న దేశ అవసరాలకు అనుగుణంగా సత్వరంగా అభివృద్ధి చేసుకోవలసిన అవసరం ఎంతైనా ఉంది. ప్రయాణీకుల చార్జీలను కొద్దిమేరకు పెంచటం ద్వారా కొన్ని వేల కోట్ల రూపాయలను సమకూర్చుకొన వచ్చును. పైన పేర్కొన్న రైళ్ళలోని తరగతులకు మొదటి 10% కాకుండా మొదటి 40% పైన 10% చొప్పున గరిష్టంగా 40%నకు పరిమితం చేసేలా విధానంను అమలుచేస్తే ప్రయాణీకులపైన అధికభారం పడదు. పలురైళ్ళకు అదనంగా జనరల్ కంపార్ట్‌మెంట్ బోగీలను కలపటం ద్వారా పేద, సామాన్య ప్రజానీకానికి సరసమైన ధరతో ప్రయాణం చేసేందుకు అవకాశాలను పెంచాలి. కొన్ని రైళ్ళలో జనరల్ కంపార్ట్‌మెంట్లలో కూర్చోడానికి ఖాళీ లేకపోగా నిలబడేందుకు కూడా విపరీతమైన ఒత్తిడి వలన మరుగుదొడ్ల సమీపంలో నిలబడుతూ వున్న దృశ్యాలు కనిపించటం బాధాకరం.

2016-2017 బడ్జెట్‌లో సురేష్‌ప్రభు రైల్వే వ్యవస్థ ఆధునీకరణకు, సామర్థ్యాన్ని పెంచటానికి, ప్రయాణీకుల సౌకర్యాలను పెంచటం మున్నగు పలు అంశాలపైన నిర్దిష్టంగా కార్యాచరణ చేయబోతూ వున్నట్లు ప్రకటించటం సంతోషదాయకం. అదే సమయంలో రూ.98,000/-లు కోట్లు వ్యయంకాగల ముంబాయి-అహ్మదాబాద్ బుల్లెట్ రైలు ప్రాజెక్టును చేపట్టబోతూ ఉన్నట్లు చెప్పటం ఎంతమాత్రం సరికాదు. ముంబయి-అహ్మదాబాద్‌ల మధ్య 500 కి.మీ. దూరమును గంటకు 300 కి.మీ. వేగంతో రెండు గంటలలో గమ్యం చేరవచ్చు. కాని ఈ ప్రాజెక్టు పూర్తి అయిన దరిమిలా టికెట్ ధర కనీసం రూ.10,000/-లు నుండి రూ.15,000/-లు మధ్యలో ఉంటే తప్ప బుల్లెట్ రైలు లాభదాయకంగా నడవదు. ప్రస్తుతం చెన్నై నుండి న్యూఢిల్లీకి కూడా బుల్లెట్ రైలును నడపాలనే సాధ్యాసాధ్యాలను ఫ్రాన్స్‌కు చెందిన సంస్థ పరిశీలిస్తూ ఉంది. దాదాపు 2182 కి.మీ. నిడివి ఉన్న ఈ మార్గంలో బుల్లెట్ రైలు నడపాలంటే రూ.4 లక్షల కోట్లకు పైగానే కాగలదు. ఇంత ఖరీదు పెట్టి టిక్కెట్ కొనగలిగిన ధనవంతులు ఫ్లైట్లలోనే (విమానంలో) వెళ్ళడానికి మొగ్గుచూపుతారు. రైల్వే వార్షిక బడ్జెట్ రూ.1.40 లక్షల కోట్లు కాగా ఒక్క బుల్లెట్ ట్రైన్ ప్రాజెక్టు కొరకే లక్షకోట్లు ఖర్చు చేయాలను కోవటం సమర్థనీయం కాదు. అతిపెద్ద వాణిజ్య, ఆర్థిక కూడలి భవనమును, దానిక్రింద బహుళ అంతస్థుల పార్కింగ్‌ను చేపట్టబోతూ ఉన్నందున ముంబయిలో బాంద్రా-కుర్లా ప్రాంతం నుండి నిర్మాణమును చేపట్టాలని రైల్వే శాఖ చేస్తూ ఉన్న ప్రయత్నాన్ని మహారాష్ట్ర ప్రభుత్వం అడ్డుకొంటూ వుంది.

అలాగే కొన్ని మెట్రో రైలు ప్రాజెక్టులు విషయంలో కూడా పునరాలోచన అవసరం. ఉదాహరణకు విజయవాడ మెట్రో రైలు ప్రతిపాదన విజయవాడ నగరంలో పెనమలూరు నుండి పండిట్ నెహ్రూ బస్ స్టేషన్ మరియు నిడమానూరు నుండి పండిట్ నెహ్రూ బస్ స్టేషన్ వరకు సుమారు 25 కి.మీ దూరమునకు దాదాపు రూ.6789 కోట్లు ఖర్చుతో కూడిన ఈ ప్రాజెక్ట్ రానున్న 15 లేదా 20 సం.ల దరిమిలాగాని వయబుల్ కాదని నిపుణులు తేల్చారు. ఇప్పటికే కేంద్రం ఇదమిద్ధంగా ఎంత ఇవ్వబోతూవున్నదో స్పష్టత రాకుండానే, విదేశీ సహకారం ఏ మేరకు రానున్నదో తెలియకుండానే ముందుగానే భూసేకరణ చేయాలని రాష్ట్రప్రభుత్వం తలపెట్టడం అభ్యంతరకరం. 2013 భూసేకరణ చట్టం ప్రకారం 50% పైన రైతుల అంగీకారం, సామాజిక ప్రభావం అంచనా, పర్యావరణంపైన పడనున్న ప్రభావం మున్నగు అంశములను అనుసరించి భూసేకరణ జరుగవలసి ఉంది. ప్రతిరోజు దాదాపు 70లక్షల మంది ప్రయాణం చేసే ముంబయి మెట్రో రైలు 2014-15లో 200 కోట్లు నష్టాలను చవిచూసిందన్న వాస్తవాన్ని మరువరాదు.

కేంద్రంలోని ఆర్థిక శాఖ అధికారులు కేంద్రప్రభుత్వ ఆర్థిక పరిస్థితి కూడా సంతృప్తికరంగా లేదని, దేశానికి ఉన్న ఋణ భారం, చెల్లింపులు, వడ్డీ, మున్నగు వాటిలో సతమతమవుతూ వున్నట్లు అప్పుడప్పుడూ తెలియపర్చుతున్నారు. వాజ్‌పేయి గారి హయాంలో "బంగారు చతుర్భుజం" జాతీయ రహదారుల ప్రాజెక్టు అమలు చేసిన దరిమిలా జాతీయ రహదారుల నెట్‌వర్క్‌పైన, సరుకుల రవాణా వాహనాల సంఖ్య చాలా అధికం అయినది. దానితోపాటు డీజల్ ఆయిల్ వినియోగం, వాయుకాలుష్యం, ప్రమాదముల సంఖ్య, రవాణావ్యయం విపరీతంగా పెరిగాయి. రైల్వే 'డెడికేటెడ్ ఫ్రైట్ కారిడార్‌లు' నిర్మించినచో సరకుల రవాణా ఎక్కువగా వ్యాగన్ల ద్వారా రవాణా అయ్యే పరిస్థితి ఉంటుంది. భారత ప్రభుత్వం పైన విదేశాల నుండి క్రూడ్ ఆయిల్ దిగుమతి వ్యయం గణనీయంగా తగ్గుతుంది. కావున ముంబయి నుండి అహ్మదాబాద్, చెన్నై నుండి ఢిల్లీ మున్నగు బుల్లెట్ రైలు ప్రతిపాదనలను ప్రక్కనపెట్టి "డెడికేటెడ్ ఫ్రైట్ కారిడార్‌ల" నిర్మాణమునకు, రైల్వే విద్యుద్దీకరణ విస్తరణ కొరకు అత్యధిక ప్రాధాన్యం ఇవ్వటం అవసరం. నగరముల సమీపములో యం.యం.టి.సి., ఎలక్ట్రికల్ మల్టిపుల్ యూనిట్లు, డీజిల్ మల్టిపుల్ యూనిట్లు సరిపడా సంఖ్యలో నడపటం ద్వారా పట్టణ ప్రాంతాలలో తక్కువ వ్యయంతో పట్టణ ప్రజలకు రవాణా సౌకర్యమును మెరుగు పర్చవచ్చు. ఉదాహరణకు విజయవాడ-గుంటూరు-తెనాలి మార్గంలో సబర్బన్ రైళ్ళను నడపటం ద్వారా రోడ్డు రవాణాపై ఒత్తిడిని తగ్గించవచ్చు. ఇట్టి నేపధ్యంలో కేంద్రప్రభుత్వం గాని, మన రాష్ట్ర ప్రభుత్వంగాని వనరులను పొదుపుగా సమర్ధవంతంగా వినియోగిస్తూ ప్రగతికొరకు, ప్రగతి ఫలాలు సామాన్యునికి చేర్చేలా కృషి చేయవలసి ఉంటుంది.

❊ ❊ ❊

# ఎ.పి. టౌన్ షిప్ & ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పోరేషన్ (A.P.T.I.D.C) ఆధ్వర్యంలో "ప్రధానమంత్రి ఆవాస్ యోజన - ఎన్.టి.ఆర్. నగర్ పథకం" ప్రక్రియను పునఃపరిశీలించి నగర/పట్టణ పేద లబ్దిదారులపై పెనుభారం మోపరాదు

మన రాష్ట్రంలో 38 పట్టణాలలో స్వంత ఇల్లు లేని, రూ. 3లక్షల వార్షిక ఆదాయం లోపు పేదలకు జి+3 అంతస్తులలో 1,20,106 (జూ.ఇ.ఐ) ఇండ్లు నిర్మించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇటీవలనే ఈ పథకమునకు విజయవాడలో ముఖ్యమంత్రి గారు శంకుస్థాపన చేశారు.

**ప్రాజెక్టులో భాగంగా నిర్మించనున్న ఇళ్ళ రకాలు... వాటి వివరాలు**

| ఇళ్ళ రకం | నిర్మిత విస్తీర్ణం | నిర్మాణ వ్యయం | ప్రొద్దుటూరు పట్టణంలో | | ఇళ్ళు ఎలా ఉంటుందంటే |
|---|---|---|---|---|---|
| | | | ఇండ్ల సంఖ్య | మొత్తం వ్యయం | |
| మొదటి రకం | 300 చ.అ. | రూ.5.14 - 5.85లక్షలు | 400 | 19.02కోట్లు | ఒక పడక గది, హాలు వంటగది, స్నానపు గది |
| రెండో రకం | 365 చ.అ. | రూ.6.48 - 6.90లక్షలు | 1400 | 76.29కోట్లు | డిటో |
| మూడో రకం | 430 చ.అ. | రూ.7.40 - 7.90లక్షలు | 200 | 12.71కోట్లు | రెండు పడక గదులు+డిటో |

ఉదాహరణకు ప్రొద్దుటూరు పట్టణంలో నిర్మించనున్న ఇండ్లకు ఇంటర్నల్ బెంచ్‌మార్క్ వ్యయం రూ. 109.58 కోట్లు అనగా చ.అ.నకు రూ. 1,528/-లు వ్యయం అవుతుంది. ఎస్టిమేట్ అంచనా రూ. 128.15 కోట్ల ప్రకారం చ.అ.నకు రూ. 1,787/-లు అవుతుంది. ఈ పథకంలో కేంద్రప్రభుత్వం సబ్సిడీ రూ. 1.50 లక్షలు, రాష్ట్ర ప్రభుత్వం సబ్సిడీ రూ. 1.50 లక్షలు పోనూ మిగతా మొత్తం లబ్దిదారుడు భరించాలి.

తెలంగాణా రాష్ట్రంలో కార్పెట్ ఏరియా 407 చ.అ.+గోడల మందం 71 చ.అ. + కామన్ ఏరియా మెట్లతో సహా 82 చ.అ. మొత్తం 560 చ.అ. రెండు బెడ్ రూమ్‌లు, వంట గది, స్నానపు గది, యుటిలిటితో సహా ఇండ్లను నిర్మించి యిస్తూవుంది. కాంట్రాక్టు రేటు చ.అ.నకు రూ.946/-లు + కరెంటు, నీటి పైపులు, మున్నగువాటి కొరకు రూ.75,000/-లు (చ.అ.నకు రూ.134/-) దీనికి చ.అ.నకు టైల్స్ రూ.60/-లు కలిపినా మొత్తంగా చ.అ.నకు రూ.1,140/-లు అవుతూవుంది. తెలంగాణాలో లబ్దిదారులు ఒక్క పైసా కూడా చెల్లించవలసిన అవసరం లేదు. తెలంగాణ ప్రభుత్వం హుడ్కో నుండి రూ.15,893 కోట్లు ఋణం తీసుకుంది. నిర్మాణ ప్రక్రియను వికేంద్రీకరించి స్థానికంగా ఉండే బిల్డర్లకు అవకాశం కల్పించింది.

తెలంగాణాలో రూ.1,140/-లు మాత్రమే నిర్మాణ వ్యయం అవుతూ ఉంటే, ఆంధ్రప్రదేశ్‌లో చ.అ.నకు రూ.1,528/-నుండి రూ.1,787/-లు అవుతూ వుండటం వలన, లబ్దిదారులపైన చాలా హెచ్చుభారం అదనంగా పడుతుంది. తెలంగాణాలో వలే కాకున్నా, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సబ్సిడీ పోనూ అతి పేద లబ్దిదారులపైన కొద్దిమేరకు మాత్రమే భారం పడేలా ఉండాలి.

1,20,106 ఇండ్లపైన కొన్ని వందల కోట్ల రూపాయలు అదనపు భారం లబ్దిదారుల మీద పడగా కాంట్రాక్టర్లకు, కొందరు పెద్దలకు వందల కోట్ల రూపాయల లబ్ది చేకూరుతుంది.

అతిపెద్ద నిర్మాణ సంస్థలు కొన్నింటికి కట్టబెట్టడం కోసం "షేర్ వాల్ టెక్నాలజి" సాకుతో స్థానికంగా ఉండే బిల్డర్లు లేక హైదరాబాద్‌లో ఉంటూవున్న సెటిలర్ బిల్డర్లకు ఈ పథకంలో భాగస్వాములయ్యే అవకాశం లేదు. ప్రతి అంశములో విదేశీ సంస్థలు/ బహుళజాతి, బడా సంస్థలు మున్నగువాటికి అవకాశం కల్పిస్తూ స్థానికంగా ఉండే మధ్య/చిన్నతరహా సంస్థలను ప్రక్కనపెట్టడం ఎంతమాత్రం తగదు. కావున ప్రభుత్వం పునరాలోచించి "షేర్‌వాల్ టెక్నాలజీ"ని ప్రక్కనబెట్టి మామూలు పద్ధతిలో నిర్మించుటకు టెండర్లు పిలిచి స్థానికులకు అవకాశం కల్పించడం సమంజసంగా ఉంటుంది.

* * *

తేది: 30-05-2015

ప్రియమైన చంద్రబాబు నాయుడు గారు

నవ్యాంధ్ర రాజధాని అమరావతి నగర ప్రాంత మాస్టర్ ప్లానును సింగపూర్ మంత్రి ఈశ్వరన్ ఇటీవల ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రికి అందచేశారు. సింగపూరులో రూపొందించబడిన ఈ మాస్టర్ ప్లాను చాలా బాగుందని, దీని ద్వారా అమరావతిలో ప్రజా రాజధానిగా నిర్మించబడుతుంది అని చంద్రబాబు ప్రకటించినారు. తొమ్మిది ప్రణాళికలతో, తొమ్మిది వ్యూహాలతో రూపొందించబడిన ఈ ప్రణాళికపై పైన చూడటానికి చాలా మంచిగా, సుందరముగా కనిపించినా, లోతుగా పరిశీలించినప్పుడు వాస్తవ పరిస్థితులు, అవసరాలను పరిగణలో ఉంచుకొనకుండా తయారుచేసినట్లు కనుబడుతుంది.

ఉదాహరణకు అతి సమీపములో సువిశాల ప్రాంగణములో నాగార్జున యూనివర్శిటీ ఉండగా రాజధాని నగరములో ఒక యూనివర్శిటీని స్థాపించాలి అని సూచించటము ఏవిధంగా సమంజసము? ఏమైనా కొన్ని కొత్త కోర్సులను ప్రారంభించాలి అనుకుంటే నాగార్జున యూనివర్శిటీలో ప్రారంభించవచ్చు లేదా అమరావతి నగరములో ఒక విద్యా సంస్థను నూతన కోర్సుల కొరకు ప్రారంభించవచ్చు. మంగళగిరి వి.జి.టి. ఉడా టౌన్ షిప్‌లో ఆంధ్రక్రికెట్ అసోసియేషన్ అంతర్జాతీయ పోటీల నిర్వహణకు అనుకూలముగా సుందరమైన క్రికెట్ స్టేడియమ్‌ను నిర్మించుతూ ఉండగా రాజధాని నగరములో మరొక క్రికెట్ స్టేడియమ్‌ను నిర్మించాలనే సూచన సమర్ధనీయమా?

గన్నవరంలో ఎయిర్‌పోర్టును అంతర్జాతీయ ఎయిర్‌పోర్టుగా అభివృద్ధి చేయుటకు కేంద్రప్రభుత్వము సహకారము అందిస్తుంది అని కేంద్రమంత్రి అశోకగజపతిరాజు స్పష్టముగా ప్రకటించి ఉన్నారు. రన్‌వే పొడిగించుటకు, ఇతర మౌలిక వసతులకు అవసరమైన భూమిని సేకరించుటకు ప్రభుత్వ యంత్రాంగము కృషి చేస్తూ వుంది. అమరావతి రాజధాని నగరము నుండి గన్నవరం విమానాశ్రయము సుమారు 30 కిలోమీటర్ల దూరములో వుంటుంది. విజయవాడలో బెంజిసర్కిల్ వద్ద ప్లైఓవరు, రామవరప్పాడు రింగు నుండి, ప్రసాదంపాడు వరకు జాతీయ రహదారి విస్తరణ జరిగితే 30 ని.ల నుండి 45 ని.లలో గన్నవరం విమానాశ్రయమును చేరుకోవచ్చును. ఎన్నారై

హాస్పటల్‌కు సమీపములో పెదపరిమి, నిడుమ(్రు, ఎ(్రబాలెం, మున్నగు గ్రామాల పరిధిలో గ్రీన్ ఫీల్డ్ ఇంటర్ నేషనల్ విమానాశ్రయము నిర్మించాలి అనే సూచన అనుసరణీయమా? దేశములో రెండవదిగా సంవత్సరానికి 3 కోట్ల 53 లక్షల ప్రయాణీకుల రాకపోకలతో, ఒక కోటి ఇరువది లక్షల జనాభా కలిగిన ముంబాయి నగరములో ఛత్రపతి శివాజి అంతర్జాతీయ ఎయిర్ పోర్టు 5 టెర్మినల్స్‌తో కేవలం 1850 ఎకరముల విస్తీర్ణముతో నిర్వహించబడుతూ ఉన్న వాస్తవాన్ని పరిగణలో వుంచుకోవాలి. దేశములో నాల్గవ స్థానములో 47 లక్షల జనాభాతో ఏటా కోటి ముప్పది ఎనిమిది లక్షల ప్రయాణీకులతో చెన్నయ్ ఇంటర్ నేషనల్ ఎయిర్‌పోర్టు 3 టెర్మినల్స్‌తో 1283 ఎకరముల విస్తీర్ణములో ఏర్పాటై ఉన్నది. ఇప్పుడు విస్తరణ కొరకు 800 ఎకరాల విస్తీర్ణము సేకరించబడుతోంది. ఈ నేపథ్యములో గన్నవరం ఇంటర్ నేషనల్ ఎయిర్ పోర్టు అభివృద్ధి అయిన తరువాత, మంగళగిరి సమీపములో మరొక ఇంటర్ నేషనల్ ఎయిర్‌పోర్టు ప్రభుత్వముపైన పెను భారాన్ని మోపుతుంది. లోగడ శంషాబాద్ చుట్టుప్రక్కల ప్రభుత్వ భూములతోపాటు ఏ పంటలు పండని, రాళ్ళు, రప్పలు, తుప్పలతో కూడిన భూమిని హైదరాబాద్ అంతర్జాతీయ ఎయిర్‌పోర్టునకు తీసుకోబడినది. కాని ఇక్కడ పలురకాల పూలు, కూరగాయలు, ఇతర వాణిజ్య పంటలతో సస్యశ్యామలముగా ఉండే భూములను తీసుకోవాలి అనే సూచన గర్హనీయం.

అమరావతి రాజధాని నగర ప్రాంతములో 127 కి.మీ.ల నిడివిలో 150 నుండి 200 అడుగుల వెడల్పుతో ఆరు వరుసలు లేక 8 వరుసల ఎక్స్‌ప్రెస్ మరియు సెమీ ఎక్స్‌ప్రెస్ రహదారులు ఏర్పాటు చేయాలి అని సూచించబడినది. ఇప్పటికి హెచ్చుస్థాయిలో ట్రాఫిక్ ఉండే పలు జాతీయ రహదారులు నాలుగు వరుసలతో ఉన్నాయి. అక్కడక్కడ అత్యంత హెచ్చు ట్రాఫిక్ ఉండే భాగములలో ఆరు వరుసలుగా విస్తరించబడుతూ ఉన్నాయి. దాదాపు 230 కిలోమీటరు ఔటర్ రింగురోడ్డు ప్రతిపాదన చేయబడింది. దాదాపు 40 లక్షల పైన జనాభా కలిగిన హైదరాబాద్ నగరము చుట్టూ దాదాపు రూ.7వేల కోట్ల ఖర్చుతో చేపట్టబడిన హైదరాబాద్ ఔటర్ రింగు రోడ్డులో ఇంకా 33 కి.మీలు నిర్మించవలసి ఉంది. ఇప్పటికి ఆ రహదారిపై ఊహించిన ట్రాఫిక్‌లో 5% కూడా ప్రయాణించడము జరగటము లేదు. అందువలన ఇక్కడ 230 కి.మీల ఔటర్‌రింగ్‌రోడ్డు ప్రతిపాదన ఏవిధముగానూ అనుసరణీయం కాదు. ఫార్ములావన్ కార్ల రేసులకు మాత్రము ఉపయోగపడవచ్చు.

అమరావతి రాజధాని ప్రాంతములో 135 కి.మీ.ల నిడివిన మెట్రో రైలు కారిడార్‌లను ఏర్పాటు చేసి విజయవాడ నగర మెట్రో రైలు వ్యవస్థతో అనుసందానించాలి అనే సూచన రాష్ట్ర ప్రభుత్వ ఖజానాపై పెనుభారాన్ని మోపుతుంది. కిలోమీటరుకు

రూ. 200కోట్లు ఖర్చు అయ్యే అంశాన్ని దృష్టిలోపెట్టుకుంటే ఇందుకొరకు దాదాపు 27వేల కోట్ల రూపాయలను వెచ్చించవలసి ఉంటుంది. విజయవాడ నగరములో 26 కి.మీ.ల నిడివిలో దాదాపు రూ. 6723 కోట్ల వ్యయము అవుతుంది అని డి.యం.ఆర్.సి. రాష్ట్ర ప్రభుత్వమునకు నివేదిక ఇచ్చినది. విజయవాడ నగరములో మెట్రో రైల్ లాభాల లోనికి రావడానికి 7సం.ల పైనే సమయము పడుతుంది అని, అందువలన ప్రైవేటు సంస్థలు ఈ ప్రాజెక్టు చేపట్టడానికి ముందుకు రాకపోవచ్చును అని, కావున రాష్ట్ర ప్రభుత్వమే చేపట్టవలసి వుంటుంది అని శ్రీధరన్ లోగడే ప్రకటించి ఉన్నారు. ఈ నేపథ్యములో అమరావతి రాజధాని నగరము లోని మెట్రో రైలు వ్యవస్థ ఎన్ని దశాబ్దముల తరువాత లాభాలబాటను పడుతుందో ఊహించుకోవలసినదే.

అన్నిటికంటే ఆశ్చర్యకర విషయమేమిటంటే ప్రతిపాదిత రాజధాని నగర ప్రాంతములో 2 లేక 3 సం.లకు ఒక పర్యాయము కొండవీటివాగు వేలాది ఎకరముల విస్తీర్ణమును వరదలతో ముంచేసిన వాస్తవాన్ని రాష్ట్ర ప్రభుత్వము సింగపూర్ సంస్థల దృష్టికి కడవరకు తీసుకువెళ్ళకపోవటము శోచనీయము. ఇప్పుడు పెద్ద రిజర్వాయర్‌లను నిర్మించాలని, 10వేల ఎకరాల విస్తీర్ణమును రూ. 1500కోట్ల ఖర్చుతో 2 మీటర్ల ఎత్తున బరంతు చేయాలి అని నిర్ణయించటము సిగ్గుచేటు. కేంద్రం నియమించిన శివరామకృష్ణన్ కమిటీ చేసిన హెచ్చరికలను పెడచెవిన పెట్టిన పర్యవసానము ఇది.

ఏడాది పొడవునా పూలతో, కూరగాయలతో, అరటి, నిమ్మ, జామ, మున్నగు పలురకాల పండ్ల తోటలతో వేలాది మంది రైతులు, కౌలు రైతులు, వ్యవసాయ కార్మికులకు మెరుగైన ఆదాయాన్ని, జీవన ఉపాదిని కాలరాశి, పశ్చిక బయళ్ళను, పార్కులను వినోద కేంద్రాలను ఏర్పాటు చేయడము, ఇదే ప్రజా రాజధాని అని, చాటుకోవడము అభ్యంతరకరము. నదీతీరాన ఉన్న జరీబు భూములను తీసుకోవడము తగదని, ఆ ప్రాంతాన్ని ప్రఖ్యాత వ్యవసాయ శాస్త్రవేత్త యమ్.ఎస్. స్వామినాధన్ సూచించినట్లుగా వ్యవసాయ ఎక్స్‌పోర్టు జోన్‌గా ఏర్పాటు చేయడము ద్వారా మెట్ట భూములలో రాజధాని నిర్మాణము సందర్భముగా ఉపాదిని కోల్పోయే వేలాదిమంది కౌలు రైతులు, వ్యవసాయ కార్మికులకు ఈ ఎక్స్‌పోర్టు జోన్‌లో ఉపాధి కల్పించవచ్చు అని రైతు-రైతుకూలీల హక్కుల పరిరక్షణ సంఘముతోపాటు పలు రైతు సంఘాలు, ప్రజా సంఘాలు పలు పర్యాయములు సూచించినా వాటిని ప్రభుత్వము పరిగణలోనికి తీసుకోకపోవడము బాధాకరము.

కృష్ణా నది గర్భములో భవానీ ద్వీపముతోపాటు మరి కొన్ని ద్వీపములలో పర్యాటక రంగాన్ని ప్రోత్సహించేందుకు కొన్ని చర్యలు తీసుకోవలసి ఉంటుంది. అదే సమయములో మన 13 జిల్లాలలో పర్యాటక ప్రదేశములను సందర్శించుచున్న వారి సంఖ్య, రానున్న కాలములో పెరగనున్న సందర్శకుల సంఖ్యను దృష్టిలో ఉంచుకుని పర్యాటక పథకములను

అమలు చేయాలి. కృష్ణానదికి ఉత్తరపు వైపున కృష్ణా జిల్లాలో నదిని ఆనుకొని వున్న 12వేల ఎకరములను పర్యాటక రంగాన్ని అభివృద్ధి చేసేందుకు రైతుల నుండి సేకరించవలెను అనే రాష్ట్ర క్యాబినెట్ నిర్ణయము ఎంతమాత్రము సమంజసము కాదు.

రాష్ట్ర ప్రభుత్వము సింగపూర్ సంస్థలతో కుదుర్చుకొన్న అవగాహనా ఒప్పందమును తానంతట తాను ప్రజలకు బహిర్గతపరచవలసిన బాధ్యత ఉండగా, అలా చేయకపోగా, సమాచార హక్కు చట్టము ద్వారా వచ్చిన అభ్యర్థనలకు సమాధానము ఇవ్వకపోవటము పలు అనుమానాలకు తావు ఇస్తూ వుంది. ఇప్పుడు సింగపూర్ సంస్థలు అందచేసిన మాష్టర్ ప్లాన్‌ను బహిరంగపరచి ప్రజలు, మేధావులు, ఇంజనీర్లు, మున్నగు వర్గాల నుండి సూచనలను సేకరించి దానిపైన తుది నిర్ణయము తీసుకుని ముందుకు అడుగు వేయటము ఉత్తమము. రాజధాని నగర నిర్మాణములో పారదర్శకముగా ప్రభుత్వము వ్యవహరించాల్సివుంది. సాధ్యమైనంత మేరకు తక్కువ వ్యయముతో, తక్కువ విస్తీర్ణముతో, ప్రజలను ఎక్కువమందిని నిర్వాసితులుగా చేయని విధముగా రాజధాని నగర నిర్మాణము చేయవచ్చు అని శివరామకృష్ణన్ కమిటి చేసిన సిఫార్సులను దృష్టిలో పెట్టుకుని ప్రజా రాజదానిని నిర్మాంచాలని ప్రజలు కోరుకుంటున్నారు. వెనుకబడిన రాయలసీమ, ఉత్తరాంధ్ర జిల్లాలలో అమరావతి రాజదాని నగర నిర్మాణము పట్ల అసూయ, భేదభావాలు కలుగని రీతిలో రాష్ట్ర ప్రభుత్వము, కేంద్ర ప్రభుత్వ సహకారముతో రాజదాని నగర నిర్మాణమునకు నడుం బిగించాలి.

రాష్ట్ర విభజన అనంతరం మన రాష్ట్రంపైన పడిన షుమారు లక్షకోట్ల రూపాయల ఋణభారంనకుతోడు రైతు, డ్వాక్రా సంఘాల రుణమాఫీ భారం, 14వ ఫైనాన్స్ కమీషన్ సిఫార్సుల అమలు దరిమిలా కూడా ఎదుర్కోవలసి వున్న గడ్డు ఆర్థిక పరిస్థితిని దృష్టిలో వుంచుకొని వ్యవహరించాలి. ప్రపంచ బ్యాంకు, జపాన్, సింగపూర్ అందచేసే ఆర్థిక సహకారాన్ని అసంపూర్తిగా ఉన్న ఇరిగేషన్ ప్రాజెక్టులను పూర్తిచేయడానికి, వ్యవసాయ, అనుబంధ రంగాల ప్రగతి చిన్న, మధ్య తరహా పరిశ్రమల అభివృద్ధి మున్నగు వాటి కొరకు, సామాన్య ప్రజల దైనందిక జీవితములో అవసరమైన మౌళిక వసతులను, మెరుగైన పాలనను అధునాతన సాంకేతిక పరిజ్ఞానముతో, అందించేందుకు వినియోగించాలే తప్ప మెట్రో రైళ్ళు, అవసరము లేని ఇంటర్‌నేషనల్ ఎయిర్‌పోర్టులు, మున్నగు వాటిపైన వ్యయపర్చటము ఎంతమాత్రము తగదు.

కృతజ్ఞతలతో,
భవదీయుడు,

(వడ్డే శోభనాద్రీశ్వరరావు)

గౌ॥ శ్రీ॥ నారా చంద్రబాబు నాయుడు,
ముఖ్యమంత్రి,ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం,
సచివాలయం, హైద్రాబాద్

ప్రియమైన ముఖ్యమంత్రిగారు,

ఉయ్యూరు,

16-02-2016.

అమరావతి రాజధానిలో వెలగపూడి సమీపములో సుమారు రూ.201కోట్ల ఖర్చుతో ఆరు లక్షల చ.అ. ఫ్లోర్ ఏరియా లభ్యమయ్యేలా జూన్ 15 నాటికి తాత్కాలిక సెక్రటేరియట్ భవన నిర్మాణానికి మీరు 17వ తేదీన శంఖుస్థాపన చేయబోతూ వున్నట్లు పత్రికలలో తెలియవచ్చినది. ఇప్పటికే సింగపూర్, సుర్భానా, జురాంగ్ సంస్థలు లింగాయపాలెం, ఉద్ధండరాయునిపాలెం, తాళ్ళాయిపాలెం గ్రామాల పరిధిలో సుమారు 4000 ఎకరాల విస్తీర్ణములో ప్రభుత్వ కార్యాలయాలతోపాటు యితర సామాజిక మౌలిక సదుపాయాల కొరకు సీడ్ క్యాపిటల్ మాస్టర్ ప్లాన్‌ను అందచేసింది. అందులో లింగాయపాలెం గ్రామ సమీపంలో రాజ్‌భవన్, అసెంబ్లీ, కౌన్సిల్, సెక్రటేరియట్ మున్నగు ప్రభుత్వ భవనాల ఏర్పాటు గురించి కూడా స్పష్టముగా పేర్కొని ఉన్నది. దీనిని గురించి ఎవరికిని భిన్నాభిప్రాయములు లేవు. వీటి నిర్మాణమునకు అవుసరమైన నిధులను ఆంధ్రప్రదేశ్ విభజన చట్టం - 2014 హామీ ప్రకారం కేంద్ర ప్రభుత్వం నిధులను సమకూర్చవలసి ఉన్నది.

గతంలో ఏ నూతన రాజధాని అభివృద్ధి కొరకు కేంద్రప్రభుత్వం అందచేసిన నిధుల కన్నా ఎక్కువగా యిప్పటికే యింకా నిర్మాణ ప్రక్రియ ప్రారంభం కాకుండానే కేంద్ర ప్రభుత్వం రూ.1850 కోట్ల రూపాయలను అందచేసి ఉన్నది. రాజధాని నిర్మాణంలో అంశాలవారీగా అవుసరమయ్యే నిధుల గురించి రాష్ట్ర ప్రభుత్వం కేంద్రప్రభుత్వానికి నివేదికను అందచేసివుంది. అందులో సచివాలయ నిర్మాణమునకు రూ.218కోట్లు ఖర్చుకాగలదని అంచనా వేయబడింది. ఈ నేపధ్యంలో యిప్పుడు వెలగపూడి సమీపములో రూ.201 కోట్ల వ్యయంతో తాత్కాలిక సెక్రటేరియట్ భవన నిర్మాణము ఎంతమాత్రము సమర్ధనీయం కాదు.

కేంద్రము నుండి మన రాష్ట్రమునకు రావలసిన రెవిన్యూ లోటు భర్తీకొరకు నిధులు రాకుండా, రాష్ట్ర ప్రభుత్వ అంచాల మేరకు పన్నుల ఆదాయము రాకపోవటం, రైతు - డ్వాక్రా ఋణమాఫీ హామీల అమలుకాకుండా చాలా సంక్లిష్ట ఆర్ధిక పరిస్థితులను

రాష్ట్ర ప్రభుత్వం ఎదుర్కొటూ వున్న ప్రస్తుత పరిస్థితులలో తాత్కాలిక సెక్రటేరియట్ భవన నిర్మాణ ప్రతిపాదనను వెంటనే ఉపసంహరించుకొనవలసినదిగా విజ్ఞప్తి చేస్తున్నాను.

విజయవాడలో బందరు రోడ్డులో గతంలో టూరిజం అభివృద్ధి కొరకు లైలా గంగరాజుకు యిచ్చిన స్థలములో నిర్మించబడి అసంపూర్తిగా ఉన్న భవనమును, ప్రభుత్వం అందుకు అయిన నిర్మాణ వ్యయమును గంగరాజుకు యిచ్చే ప్రాతిపదికపై స్వాధీనం చేసుకొని రెండుమూడు నెలల్లోనే సకల సదుపాయములతో వాడుకలోనికి తీసుకురావచ్చు. దీనికితోడు ఎయిర్‌పోర్టుకు ఎదురుగా మేధా టవర్స్ భవనమును ఉపయోగించుకుంటే దాదాపు 4లక్షల చ.అ. ఏరియా అందుబాటులోనికి వస్తుంది. ఈనాడు అందుబాటులో ఉన్న టెక్నాలజి, 'పేపర్‌లెస్ వర్క్', మున్నగు ప్రక్రియల ద్వారా ఎక్కడ నుంచైనా ఉద్యోగులు తమ బాధ్యతలను నిర్వర్తించే వీలు వున్నది కావున మొత్తంగా యావన్మంది ఉద్యోగులు ఒక్కసారిగా హైదరాబాద్ నుండి అమరావతికి రావలసిన అవసరం లేదు. దశలవారీగా రప్పించవచ్చు.

సీడ్ క్యాపిటల్ మాస్టర్ ప్లాన్‌లో సూచించిన ప్రదేశములో శాశ్వత సెక్రటేరియట్ భవన నిర్మాణమును వెంటనే చేపట్టండి. కొద్ది నెలల క్రితం మున్సిపల్‌శాఖామంత్రి నారాయణ కొన్ని విదేశాలను సందర్శించి వచ్చిన దరిమిలా ప్రీ ప్యాబ్రికేటెడ్ భవన నిర్మాణ ప్రక్రియ ద్వారా కొద్ది నెలల వ్యవధిలో భారీ, పలు అంతస్తుల భవనాలను నిర్మించబడటం చూసినట్లు ప్రకటించి ఉన్నారు. యిప్పటికే కృష్ణా జిల్లా ఇబ్రహీంపట్నం మండలం కేతనకొండ గ్రామ సమీపములో కొన్ని విదేశీ-స్వదేశీ సంస్థలు ప్రీప్యాబ్రికేటెడ్ ప్రక్రియలో కొన్ని భవనములను నిర్మించు తున్నారు. కావున తాత్కాలిక సెక్రటేరియట్ కొరకు కాకుండా ఆ నిధులను శాశ్వత సెక్రటేరియట్ కొరకు వినియోగించాలి.

యిప్పటికి రాజధాని నిర్మాణం అందులో మౌలిఖ సదుపాయాల అభివృద్ధికి కేంద్రప్రభుత్వం అందచేసిన నిధుల వ్యయమునకు సంబంధించిన సమాచారమును ప్రజలకు తెలియచెప్పాల్సిన బాధ్యత ప్రభుత్వం పైన ఉన్నది.

కృతజ్ఞతలతో

భవదీయుడు

**శ్రీ నారాచంద్రబాబునాయుడు గారు,**
గౌ॥ ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి, విజయవాడ.

**(వడ్డే శోభనాద్రీశ్వరరావు)**

ఉయ్యూరు,

07-12-2016.

ప్రియమైన ముఖ్యమంత్రి గారు,

విషయం: **గన్నవరం విమానాశ్రయ రన్‌వే విస్తరణ గురించి.**

ఆంధ్రప్రదేశ్ విభజన చట్టం 2014 లోని హామీకి అనుగుణంగా కేంద్రప్రభుత్వం గన్నవరం అంతర్జాతీయ విమానాశ్రయ స్థాయి అభివృద్ధి కొరకు చర్యలు తీసుకొంటున్నది. ప్రస్తుతం విజయవాడ విమానాశ్రయమునకు సంవత్సరమునకు 6 లక్షల మంది ప్రయాణీకులు రాకపోకలు సాగిస్తూ ఉన్నారు. ప్రస్తుతం రన్ వే 2286 మీటర్ల నిడివి ఉన్నది. దీనిని మొదటి దశలో రూ.550 కోట్ల ఖర్చుతో 739 మీటర్లు పెంచి 3025 మీటర్ల నిడివికి పెంచేందుకు ఇప్పటికే చర్యలు తీసుకుంటూ ఉన్నారు. ఏలూరు కాల్వ అంచువరకు రన్‌వేను పొడిగించినచో 3960 మీటర్ల పొడవు అవుతుంది. రెండవ దశలో రూ.973 కోట్ల ఖర్చుతో 3960 మీటర్ల రన్‌వేతో అభివృద్ధి చేయుటకు మరియు 3వ దశలో రూ.749 కోట్ల ఖర్చుతో గన్నవరం అంతర్జాతీయ విమానాశ్రయమును అభివృద్ధి చేయు ప్రణాళికతో ఎయిర్‌పోర్టు అథారిటీ వారు చర్యలు తీసుకొంటూ వున్నారు. ఎంత పెద్ద విమానాలకైనా ఈ 3925 మీటర్లు సరిపోతుంది. వాస్తవానికి గన్నవరం విమానాశ్రయం సముద్ర మట్టమునకు దగ్గరగా ఉన్న సందర్భంలో ఎటువంటి విమానమునకైనా 348 రన్‌వే సరిపోతుందని సమాచారం ఉంది.

రన్‌వేను 4430 మీటర్లు నిడివికి పొడిగించుట కొరకు ఏలూరు కెనాల్‌ను డైవర్షన్ చేయాలని, ఆ సందర్భంలో జక్కులనెక్కలం, పురుషోత్తమపట్నం, కేసరపల్లి, వెంకటనరసింహాపురం, గన్నవరం, చినఅవుటపల్లి, పెద అవుటపల్లి మరియు ఆత్కూరు గ్రామాల మీదుగా ఏలూరు కాలువను ఏర్పాటు చేయుటకు ఈ గ్రామాల మీదుగా 428 ఎకరముల భూమిని తీసుకోవాలని, భూసేకరణతో సహా కాలువ నిర్మాణము కొరకు రూ. 1,000కోట్లు ఖర్చు కాగల పథకమును చేపట్టాలని భావించి సదరు భూమిని భూసమీకరణ విధానంలో తీసుకోవాలని ప్రభుత్వం ప్రతిపాదించినది. అంతేకాక ఏలూరు

కెనాల్‌కు దక్షిణపు వైపు కూడా (అల్లాపురం భూములు) షుమారు 100 ఎకరములుపైన తీసుకొనాలని ప్రతిపాదించబడినది. ఏలూరు కాలువ అంచువరకు బుద్ధవరం, అల్లాపురం గ్రామాలకు చెందిన భూములను రైతులు భూసమీకరణలో ఇప్పటికే అందచేసి ఉన్నారు. ఈ భూములను ఎయిర్‌పోర్టు అథారిటీ వారికి స్వాధీనపర్చితే సరిపోతుంది.

ఈ సందర్భంగా 3960 మీటర్ల రన్‌వేకు మించి అవసరం లేదని స్పష్టంగా మీ దృష్టికి తీసుకువస్తున్నాము. 18-08-2016న కేంద్ర విమానయాన శాఖామాత్యులు శ్రీ పి. అశోక్‌గజపతిరాజు, విజయవాడకు పుష్కరాల సమయంలో వచ్చినపుడు గన్నవరం విమానాశ్రయములో కలుసుకుని సమర్పించిన విజ్ఞాపన పత్రం కాపీని ఇందుతో మీ సమాచారం కొరకు జతపర్చు చున్నాను. 3660 మీటర్ల రన్‌వే మరియు 2990 ప్యార్‌లల

కృతజ్ఞతలతో

భవదీయుడు

**గౌ॥ శ్రీ నారా చంద్రబాబు నాయుడు గారు,**
ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వర్యులు.
విజయవాడ, ఆంధ్రప్రదేశ్

**(వడ్డే శోభనాద్రీశ్వరరావు)**

ఉయ్యూరు,

తేది:15-12-2016

ప్రియమైన చంద్రబాబునాయుడు గారు,

**విషయము:** విజయవాడ నగరములో కెనాల్ గెస్ట్ హౌస్ స్థలములో శ్రీ గోకరాజు గంగరాజు గారు నిర్మించిన భవనమును రాష్ట్ర ప్రభుత్వము స్వాధీనము చేసుకొనవలసిన ఆవశ్యకతను గురించి.

లోగడ మీరు ముఖ్యమంత్రిగా ఉండగా కెనాల్ గెస్ట్‌హౌస్ స్థలములో మల్టీ ప్లెక్సు ఏర్పాటు చేయటము ద్వారా టూరిజం అభివృద్ధికి దోహదపడుతుందని గోకరాజు గంగరాజు గారు అందచేసిన ప్రతిపాదనను జిల్లా యంత్రాంగము పరిశీలించిన సందర్భములో, నాడు వ్యవసాయ మంత్రిగా ఉన్న నేను అప్పటి జిల్లా కలెక్టరుగా ఉన్న బి.ఆర్. మీనాతో భవిష్యత్తులో రాష్ట్రప్రభుత్వ భవనాల సముదాయమును నిర్మించవలసిన ఆవశ్యకత వచ్చినచో కెనాల్ గెస్ట్ హౌస్ స్థలము అనుకూలముగా ఉంటుంది కావున దానికి ప్రత్యామ్నాయముగా కృష్ణలంక వద్ద వారధికి పడమర వైపున ఖాళీగావున్న ఆర్. &.బి. స్థలమును కేటాయించితే బాగుంటుందని సూచించినప్పటికీ, ఏ కారణము వలననో రాష్ట్రప్రభుత్వము కెనాల్ గెస్ట్‌హౌస్ స్థలమును గోకరాజు గంగరాజు గారికి లీజు ప్రాతిపదికన స్వాధీనపరచింది. సదరు స్థలములో గంగరాజు గారు ఒక భవనమును నిర్మించినారు. ఏ కారణము వలననో సదరు భవన నిర్మాణమును పూర్తి చేయకుండా, వేరేవారికి బదలాయించవలెననే ప్రయత్నము చేయగా న్యాయస్థానము అడ్డుపడిందని సమాచారము.

రాష్ట్ర విభజన దరిమిలా ప్రభుత్వ కార్యాలయముల కొరకు అనువైన భవనములను వివిధ శాఖలు అన్వేషిస్తూ వున్నాయి. ఇట్టి తరుణములో దాదాపు రూ.200కోట్ల విలువైన ప్రభుత్వ స్థలములో అసంపూర్తిగా నిర్మాణమై ఉన్న భవనమును రాష్ట్రప్రభుత్వము స్వాధీనము చేసుకొని స్వల్ప వ్యయముతో సదరు భవనమును సుందరముగా తీర్చిదిద్ది ప్రభుత్వ అవసరముల కొరకు వినియోగించుకొన వచ్చును. సదరు భవన నిర్మాణమునకై

గంగరాజు గారు వెచ్చించిన ధనాన్ని రాష్ట్రప్రభుత్వ ఆర్.&.బి. శాఖ వారిచే అంచనా వేయించి సదరు మొత్తమును రాష్ట్ర ప్రభుత్వము గంగరాజు గారికి ఇచ్చివేసి, ఆ భవనమును స్వాధీనపరచుకొనుట ప్రజాప్రయోజనాల దృష్ట్యా, ప్రస్తుత పరిస్థితులలో ఎంతైనా అవసరము. లోగడ కొన్ని ప్రాజెక్టుల కొరకు ప్రభుత్వ/ఏ.పి.ఐ.ఐ.సి. భూములను యిచ్చిన సందర్భములలో సదరు ప్రాజెక్టులను ప్రారంభించకపోయినపుడు ప్రభుత్వం ఆ ప్రాజెక్టులను రద్దు చేసి సదరు భూములను స్వాధీనం చేసుకుంటూ ఉన్న విషయాన్ని మీకు గుర్తు చేస్తున్నాను. నూతన ప్రభుత్వం ఏర్పాటై 30 మాసాల కాలము గడచిపోయినది. ఇకనైనా ఎంతమాత్రము జాప్యము లేకుండా సదరు భవనమును రాష్ట్రప్రభుత్వము స్వాధీనము చేసుకొనుటకు అవసరమైన చర్యలను చేపట్టాలని కోరుచున్నాను.

గౌ॥ శ్రీ నారా చంద్రబాబునాయుడు గారు
ముఖ్యమంత్రివర్యులు
ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం,
రాష్ట్ర ప్రభుత్వ సెక్రటేరియట్, వెలగపూడి
గుంటూరు జిల్లా, ఏ.పి.

కృతజ్ఞతలతో
భవదీయుడు

(వడ్డే శోభనాద్రీశ్వరరావు)

# వడ్డే శోభనాద్రీశ్వరరావు

## సంక్షిప్త సమాచారం

| | | |
|---|---|---|
| జనకులు | : | లేటు వడ్డే అంకయ్య -శ్రీమతి అన్నపూర్ణమ్మ గార్లు |
| జననం | : | 21-10-1943 ఉయ్యూరులో |
| విద్యార్హతలు | : | బి.ఎస్.సి., బి.ఇ. (మెకానికల్) |
| రాజకీయ ప్రస్థానం | : | 1972లో ఉయ్యూరు నుండి కాకాని గారిపై శాసనసభకు పోటీ<br>1977లో మచిలీపట్నం పార్లమెంటు సభ్యునిగా పోటీ<br>1978-83 ఉయ్యూరు శాసనసభ్యునిగా ఎన్నిక<br>1984-89 విజయవాడ 8వ లోక్‌సభ సభ్యునిగా ఎన్నిక<br>1991-96 విజయవాడ 10వ లోక్‌సభ సభ్యునిగా ఎన్నిక<br>1997-99 న్యూఢిల్లీలో ఎ.పి. ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధిగా నియామకం<br>1999-2004 మైలవరం శాసనసభ్యునిగా ఎన్నిక మరియు రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రిగా కృషి<br>2004 క్రియాశీలక రాజకీయాల నుండి స్వచ్ఛంద విరమణ |
| సామాజిక సేవలు | : | కలువపాముల గ్రామంలో మాతామహుని స్మారకార్థం పశువైద్యశాల మరియు పాల సేకరణ కేంద్ర భవనముల నిర్మాణం |
| | : | గండిగుంట దత్తాశ్రమంలో "వడ్డే శోభనాద్రి ఎ.సి. కళ్యాణ మండపము" నకు రూ. 10 లక్షల విరాళం. |
| | : | ఉయ్యూరు ఎ.జి. & ఎస్.జి. సిద్ధార్థ కళాశాలలో "వడ్డే శోభనాద్రి - యు.జి.సి. మల్టీ పర్పస్ ఇండోర్ స్టేడియం"నకు రూ. 10 లక్షల విరాళం |
| | : | ఉయ్యూరులో లయన్స్ ఇంటర్ నేషనల్ దయాలసిస్ సెంటర్‌నకు రూ. 60 లక్షల విలువ చేయు స్థలం బహూకరణ |
| సందర్శించిన విదేశములు | : | యు.ఎస్.ఎ., బ్రిటన్, ఫ్రాన్స్, జర్మని, నెదర్లాండ్స్, చైనా, సింగపూర్, హాంకాంగ్, ఫిలిప్పీన్స్, శ్రీలంక, నేపాల్ |
| పుస్తక రచనలు | : | ఆంధ్ర రైతు ఆవేదన, దగాపడిన ఆంధ్రరైతు (శాసనసభ ప్రసంగాలు) |
| | : | ప్రజల ఎదురుతెన్నులు - పాలకుల తీరుతెన్నులు<br>(8వ లోక్‌సభలో ఇంగ్లీషు ప్రసంగాలకు అనువాదం) |
| | : | రైతువాణి (10వ లోక్‌సభలో ఇంగ్లీషు ప్రసంగాలకు అనువాదం) |
| | : | దేశం కోసం రైతు - రైతు కోసం ఎవరు?<br>(దినపత్రికలలో ప్రచురించబడిన వ్యాసాల సంపుటి) |
| | : | సమైక్యతతోనే తెలుగు జాతి ప్రగతి |
| | : | అమరావతి - నవ్యాంధ్ర ప్రజా రాజధాని అయ్యేదెలా? |
| | : | గోరంత పెట్టుబడితో సింగపూర్ సంస్థలకు కొండంత లబ్ది |
| ప్రచురించిన | : | కిసాన్ ప్రధాని - చౌధురి చరణ్‌సింగ్ |
| పుస్తకములు | : | అపర భగీరథుడు డా॥ కె.ఎల్.రావు (క్యూసెక్స్ క్యాండిడేట్ అనువాదం)<br>గాంధేయపథంలో (ఇన్ ది గాంధేయన్ పాత్‌నకు అనువాదం)<br>ప్రజాసేవలో నా జీవన ప్రస్థానం (ఆత్మకథ) |